# ది ఒపీనియన్స్

స్ఫూర్తిలేని జీవితం పూర్తికాని చిత్రమే



శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి

# ది ఒపీనియన్స్

## శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి

స్ఫూర్తి పబ్లికేషన్స్
విజయవాడ – 520 002

# MY OPINION

Some of my Opinions may have been lasted in, the honey onion, amalgam. The stature of the human nature is such! The diversity of demos, dominates and diverges the Bio-plasmatic matter. So, generally flenilitty is common to Opinions; but it should be a flexible and persuasible. The book 'My opinions' does reflect the complexity of cognizance of its relaxative reading.

ఆలోచన – అభిప్రాయం, ఒకటి కావు. అలాగే నిర్ణయం, ఆచరణ వీటికి ఇంకా దూరం! ఆలోచనలు, అభిప్రాయాల మార్పు మామూలే అయినా.... అందుకు హద్దు–అదుపు లేకపోతే చిత్తచాంచల్య ఆరోపణలతో వాటికి విలువ, ఉపయోగం వుండకపోవచ్చు. అయితే, అభిప్రాయాల పరస్పర వ్యక్తతలో, వ్యక్తీ కరణలో వాటి నాణ్యతను పెంచాలి సుమా! అయినా 'రిజిడ్ జిడ్డు', పిడివాద "పట్టు" మంచిది కాదు. జీవ పరిణామక్రమం జీవజాతుల్ని మారుస్తున్నా... వయస్సు, శరీర స్థితిగతుల్ని నిర్ణయిస్తున్నా..., ఆ క్రమాన్ని, జ్ఞానార్జనకు, మేధస్సు వృద్ధికి, ప్రపోర్షనల్‌గా భావించలేం! అందుకు సృష్టి సంబంధమైన 'ఏకం – అనేకం'లో హేతువు ఉంటుంది. అందుకే, వివేకం – మేధోశక్తి కొందరికే ప్రత్యేకతగా వుంటుంది. అయినా, జ్ఞానార్జన మనిషి ధర్మం! అవసరం కూడా!

ఎవరి నమ్మకం వారికున్నట్లుగానే, ఒకే విషయానికి సంబంధించిన "ఒపీనియన్‌కి" బేధమూ సహజమే! శృతి – స్మృతి – పఠనం, అనుభవం, వగైరాల ద్వారా జ్ఞాన వ్యాప్తి జరుగుతూ వుంటుంది. అది ఎక్కడో ఒక చోటనే ఆగిపోయేది కాదు. అందుకోవడం – అందించడం, జ్ఞాన వృద్ధిలక్షణం, మంచి మార్గం కూడా!! దానికి "మార్పు" తప్ప నాశనం వుండదు. తనకు తెలిసిన దానిని మరి కొందరికి తెలియజేయడం, తనకు తెలియని దానిని అది తెలిసిన వారినుండి తెలుసుకునే ప్రయత్నం చేయడం

విజ్ఞత! జ్ఞానసమగ్రత, సంపూర్ణత సాధ్యం కాకపోయినా, సాధన మనిషికి ధర్మం!

ఈ దృష్టి దృక్పథంతోనే, మానవ జీవితానికి సంబంధించిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, పౌరధర్మాలకు చెందిన వివిధ విషయాలలో నాకు కలిగిన ఒపీనియన్స్‌ను మరికొందరి అభిప్రాయాల కోసం యిలా పుస్తక రూపంలో పబ్లిష్ చేయడం జరిగింది. పాఠకులు పరిశీలనాత్మకంగా ఆయా విషయాలను గమనించి, గ్రహించగలరని నా మరో 'ఒపీనియన్'!

Diary రూపంలో వున్న వివిధ విషయాలను "ఒపీనియన్స్" పేరున సంకలనం చేసి, వాటిని ఎడిట్‌చేసి, అచ్చుతప్పులను దిద్ది పుస్తకం రూపంలో పబ్లిష్ కావడానికి శ్రమ, సహకారం అందించిన వారందరికీ ఆశీస్సుల రూపంలో అభినందనలు తెలియజేస్తున్నాను...

పాఠకులకు కూడా అంతే సుమా!

**- విశ్వస్ఫూర్తి**

# ముందుమాట

ఎప్పుడో 1977లో... విభిన్న రంగాలకు సంబంధించిన వివిధ విషయాల గురించి తనకు కలిగిన 'ఒపీనియన్స్'ని డైరీ రూపంలో పొందుపరచిన శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి వారు వాటిని ముద్రించే మహద్భాగ్యం నాకు కలిగించినందుకు వారికి నా నమోవాకాలు.

దాదాపు 30 సంవత్సరాల క్రిందట వ్రాయబడిన విషయాలు అయినప్పటికీ అవి ఇప్పుడూ నిత్య నూతనంగా కన్పిస్తూ నేటి కాలమాన పరిస్థితులకు సైతం దర్పణం పట్టడం శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి వారి దూరదృష్టికి, దివ్యదృష్టికీ తార్కాణం.

"వ్యక్తిత్వ వృద్ధికి – వ్యవస్థ మార్పిడికీ సైలెంట్ ఆయుధం... సాహిత్యం" అనే విశ్వస్ఫూర్తి వారి అభిభాషణే స్ఫూర్తిగా ఈ పుస్తకం ప్రచురించి, మీ ముందుంచ గలుగుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ అవకాశం నాకందించిన 'విశ్వ స్ఫూర్తి' వారికి మొదటగా నా వినమ్ర నమస్సుమాంజలి.

చదివే ప్రతి దానినీ పరిశోధనాత్మక దృష్టితో చూసే సాహితీ శాస్త్రవేత్త శ్రీ ఎస్. ఆర్. భల్లం గారికి, ఈ పుస్తకాన్ని నిశితంగా పరిశీలించి, దీనిలోని 'ఒపీని యన్స్'ని "స్ఫూర్తినిచ్చే విలువైన, పదునైన, ఆచరణాత్మక ఆలోచనలుగా అభివర్ణించిన" ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ గారికి, పుస్తక ప్రచురణ రంగంలో గత 50 సంవత్స రాలుగా అపార అనుభవం గడించి, కొన్నివేల పుస్తకాలను పరిశీలించిన అనుభవంతో ఈ పుస్తకాన్ని పరిశీలించి, తన 'ఒపీనియన్' వెలిబుచ్చిన శ్రీ నవోదయ రామమోహన్ రావు గారికి,

యదావిధిగా తన సలహాసహకారములను అందించే మిత్రుడు సాయిప్రసాద్ ఆల్వా గారికి...

నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**డి. తిరుమలేష్ కుమార్**

# విశ్వస్ఫూర్తి 'ఓపీనియన్స్'కి - శాల్యూట్...!!

ప్రయోగాలు శాస్త్రవేత్తలేకాదు...

ఆధ్యాత్మిక వేత్తలు కూడా చేస్తారు..! ఆధ్యాత్మిక వేత్తలకి సమాజమే ఒక ప్రయోగశాల..!! సమాజశ్రేయస్సుకు అక్కడక్కడా ఏ ఆధ్యాత్మిక ఉపన్యాస ప్రక్రియలోనో విశేష ప్రయోగాలు చేస్తారు. ఇతర ప్రక్రియల్లో కంటే ప్రబోధాత్మకంలో జరిగిన ప్రయోగాలు ఎక్కువ. ముఖ్యంగా శ్రీ గురువిశ్వస్ఫూర్తి గారి ప్రత్యక్ష పరోక్ష ప్రబోధాల్లో మరీనూ...

శ్రీ విశ్వస్ఫూర్తి గురూజీ... జీవితం గురించి చెప్పరు - జీవించడం ఎలాగో చెప్తారు..! సంస్కారం గురించి చెప్పరు. సంస్కర్త ఎలా వుండాలో చెప్తారు..!! అందుకే ఆయన ఆధ్యాత్మిక ప్రబోధాల్లో జీవం ఉంటుంది. భావం ఉంటుంది.. పవిత్రత ఉంటుంది.. ప్రభావిత ఉంటుంది.. ప్రతిభ ఉంటుంది.. ప్రఖ్యాతి ఉంటుంది..!!!

ఏది పవిత్ర ప్రబోధం..? ఏది అపవిత్ర ప్రబోధం..?! అనే చర్చ ప్రస్తుతానికి అప్రస్తుతం. ఏది హృదయాన్ని కదిలిస్తుందో.. కలవరపరుస్తుందో... కలత చెందిస్తుందో.. ఉత్తేజ పరుస్తుందో.. ఉత్సాహపరుస్తుందో...ఉమ్మనత్వానికి దారులను చేస్తుందో.. ఆదరిస్తుందో.. ఆదర్శిస్తుందో... ఆలోచింప చేస్తుందో.. అది పవిత్ర ప్రబోధం..! అదే ప్రవిమల ప్రబోధం..!! అటువంటి అద్భుతమైన అపూర్వమైన అనితర సాధ్యమైన భావజాలాన్ని ఆధ్యాత్మికంగా ప్రబోధాత్మకంగా పండిత పామర జనరంజకంగా "ది ఓపీనియన్స్" గ్రంథంలో నిక్షిప్తపరచి - ప్రజల్ని పవిత్రాత్మ సదృశులుగా మార్పుచేయడానికి మార్గం శ్రీ గురువిశ్వస్ఫూర్తిగారు వేశారని చెప్పడంలో స్తవం కన్నా వాస్తవం మిన్న..!

చెప్పదలచిన భావాల్ని గుప్తంగా – క్లుప్తంగా – సంక్షిప్త ఆధ్యాత్మిక సంకేతాల ద్వారా చెప్పడం శ్రీ విశ్వస్ఫూర్తి గురూజీ టెక్నిక్..! మామూలు విషయాల్ని గొప్ప ఆధ్యాత్మిక ఫ్రేం చేస్తే ఎంత అందంగా... ఆదర్శనీయంగా వుంటుందో శ్రీ విశ్వస్ఫూర్తికి తెలిసినట్లు మరెవరికీ తెలీదని చెప్పడానికి ఈ "ది ఒపీనియన్స్" గ్రంథం ప్రబల సాక్ష్యంగా నిలుస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చు.!

శ్రీశ్రీశ్రీ విశ్వస్ఫూర్తి గురూజీ మాట్లాడుతుంటే–ఆధ్యాత్మికత్వం ఆనందనందన సుందర సుమధురంగా స్పందించినట్లనిపిస్తుంది. ఉత్సాహపూరితంగా ఉపన్యసిస్తుంటే–మనిషిలోని మానవీయతా మహాసంద్రం పోటెత్తి ప్రవహిస్తున్నట్లనిపిస్తుంది. కరుణా దృక్కులు ప్రసరిస్తూంటే–బరువెక్కిన హృదయాలు దూదిపింజెల్లా తేలికై తేలిపోతున్నట్లనిపిస్తుంది."చుట్టూరా ఆవరించిన చీకటిని నిందించడం కంటే–చిరుదీపాన్నైనా వెలిగించి విశ్వాన్ని కాంతివంతం, క్రాంతివంతం చేయాలన్నది శ్రీ విశ్వస్ఫూర్తి గురూజీ తత్వం..! మహత్వం.!! మనిషి అంతరంగలోతుల్లో దాగి ఉన్న అసంఖ్యాక ప్రశ్నల్ని బయల్పరచి, విజ్ఞాన తృష్ణ తీరుస్తూ, మానసిక వికాసాన్నీ ఆహ్లాదాన్ని కలిగిస్తూ. నవ సమాజ నిర్మాణానికి శ్రీ గురువిశ్వస్ఫూర్తి చేస్తున్న భాషణలు నిత్య సత్యాల భోషాణాలు..!! "ముక్కు మూసుకోవడమే తపసుకాదు – దీక్షగా చేసే ఏ పనైనా తపస్సుగానే భావించవచ్చు!! ఏ విజయానికైనా సానుకూల దృక్పథమే తొలిసోపానం.!! " మల్లెలా జీవించే మహాయోగంలేకున్నా – ముల్లులా బతకడం ముందు మనకిపోవాలి" అనేది శ్రీ విశ్వస్ఫూర్తి గురూజీ తత్వంగా గోచరిస్తుంది."స్థితికి ఆధారం, భూమికి ఆకాశం, పదార్థానికి శక్తి, శరీరానికి ఆత్మ, కర్మకి ధర్మం, భాషకి భావం, భావానికి మనసు, మనసుకి బుద్ధి, బుద్ధికి అవసరం, అవసరానికి పరిసరం, పరిసరానికి ప్రకృతి – ఒకదాని కొకటి ప్రేరితాలు, ప్రేరేపితాలు.!! ఆధారశూన్యమైన దానికి స్థితి లేక ఉనికి వుండదు. ఎంతగొప్ప సందేశం..!?! " పలుకుబడిగల వారు, పది

‘రాళ్లు’ గల వారూ పదవికోసం పోటీపడడం, అధికారం కోసం ఆరాట పడడం ప్రజాస్వామ్యంలో ప్రస్తుతం జరుగుతున్న నగ్న సత్యం. కాదనలేం కదా..!!

ఈ “ది ఒపీనియన్స్” గ్రంథంలో శ్రీ గురువిశ్వస్ఫూర్తి సృష్టి స్థితి లయలు – అసిత్వం నాస్తికత్వం – ఆత్మ పరమాత్మ – దైవం దెయ్యం – వర్ణ వర్గ ప్రాంత విభేదాలు – మతం కులం – సంగీత, సాహిత్య కళారంగాలు. రాజకీయం రాచరికం – ఫ్యూడలిజం, ప్రజాస్వామ్యం పెట్టుబడిదారీతనం – బానిసత్వం – సోషలిజం, యువతరం వెఱ్ఱి మెఱ్ఱి ఆలోచనలు, గారడీ విద్య – విపరీత వ్యాపార ధోరణులు – జ్ఞానా జ్ఞానాలు – ధర్మాధర్మాలు. న్యాయాన్యాయాలు, నేరాలు శిక్షలు. చట్టం ధర్మం – ఛాందన భావజాలం మత మౌఢ్యాలు – వర్గ వర్ణ పోరాటాలు – ఏసుక్రీస్తు తత్వం – కమ్యూనిస్టు దృక్పథం, కాలం – దూరం చలనం – విదేశీ వ్యామోహాలు – ఇత్యాది విషయాల్ని అందరికీ అర్థమయ్యే రీతిలో – అక్షరీకరించడం జరిగింది.

“సాధన సున్నితమైంది – సూక్ష్మమైంది. సుందరమైంది... సుమధురమైంది. కరుగుతున్న మంచుముక్కలా... కదులుతున్న నీటి బొట్టులా... మొగ్గ పువ్వులా మారినంత సహజంగా స్వాభావికంగా వుండాలి. ప్రశాంత చిత్తంతో వీక్షించగలిగే అలవాటు వలన సాధనలో సహజత్వం తొంగిచూస్తుంది.”

“ఏకాంతతకు భంగం రానంత దూరం వుంటూ వుంటాను. నా ఆలోచనలు, ఊహలు, ప్రజల్ని వదలి పరలోకానికి స్వర్గ నరక లోకాలకుపోవు. వాస్తవికమైన భౌతిక పరిధిలోనే అనంత వ్యాప్తమౌతాయి” అని ప్రబోధించే ఆధ్యాత్మిక గురుదేవులు శ్రీ విశ్వస్ఫూర్తి సూక్తి ముక్తావళిని నిత్యపారాయణ చేసుకోవాలి.

"మంచి మాట మంచి బ్రతుకును అందిస్తుంది. పంచన నిలబడి మనల్ని అంచెలంచెలుగా నడిపించి అజ్ఞానపు కంచెను దాటిస్తుందని విశ్వసిస్తూ...

*"నిజమైన శ్రీగురు విశ్వస్ఫూర్తి ప్రబోధం...*
*నిశ్శబ్ధంలోకి జారదు.*
*అది గుండె నుండి గుండె దాకా...*
*యుగాంతం వరకు పరిమళిస్తుంది, ప్రతిధ్వనిస్తుంద"*ని అభిలషిస్తూ..

**ఎస్. ఆర్. భల్లం**
కవి, సాహిత్యవేత్త
4-87-12, ఇందిరానగర్
గాంధీ బొమ్మ సెంటర్, తాడేపల్లిగూడెం-1
ఫోన్: 08818-229998, సెల్: 98854-42642

# ‘ది ఒపీనియన్స్’ పై ఒపీనియన్

స్ఫూర్తి పబ్లికేషన్ తిరుమలేష్‌కుమార్ గారు తానుగా పరిచయం చేసుకుని, శ్రీ గురు విశ్వస్ఫూర్తి రచించిన ‘ఒపీనియన్స్’ అనే పుస్తకం నాకు యిచ్చి దానికి ముందుమాట వ్రాయమని కోరటం నాకు ఆశ్చర్యం కలిగించింది. రచయితపేరు చూసి బహుశా యిది ఆధ్యాత్మిక సంబంధమైన పుస్తకం అయివుంటుంది అని అనుకొన్నాను. “నేను రచయితను కాదు. నాకు ముందుమాట వ్రాయటం చేత కాదు అని చెప్పాను. ఇది ఆధ్యాత్మిక గ్రంథము కాదు. ఒకసారి చదివి మీకు ఏమైనా రాయాలని అనిపిస్తే వ్రాయండి. బలవంతం లేదు అన్నారాయన. ఆయన అలా మొహమాటపెట్టటంతో చదవటం ప్రారంభించాను. పుస్తకంపై మంచి అభిప్రాయం కలిగింది. తిరుమలేష్ కుమార్‌గారు నన్ను కలిసి వుండకపోతే యింత మంచి పుస్తకం చదివే అవకాశం కలిగేది కాదు. ముందుమాట రాయకుండా తప్పించుకొనేందుకు ఏదైనా కారణం దొరుకుతుందేమోనని ఆసాంతం పరిశీలనగా రెండుసార్లు చదివాను. ప్రతివారూ తప్పక చదవవలసిన పుస్తకమని అభిప్రాయపడ్డాను. రచయిత ఆలోచించి, పరిశీలన, పరిశోధన చేసిన తర్వాతనే తనకు కలిగిన భావాలను ఇక్కడ క్రోడీకరించి నట్లు చెప్పుకున్నారు. రచయిత వెలిబుచ్చిన విస్తృతమైన ఆలోచనలు నన్ను ఆశ్చర్య పరచాయి. అవి ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితమయి వుండకపోవడం నా ఆశ్చర్యానికి కారణం. రచయిత వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, నాకు బాగా నచ్చిన, నన్ను ఎక్కువగా ప్రభావితం చేసిన కొన్ని ‘ఒపీనియన్స్’ యీ క్రింద యిస్తున్నాను. సోషలిజం, కమ్యూనిజం, సెక్యులరిజంలను అభిమానిస్తూనే, ఆ భావాలు పెంపొందాలని కొరుకుంటూనే వాటికోసం కృషి చేస్తున్నవారిలో వున్న లోపాలను ఎత్తిచూపించటంలో రచయిత కృతకృత్యులయ్యారు.

**పీడిత ప్రజానీకానికి పట్టెడు అన్నం పెట్టించే మార్క్స్, లెనిన్ సిద్ధాంతాల ఆశయసాధనపై రాజీలేని ‘పోరాటం’ (హింసతో కాదు)**

**సాగించవలసిన కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో అస్తిత్వాన్ని కోల్పోయింది. ఇతర పార్టీలకు పల్లకీలు మోసే బోయీల్లాగా ఆ పార్టీ మారడం చరిత్ర సహించదు. ప్రజాస్వామ్యం, సోషలిజం, కమ్యూనిజం, సెక్యులరిజం మొదలైన మాటలు, నినాదాలు సమాజ జీవితం కోసమేగాని, వ్యక్తి తత్వానికి కాదు. ఈ మాటలు వల్లించే వారి వ్యక్తిగత జీవితం, తత్వం యిందుకు పూర్తిగా భిన్నంగా వుంటుంది.**

నిజానికి ఇదేదో మత గ్రంథంగా భావించి చదవటం ప్రారంభించిన నాకు క్రమంగా రచయిత హేతుబద్ధ ఆలోచన అర్థమయింది. అహేతుకంగా అనిపించి నప్పుడు యీ రచయిత ఆస్తికత్వాన్ని కూడా నిందించారు. నీతిలేనిది ఆస్తికత్వం అని ధైర్యంగా ప్రకటించగలిగారు. మతమౌఢ్యం సమాజ అభివృద్ధికి చేస్తున్న హానిని చాల స్పష్టంగా వివరించారు. ఆర్.యస్.యస్. లాంటి మతవాద రాజకీయ సంస్థలు యీ దేశంలో ఉండడం ఎంత ప్రమాదకరమైనదో ఈ రచయిత గుర్తించగలిగారు.

**మతానికి చెందిన దోపిడీ దొంగల ద్వారా సంఘానికి, మనిషికీ కలిగే హాని, కీడు జీవితాంతం ఏ విధంగానూ సరిచేసుకోడానికి వీలులేనిది. ఆధ్యాత్మిక స్వాములు సృష్టికి ద్రోహులు, నేటి పరిస్థితికి మతం వ్యాపారస్తుని కల్తీ సరుకునూ, రాజకీయం నకిలీ వస్తువునూ పోలినవిగా తయారైనాయి. రాజకీయంగా జనసంఘంవారు, మతసాంస్కృతికంగా ఆర్.యస్.యస్. వారూ యీ దేశాన్ని 'హిందూరాష్ట్రం'గా స్థిరపరచడానికి కృషి చేస్తున్నారు. ఇది మత తత్వమా? మత మౌఢ్యమా?**

నాస్తికత్వం పనిగట్టుకుని ప్రచారం చేసే వారి, ఆస్తికత్వం గురించి చెప్పే వారి నిజస్వరూపాలు నగ్నంగా చూపించారు.

**దేవుడు, ఆస్తికత్వం, ఆచరణ, ప్రేమ మొదలైన వాటిని గురించి చెప్పేవారు చెప్పించేవారి వ్యక్తిగత జీవితం, తత్వం మరో విధంగా, యిందుకు భిన్నంగా వుంటుంది. రీతి లేనిది రాజకీయం, నీతి లేనిది ఆస్తికత్వం**

**(మతం) ఈ రెండింటికీ స్థానం లేనిది ప్రజాస్వామ్యం. ఇది తారాస్థాయికి చేరిన దేశం భారతదేశం.**

రోజు రోజుకీ పెరుగుతున్న బాబాల మోసాలు, ఘోరాలు బట్టబయలవుతున్నా యింకా వారిని నమ్ముతున్న వారిలో మార్పు కనిపించకపోవటంతో రచయిత తన ఆవేదన వెలిబుచ్చారు. బాబాలు, స్వాములు సగటు మనిషిలోని బలహీనతలను ఆధారం చేసుకొని నిరంతరం నైతికంగా పతనమవుతూ, ఆర్థికంగా ఎదుగుతోన్న వైనాన్ని యీ రచయిత నిర్ద్వంద్వంగా ఖండించారు.

**ఒకసారి ఏటి స్నానం చేస్తే పాపం పోతుందని, పుణ్యం వస్తుందని అవస్థలు పడే యాత్రికుల మూఢత్వానికి నవ్వాలో, ఏడవాలో తెలియదు. మనుషుల్లో వున్న బలహీనతను ఆధారం చేసుకొని స్వార్థపరుల ప్రచార సాధనాలుగా తయారైన బాబాలను, స్వాములనూ అవతార పురుషులుగా తయారుచేసి, మూఢజనాన్ని బుద్ధిహీనులుగా మార్చడం ఆధ్యాత్మిక భావనపేరుతో సాగే బడా వ్యాపారం - బాబాలు, స్వాములు, అవతారాలు ఎవరికి వారే దేవునిగా ప్రచారం చేయించుకుంటూ, పూజలందుకుంటూ ఆ మేరకు ఒకర్ని మరొకరు పనికిమాలిన వారుగా నిరూపించుకుంటున్నారు. ఇంతకూ అందరూ గారడీ గాడిదలే. దేవుడు అనీ, దేవుడి తాలూకు వాళ్ళమనీ చెప్పుకునే బాబాలు, స్వాములు, గురువులు తదితరమైన ఆ బాపతు చిల్లరమల్లర దగారాయుళ్ళంటే నాకు పరమ అసహ్యం. అలాంటివాళ్ళను గురించి వినవలసి వచ్చినా, చూడవలసి వచ్చినా, ఆలోచన చేయవలసి వచ్చినా నాకు ఎంతో చికాకు వస్తుంది. పురాణ వర్ణనల్ని దైవలీలలనుకుంటే అది మనిషి మానసిక బలహీనతలకు ప్రతిబింబం తప్ప మరొకటి కాదు.**

తత్వశాస్త్రం రాజకీయాలు, సాహిత్యం, మతం లాంటి గంభీరమైన విషయాలతో పాటు పార్లమెంటు, అసెంబ్లీల దుస్థితి గురించి కూడా

లోతయిన, పదునైన పరిశీలన చేశారు.

**పార్లమెంటు ఆటస్థలం కంటే అన్యాయమైపోయింది. అసెంబ్లీల సంగతి వేరే చెప్పక్కర్లేదు. గతంలో ఎన్నడూ లేనంత ఘోరంగా రాజకీయం రోత బుట్టింది**

ఈ పుస్తకాన్ని కేవలం కొన్ని అభిప్రాయాల (ఒపీనియన్స్) సంపుటిగా కాక ఒక మంచి విశ్లేషాత్మకమైన రచనగా కూడా చూడాల్సి వుంటుంది. ఈ రచయిత విషయాల మూలాల లోతులకు వెళ్ళటం వల్ల ఈ పుస్తకానికి విలువ వుందని నేను భావిస్తున్నాను.

**నవోదయ రామమోహనరావు**

16-7-2005 విజయవాడ

# పదునైన ఆలోచనలు

**ది ఒపీనియన్స్** – ఇవి విలువైన అభిప్రాయాలు. స్ఫూర్తినిచ్చే అభిప్రాయాలు – ఆలోచన రేకెత్తించే ఆలోచనలు. ఒక్కోసారి వేదాంతం అనిపిస్తుంది, మరోసారి చదివితే ఒక జీవితసత్యం గురించి చెప్పినట్టు అర్ధమవుతుంది. "బతకడం కోసం చేసే పెద్ద ప్రయత్నం – జీవితం" ఎంతటి నిజం.

ఆలోచన భిన్నంగా ఉంటేనే ఆలోచన అనడం ఒక గొప్ప ఆలోచన. ఆత్మవిశ్వాసమే పరిస్థితులకు సమాధానం కావాలి అంటారు. అన్నిటినీ పరిస్థితులమీదికి తోసి తప్పుకోవచ్చు. కాని ఆత్మవిశ్వాసంతో పరిస్థితిని జయించవచ్చు. భౌతికజీవితాన్ని సార్ధకం చేసుకోవాలన్న ఆచరణాత్మక హితవు కూడా అంతర్లీనంగా ఉంది.

మనిషి – జంతువులకన్నా భిన్నమైన వాడా కాదా అనే ఆలోచనకు మరో సరైన వివరణ కన్పిస్తుంది. ప్రతి జీవికి భాష ఉందని, ఆలోచన కూడా ప్రతి జీవిలో ఉందనీ, ప్రకృతిని మరింతగా తెలుసుకుని వినియోగించుకునే తీరులో మనిషి భిన్నత్వాన్ని చూపాలనే సూచనుంది.

జీవితానికి గమ్యం ఉండాలని, దాన్ని నిర్ధేశించుకోవడంలో మేధస్సు, ఆర్ధిక స్థితి, సమయస్ఫూర్తి, సామర్ధ్యం సమ్మేళనం కావాలని అంటారు.

న్యాయం అనే పదానికి నిజమైన నిర్వచనం – వాస్తవం, సత్యం అనవచ్చు. కాని న్యాయం పేర జరిగేదంతా న్యాయం కాదు.

జీవిత తత్వంపైన అర్ధం కాని సంక్లిష్ట భావాలు కాకుండా అర్ధం చేసుకోగలవారికి ఆచరణాత్మక ఆలోచనలను అందిస్తాయి ఈ ఒపీనియన్స్. మరికొన్నిచోట్ల రాజకీయంపైన, సమన్యాయంపైన చెణుకులు ఉంటాయి. మతాల సారంపైన వ్యాఖ్యానాలు ఉన్నాయి. గారడీ వృత్తిని రాజకీయ నాయకులు స్వీకరించారు. దేశనాయకుల ప్రసంగాల్లో స్వాతంత్ర్యం లేదు. పదవిలో ఉన్నవారే ప్రజలు అనుకోకండి.

'గతం' లేకపోతే అర్హతకు, సామర్థ్యానికి గుర్తింపురాదు. "పాలకులకు

వ్యతిరేకంగా కుట్ర పన్నేది ప్రతిపక్షాలే”. చైనా, నేపాల్, పాకిస్థాన్ మన భూభాగాన్ని ఆక్రమించుకుంటే – ‘వ్యక్తిపూజ’ చేయించుకునే పాలకులు ఏమీ చేయలేక పోయారు. ఆచారాలకు, ఆజ్ఞలకు పూర్తి విరుద్ధంగా లంపట బ్రతుకు బ్రతుకుతూ, దేవుడికి సలాంకొడితే, స్తోత్రం చేస్తే, కొబ్బరికాయ కొడితే ఏమవుతుంది? ఇతరులకు చెప్పే లక్షణం వల్ల తాము తెలుసుకోవలసినది ఏమీ లేదనే అజ్ఞానం, అహంకారం మంచిది కాదు.

పాలకులు అహంకారులై, స్వార్థపరులై, అవినీతిపరులై ఉంటే ప్రజలకు ఏం ప్రయోజనం?... ఇట్లా అనేక సామాజిక, రాజకీయ, రాజ్యాంగపరమయిన వ్యాఖ్యలు, విసుర్లు అనేకం ఉన్నాయి.

సైన్స్, మతం, న్యాయం, ఏసుక్రీస్తు, దేవుడు, వర్గ పోరాటం, నెహ్రూ కుటుంబపాలన, రాజకీయం, బానిసత్వం, ఆత్మజ్ఞానం, రాష్ట్రపతి– మంత్రివర్గ సమస్యలు, ఫ్యూడలిజం, గాంధీ వారసుల స్వాహాకారం వంటి వాటిని విమర్శిస్తూ బాబాలు, స్వాములూ గారడీ గాడిదలే అని నిర్ధారించారు.

నిశితమైన దృష్టి, విశ్లేషణ, సంక్షిప్త వాక్యాల్లో విమర్శతో కూడిన అభిప్రా యాలు ఇవి.

శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి వర్తమాన ప్రపంచంలో జరిగే అనేక సామాజిక పరిణామాల మీద మంచి వ్యాఖ్యానాలు చేసారు. ఇప్పటి వాతావరణంలో ఈ వ్యాఖ్యానాలు సందర్భోచితంగా ఉన్నాయి.

సముదత్తమయిన భావాలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలంటే శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి భావమంజరిని చదవాలి. మెదడు పదునెక్కే ఆలోచనలు రావడం చైతన్య లక్షణం. అందరికీ రాకపోవచ్చు. కనుక చైతన్యవంతుల ఆలోచనలను తెలుసుకోవాలి. ది ఒపీనియన్స్ అందుకు ఒక సాధనం.

**మాడభూషి శ్రీధర్**, ప్రొఫెసర్
నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం

*ఆస్తికత్వంలో దేవుడికి సంబంధించి నాస్తికుణ్ణి.*
*అస్తిత్వానికి సంబంధించి,*
*సత్యం ప్రాధాన్యత వహించినంత వరకు ఆస్తికుణ్ణి.*

**– విశ్వస్ఫూర్తి**

# ఒపీనియన్: 1

శరీర ఒత్తిడిని తట్టుకోడానికి, తగ్గించుకోడానికి మనిషి ఏదో పనిచేస్తాడు. చెయ్యాలి. ఇదే కర్మ జీవితం. అవకాశాలను బట్టి, ఈ కర్మ కొందరికి సులువుగ వుంటుంది మరికొందరికి అది పెద్ద పోరాటంగా వుంటుంది. ఏమైనా బ్రతకడం కోసం చేసే పెద్ద ప్రయత్నం జీవితం.

ఈ జీవితం వరకే పరిమితమై, దానితోనే బ్రతుకంతా సతమతమై, అలాగే జీవితాలను చాలించే జనం తక్కిన జీవుల మాదిరే, అత్యధికం. అయితే ఈ పోరాట అవసరం లేకుండానే జీవితం గడిచిపోయేవారు, గడుపుకొనేవారు, జీవిత పోరాటకులపై 'ఆధిపత్యం' చలాయిస్తూ వుంటారు. ఈ ఆధిపత్యం అనేక రకాలుగ వుండవచ్చు. సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ రంగాలుగా అది వుంటుంది. ఎవరికి చేతనైన 'పెత్తనం' వారు చేస్తారు. అయితే జీవిత పోరాటంతో సతమతమౌతూనే వ్యక్తిగత ప్రతిభతో ప్రభావంతో 'ఆధిపత్యం' సాధించేవారు కొందరు వుంటారు. అయితే వీరి సంఖ్య చాల తక్కువ. జన్మ సిద్ధమైన ప్రతిభ తప్ప, యిది సాధ్యంకాదు. అవకాశాల 'అదృష్టం'తో ఆధిపత్యం సంపాదించి, చలాయించి, దానిని స్థిరపరుచు కోడానికే తమ సర్వస్వాన్ని వుపయోగించే వారు చాలామంది వున్నారు. వారిని ఆశ్రయించి బ్రతికేవారి సంగతి మరో తీరుగ వుంటుంది.

ఏమైనా, 'జీవితం' విడిగా ఆలోచన చేస్తే, అగమ్యగోచరంగ వుంటుంది. ఆలోచనకు అతీతంగా వుంటుంది?

# ఒపీనియన్: 2

వర్తమాన సమాజస్థాయికి మాత్రమే సరిపోలిన సరిపోయే ఆలోచనలు చేయడం, ఆలోచన అనేదానికే అర్థరహితం ఫలితం శూన్యం. అలవాటుపడిన సమాజ జీవితాన్ని ప్రతిబింబించేది 'ఆలోచన' అనబడదు. అందుకు భిన్నంగ, నూతనత్వాన్ని కలిగి, చైతన్యాన్ని కలిగించేదిగా వుండాలి.

అయితే వర్తమాన సమాజస్థాయికి మించిన ఆలోచన ఔన్నత్యానికి చిహ్నమైనప్పటికి, అది, ఆ సమాజ అవగాహనకు అతీతమై పోయి నప్పుడు ఆ ఆలోచనకు అర్థం వుండదు. నేటి తరం గ్రహించలేని, ఆలోచన అది ఎంతటి వుత్తమమైనప్పటికి, భావి తరాల వారికి అది ఎంతో వుపకరించేది అయినప్పటికి మెచ్చుకోతగిన విషయం కాదు. కొందరి మేధాశక్తి యీ పద్ధతిలో పెరిగిపోతూ వ్యర్థమైపోతూ వుంటుంది. పైపెచ్చు అపార్థానికి అవకాశం కలిగిస్తుంది.

రజనీష్ ఆలోచనలలో చాలా భాగం యిలాగే వున్నాయి. భావాలవరకే పరిమితమై ఆలోచిస్తే, వాటిల్లో ఔన్నత్యం వుంది. కానీ వర్తమాన సమాజం, వాటిని అర్థం చేసుకోలేని స్థితిలో వుంది. పైపెచ్చు ఆయన అభిమానులు కూడ, ఆ భావాలను ఆచరణలో పెడదారిని పట్టించే ప్రమాదం కూడ వుంది. వర్తమాన కాలాన్ని వదలి సృష్టి జరగరాదు. అయితే నిత్యనూతనత్వంలో ఎప్పటికప్పుడు వర్తమానమే తప్ప మరో 'కాలం' కలగని 'చిరంజీవి' తత్వాన్ని కలిగిన భావాలు అమరత్వాన్ని కలిగి వుంటాయి.

# ఒపీనియన్: 3

మరలా మరలా సంపాదించుకోడానికి వీలైన దానిని పరిస్థితుల ప్రభావంతో పోగొట్టు కోవచ్చు కాని, పోతే పొందలేనిదానిని పరిస్థితుల ఒత్తిడి ఎంత ఎక్కువగా వున్నప్పటికి, పోగొట్టుకోకూడదు. ఆత్మవిశ్వాసమే పరిస్థితులకు సమాధానం కావాలి. జీవిత ప్రాధాన్యత అందులోనే చూడాలి.

పోగొట్టుకుంటె పొందలేనివాటిల్లో ప్రాణం అతి ముఖ్యమైనది. "ఒకడు సర్వమును సంపాదించి, తన ప్రాణమునే పోగొట్టుకొన్నచో ప్రయోజనమేమి?" పుట్టిన జీవికి ప్రాణం పోవడం ఎంతకాలం తరువాతనైనా సహజం. అయినా ప్రాణం పోగొట్టుకోవడం తగినపని కాదు.

ప్రాణం పోయిన తరువాత అది నరకమైనా స్వర్గమైనా పరలోక మనేది కేవలం ఊహా మాత్రమే కనుక, వాస్తవ జీవితాన్ని, వూహా లోకానికి బలిచేయరాదు. భౌతిక జీవితాన్నే సార్థకం చేసుకోవాలి. ఊహాలోకానికి ఆత్మ పేరు చెప్పినా, మరేదో అనుకున్నా వ్యర్థమే!

# ఒపీనియన్: 4

సిద్ధాంతరీత్యా ఆలోచించినప్పుడు 'బ్రతకడం' అనే క్రియ, మనిషితో సహా ప్రతి జీవి విషయంలోనూ సమానత్వం కన్పిస్తుంది. బ్రతకడానికి చేసే ప్రయత్నంలో భిన్నత్వం వున్నప్పటికి బ్రతకడం అనే అవసరంలో ఏకత్వం వుంది. గాలి, నీరు, ఆహారం వసతి వగైరా జీవించడానికి అవసరమైన ప్రక్రియను ఏదోరూపంలో జీవులన్నీ చేస్తూనే వున్నాయి. అలాగే ఆశ, అవసరం, కోరిక, కామం, జన్మ చావు యిలాటి ప్రక్రియలు కూడ జీవులలో సర్వ సాధారణంగ జరుగుతూ వున్నవి. ఈ మేరకు ఆలోచించినప్పుడు 'మనిషి'లో ఏ మాత్రం ప్రత్యేకత లేదనే చెప్పాలి. ప్రకృతి ఒత్తిడిని తట్టుకుంటూ నెట్టుకుంటూ బ్రతకడానికి ప్రయత్నించి, చివరికి దాని చేతిలో 'చావు' పేరుతో ఓటమి చెంది దానిలోనే కలిసి పోవడం జరుగుతూ వుంది. దీనిలో కూడ మూలంలో పెద్ద తేడా లేదు మనిషి విషయంలో కూడ.

భౌతిక అతీతమైన రీతిలో మనిషిలో కొంత ప్రత్యేకత వుంది. 'భాష' అనే దాని ద్వారా ఈ ప్రత్యేకత కొంత వున్నా, ప్రతి జీవికి 'భాష' వుంది అనే విషయాన్ని గమనించినప్పుడు, యిందులో కూడ యితర జీవులలో లేని ప్రత్యేకత మనిషిలోనే వుంది అనుకోడానికి వీలులేదు. అయితే ఆలోచన ద్వారా (ఈ ఆలోచన కూడ ప్రతి జీవిలోనూ అలవాటు, అవసరం, పరిసరాలు, పరిస్థితుల పేరుతో వుంది) ప్రకృతితో పోరాటం సాగిస్తూ, ప్రకృతిని మరింత తెలుసు కోవడం, వినియోగించుకోవడం, తద్వారా బ్రతుకు తీరు 'భిన్నత్వాన్ని' మనిషి కలిగివున్నాడు.

# ఒపీనియన్: 5

ప్రతిక్రియ, సమాధానం (రియాక్షన్, రెస్పాన్స్) అని రెండు పద్ధతులు వున్నాయి మనిషి ప్రవర్తనలోనూ, పురోభివృద్ధిలోనూ. రియాక్షన్ అనేది ప్రతి జీవి ధర్మం. కేవలం ఒక జీవిగ బ్రతికే మనిషికి కూడ యిది సహజ ధర్మం. అయితే రెస్పాన్స్ అనేది మానవాతీతులు, అంటె, జీవిగ బ్రతికే మనిషి దశను అధిగమించినవారు ఆచరించే స్థితి. తనను శిలువ వేసే వారిపట్ల జీసస్ క్రైస్ట్ ప్రవర్తన యిందుకు మంచి వుదాహరణ. ఇలాగే మామూలు మానవ దశను దాటి, మానవత్వపు పరిపక్వ స్థితిని పొంది, దివ్యత్వాన్ని చేరబోయేవారికి ఈ రెస్పాన్స్ సహజ లక్షణం.

అయితే, మామూలు జీవిగ, సాధారణ మనిషిగ బ్రతుకుతూ, అందుకు సహజమైన 'రియాక్షన్' అనే సహజత్వాన్ని కలిగివున్న మనిషి దృష్టిలో 'రెస్పాన్స్' అవహేళన పాలు అవుతుంది. చేతగానితనం అవుతుంది. పిరికితనం అవుతుంది. అనేక అపార్థాలకు దారితీస్తుంది. కారణం, రియాక్షన్ పరిధిలోనే, అపరిపక్వ మానసిక స్థితితో, మానవదశతో ఆలోచించే ప్రతి వ్యక్తికి అలా అనిపించడం సహజం. దానిని గురించి పరిపక్వ మానసిక స్థితి పొంది, మామూలు మానవ దశను దాటి, రియాక్షన్‌ను అధిగమించి, మానవాతీత స్థితికి చేరి, రెస్పాన్స్‌నే అనుసరించేవారు మామూలు మనిషి ప్రవర్తనను, వ్యాఖ్యా నాలను అంతగా పట్టించుకోకూడదు. అలాటివారి వ్యాఖ్యలకు, అవి ఎటువంటివైనా వాటికి విలువ యివ్వకూడదు. పైపెచ్చు సానుభూతిని మాత్రమే ప్రకటించాలి. రెస్పాన్స్ ఉత్తమ లక్షణం.

# ఒపీనియన్: 6

జీవితానికి ఒక గమ్యం వుండాలి. నిజమే! ఆ గమ్యాన్ని చేరడానికి మంచి మార్గం వుండాలి  దానిని సరిగా నిర్దేశించుకోవాలి ఒక్కొక్కసారి నిర్మించుకోవాలి. అదీ నిజమే! నిర్దేశించుకున్న మార్గంలో, నడవడానికిగాని, లేక నిర్మించుకున్న గమనం సాగించడానికిగాని స్థోమత వుండాలి. ఇంతవరకు మేధస్సు పనిచేసినా, ఆ తరువాత కావలసింది ఆర్థికస్థితి. ఇది కొరవడితే, అంతవరకు మేధస్సు సాయంతో సాధించింది వృధా!

ఇంతకూ ఆర్థిక స్థోమత వుంటే, మేధస్సుతో పనిలేదా అంటే, అది ఎంత మాత్రమూ కాదు. మేధస్సు, ఆర్థికస్థితి, వీటిని చక్కగా ఉ పయో గించుకోగల సామర్థ్యం, సమయస్ఫూర్తి అన్నీ కావాలి. వీటన్నిటి సమ్మేళనం గమ్యాన్ని చేర్చడానికి ఉపయోగపడుతుంది.

# ఒపీనియన్: 7

సర్వ సమానత్వం సృష్టి తత్వం కాదు. అలా అని జీవిత జీవన పోరాటం ప్రకృతి లక్షణమైనా, బ్రతుకు దోపిడీ దాని విధానం కాకూడదు. సృష్టిని ముఖ్యంగా ప్రకృతినిదాని యిష్టానుసారం పోనిస్తే, దోపిడి సహజమై, నాగరికత, సంస్కృతి అనే వాటికి ఏ మాత్రం స్థానం వుండదు.

ప్రతిదానికి మూలాధారం కావాలి. పునాదిపై నిర్మాణం, ప్రమాణంపై కొలమానం ఆధారపడినట్లె మానవ జీవితానికి, సమాజ జీవనానికి కూడ కనీస కొలమానం వుండాలి. జీవితానికి, ముఖ్యంగా బ్రతకడానికి కనీస అవసరం అనేది సంఘ జీవితానికి ప్రమాణం కావాలి. దానిపై సంఘ పురోభివృద్ధిని అనుసరించి, దాని దామాషా ప్రకారం, మానవ జీవిత అభివృద్ధి, ఔన్నత్యం వుండాలి.

'న్యాయం' అనేదానికి స్పష్టమైన నిర్వచనం వాస్తవం, సత్యం అని మౌలికంగా చెప్పుకున్నప్పటికి అవి ఆ పదానికి సరియైన సంపూర్ణమైన అర్థం కాదు. 'న్యాయం' గురించి, దాని నిర్వచనం సంపూర్ణంగా తెలియకపోయినా, సమాజపరంగా, వ్యక్తి పరంగా అమలు జరుగుతోంది. అయితే న్యాయం పేర జరిగేది అంతా 'న్యాయం' అని భ్రమపడరాదు. దాని పేరుతో దానికి విరుద్ధమైనది ఎంతో చలామణి అవుతోంది.

కనీస జీవిత అవసరాన్ని తీర్చడానికి వీలైన 'ఆర్థిక న్యాయం' ప్రాతిపదికపై, సాంఘిక, రాజకీయ సాంస్కృతిక మొదలైన వివిధ రంగాల స్వరూప స్వభావాలు వుండాలి.

# ఒపీనియన్: 8

ఫలానా దాని ద్వారా అపకారం జరుగుతుందని తెలిసినప్పుడు, దాని 'వాత' పడకుండా జాగ్రత్త పడడం మనిషి ధర్మం. అలాగే ఫలానిది 'పాపం' అని తెలిస్తే, అది చేయకుండా జాగ్రత్తపడడం కూడ మనిషి చేయవలసిన కర్తవ్యమే! అలాకాక, చేయించేది వేరే ఏదో వుంది (సైతాను?) అనుకుంటె, అది మనిషి శక్తికి మించినదైతే, దాని చేతిలో కీలుబమ్మలా బ్రతకడం దాని యిష్టానుసారం 'పాపం' చేయడం బలహీనుడైన మనిషికి తప్పనిసరి. అందులో మనిషి నేరం (నరకాన్ని ప్రవేశించవలసినది) ఏదీ లేదు. బలవంతుణ్ణి ఎదిరించ లేకపోవడం బలహీనుడు చేసే నేరం కాదు కదా!

అలాకాక, ఆ చేయించే దాని శక్తికి అతీతుడైన దేవుడి ద్వారా ఆ పని చేయించాలనుకోవడం, తద్వారా పాపం చేయకుండా, ఆ దేవుడి శిక్షను తప్పించుకోడానికి, మతంపేరుతో ప్రయత్నం జరుగుతూ వుంటుంది. అంతవరకు సమర్థనీయమే! బలహీనుడు, శక్తివంతుని ఆశ్రయించి బాధనుండి రక్షణ పొందడం ఆక్షేపణీయం కాదు. అయితే, సర్వశక్తివంతుడైన దేవుడు, మానవశక్తికి మించిన ఆ దుష్టశక్తిని (సాతానును) సమూలంగ నాశనంచేసి, మొత్తం మానవాళికి మేలు చేయవచ్చుగదా! దానిని ఆ సృష్టికర్త మొదట్లో అసలు సృష్టించ కుండా వుంటే పోయేదిగదా! అల్పుడైన మానవుణ్ణి అవస్థపెట్టే దుష్టశక్తిని (సాతానును) సృష్టించి, దాని వికృత చేష్టలకు మనిషి అల్లాడిపోతోంటే, వినోదిస్తూ, ఆ సాతానుకు లొంగిపోయిన నేరానికి నరునికి నరకం యివ్వడం 'న్యాయం' కాదు.

# ఒపీనియన్: 9

ఇప్పటివరకు జరిగిన సృష్టి పరిణామంలో మనిషి చివరిదశ. అయితే యీ పరిణామంలో జీవ స్వరూపం యింకా యింకా మార్పిడి జరిగే విషయం గతాన్ని బట్టి కాదనడానికి వీల్లేకపోయినా, స్పష్టమైన దాఖలా లేదు. బహుశా సృష్టి పరిణామక్రమంలో 'మనిషి జీవి' చివరి దశ కావచ్చు. ఆ తరువాత జీవ స్వరూపం భ్రమణంలో తిరో గమనం కావచ్చు. అయితే మనిషి భౌతిక స్వరూపంలో స్పష్టమైన బాహ్య స్వరూపం జీవ జాతిగ స్థిర పడకపోయినా, మనిషి మానసిక పరిణితి (జ్ఞానం దాని ఔన్నత్యం) పరిణామం జరుగుతూ వుండవచ్చు మరి కొంతకాలం.

అయితే, జీవన పరిణామంలో ఎప్పటికప్పుడు దాని చివరి దశలో, అంతవరకూ జరిగిన దాని గతమంతా నిక్షిప్తమై పరిణితి చెందిన స్థితిలో బీజరూపంలో సూక్ష్మ స్థితిలో అణగివుంటుంది. అయితే ప్రతి జీవిలోను నిబిడీకృతమైవున్న గతం పక్వ స్థితి అన్ని జీవ జాతులలోనూ సమానంగ వుండదు. అలాగే, ఒక జాతిలోని అన్ని జీవులలోనూ సమానంగ వుండదు. బీజరూపంలో ఒక జాతిలో దాని గతమంతా వున్నప్పటికి, ఆ జాతిలో కొన్నిటిలోనే ఆ గతం బహిర్గతమై (పరిపక్వ స్థితిలో) వుపయోగపడే స్థితిలో వుంటుంది.

సృష్టి పరిణామంలో మానవజాతి ప్రస్తుతానికి చివరిదశ కావడంతో, దీని గతమంతా మనిషిలో జీవి రూపంలో వుంటుంది. అందరి మానవుల్లో అది వున్నప్పటికి కొందరిలో అది పరిపక్వ (జ్ఞానం) స్థితిలో వుంటుంది.

# ఒపీనియన్: 10

'**జ**న్మకి కర్మ కారణం, కర్మకి జన్మ ఆధారం.' కర్మకి ఆధారమైన జన్మ ద్వారా కర్మ స్వరూప స్వభావాలను మార్పు చేసుకోవాలి. జన్మ సార్థకం చేసుకోవడం ద్వారానే కర్మ రాహిత్యం చేసుకోవాలి. జన్మ రాహిత్యం అంటే మోక్ష ప్రాప్తికి మూలాధారం. కర్మరాహిత్యం ద్వారా జన్మ రాహిత్యం, తద్వారా మోక్ష ప్రాప్తి, దివ్యానందం పొందవచ్చును.

అయితే మోక్షానికి, తద్వారా బ్రహ్మానందాన్ని పొందడానికి జన్మ రాహిత్యం అవసరం. జన్మ రాహిత్యానికి కర్మ రాహిత్యం. కర్మరాహిత్యం ఎలా జరుగుతుంది. గత జన్మలో కర్మ అవశేషానికి సంబంధించి స్వరూప స్వభావాలకు తగిన జన్మ వస్తుంది గదా! కర్మ స్వభావంతో జరిగే జన్మ దాని జీవితంలో కర్మ రాహిత్యానికి అవకాశం ఎలా వుంటుంది! గత జన్మలో మిగిలిన కర్మను అనుభవించడానికి జన్మ కలిగినప్పటికి, దానిని అనుభవిస్తూనే క్రొత్తగా 'కర్మ' (జన్మను యిచ్చేది) ఆచరించకుండా జాగ్రత్త పడాలి. అలా అయితే గత జన్మ కర్మావశేషం పూర్తయిన వెంటనే, మరో కర్మ అంటకముందే (జన్మకి అవసర మైన కర్మ వుంటేనే జీవితం) జీవిత సమాప్తం జరుగుతోంది. మరో జన్మకి అవసరాన్ని కలిగించే 'కర్మ' ఏదీ లేదు గనుక మోక్షాన్ని పొందవచ్చు. 'జన్మ' కర్మ రాహిత్యానికి ఒక అవకాశం...

# ఒపీనియన్: 11

ప్రజలను గౌరవించి, దేశాన్ని ప్రేమించే రాజకీయం భారతదేశానికి కరువైంది. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్‌లాంటి మహానాయ కులతోనే ఆ పరిస్థితి సమాప్తమైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, స్వదేశీ ప్రభుత్వం ప్రారంభమైన దగ్గర నుండి ప్రజలపై మత్తుజల్లే నినాదాలతో నాగరిక దోపిడీ ప్రారంభమైంది.

పీడిత ప్రజానీకానికి పట్టెడు అన్నం పెట్టించే మార్క్సు లెనిన్ సిద్ధాంతాలకు, ఆశయ సాధనపై రాజీలేని 'పోరాటం' (హింసతో కాదు) సాగించవలసిన కమ్యూనిస్టు పార్టీ, భారతదేశంలో అస్తిత్వాన్ని కోల్పోయింది. ఇతర పార్టీలకు పల్లకీలు మోసే బోయీలాగా ఆ పార్టీ మారడం చరిత్ర సహించదు.

# ఒపీనియన్: 12

మానవులందరూ పాపం చేసినవారేనని, ఏసుక్రీస్తు ద్వారా తమ పాపములను క్షమించమని ప్రభువును ప్రార్థిస్తే, ఆయన ఆ పని చేసి, పరలోక రాజ్యంలోకి ప్రవేశం కలిగించగలరని క్రైస్తవుల నమ్మకం. మిగతా మతాల సంగతి స్వరూప స్వభావాలు వేరుగా వున్నప్పటికి తాత్పర్యం ఏదో పేరుతో యిలాగే వుంటుంది.

పాపం అంటే ఏమిటి? అనే సంగతి అలావుంచి, మానవులందరూ పాపం చేయడానికి, (వారి వాదన అంగీకరించినా) ముఖ్య కారణం ఏమిటి? 'పాపం' ఎప్పుడు ఎలా, ఎందుకు జరిగింది? క్రైస్తవ మతం ప్రకారం ఆదిమానవుడు 'ఆడం' లేదా ఈవ్ 'పాపం' చేస్తే దానిని అనుభవించ వలసినది ఎవరు? ఎంతవరకు?

మనిషి పాపం చేయడానికి కారకులు ఎవరు? మనిషే అందుకు కారణమై వుంటే దానిని అనుభవించడానికి లేదా తొలగించుకోడానికి మనిషే ప్రధాన కారణం కావాలి గాని, ఏ 'పాపం' ఎరగని దేవుడు (ప్రభువు, ఏసుక్రీస్తు) కాదు. మానవులందరి పాపంకోసం క్రీస్తు శిలువ ఎక్కడం సమర్థించుకున్నా, ఆయన మరణం తరువాత పాపం వుండ కూడదు గదా! క్రైస్తవులతో సహా, ఆ తరువాత మానవులు పాపులుఎలా అవుతారు. మన శక్తికి మించిన మరేదో పాపం చేయిస్తే బలహీనుడైన మనిషిది తప్పు ఎలా అవుతుంది. శిక్ష ఎందుకు అనుభవించాలి?

# ఒపీనియన్: 13

సాహిత్యం (భాష) అనేది పదునైన, ప్రమాదకరమైన ఒక ఆయుధం లాంటిది. దానిని వుపయోగించే వ్యక్తికి సామర్థ్యం ఒక్కటే కాదు, సంస్కారం చిత్తశుద్ధి వుండాలి. సత్యానికి ప్రతిరూపమైన 'జ్ఞానం' ఆ వ్యక్తిలో జ్యోతిగ వెలుగుతూ, సాహిత్యానికి మార్గం చూపుతూ వుండాలి. సత్యాన్వేషి అయిన వ్యక్తి చేతిలో వున్న సాహిత్యం అనే ఆయుధం సత్ఫలితాలనే కలిగిస్తుంది. సమాజానికి మార్గదర్శకత్వమై శాంతి సుఖాలను కలిగిస్తుంది. సాహిత్యానికి 'సరస్వతిని' అధిదేవతగా, ఆ సరస్వతిని 'సృష్టి కర్త' బ్రహ్మదేవునికి భార్యగాను, ఆమెకు 'హంస' వాహనంగాను, 'మూర్తి'ని కలిగించడంలో ఔచిత్యాన్ని సత్యాన్వేషి మాత్రమే గ్రహించగలడు.

కాని దురదృష్టవశాత్తు, సాహిత్యరంగంలో ఈ పాలు తక్కువుగా వుంది. చాలా తక్కువుగా వుంది. స్వార్థపరులు, సాహిత్యాన్ని ఖడ్గంకంటే ఘోరంగ సాముచేస్తూ సమాజాన్ని చిత్రవధ చేస్తున్నారు. మనిషిలోని మనస్సును, మానవత్వాన్ని, బుద్ధిని 'ఆత్మ'ను సర్వనాశనం చేసి, మూగ జీవులుగ, మూఢ ప్రజలుగ, జీవచ్ఛవాలుగ, తాము తయారు చేసుకున్న 'బొమ్మలనే' ఆరాధించుకునే హీనులుగ ప్రజలను తయారుచేసి, భారతదేశాన్ని 'ఖర్మ భూమి'గ మార్చుడానికి బ్రహ్మాండంగ పనికివచ్చింది భారత సాహిత్యం.

# ఒపీనియన్: 14

భారతదేశం రిపబ్లిక్‌గా అవతరణ చెంది ప్రత్యేక రాజ్యాంగం అమలులోకి వచ్చింది, జనవరి ఇరవైఆరు.

దేశానికి స్వతంత్రత కలిగిన రోజును, రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును పర్వదినంగా భావించడం సహజం. ఇందులో రాజకీయం వుందా లేక దేశభక్తి వుందాఅనేది అప్రస్తుతమైనప్పటికి, స్వాతంత్ర్యం పొందిన ప్రతిదేశం యిదే పద్ధతి, అనుసరిస్తోంది. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్లు ముఖ్యమంత్రులు ఉపన్యాసాలు, సందేశాలు వగైరా వగైరా యివ్వడమనేది ఆనవాయితీగా జరిగి పోతూంది. అయితే యీ ప్రసంగాలలో 'స్వాతంత్ర్యం' ఉండదనే విషయం ముఖ్యంగా గమనించవలసిన విషయం. వలస పాలన నుండి విముక్తి పొంది, స్వేచ్ఛా వాయువులు పీల్చే అవకాశం కలిగి నందుకు గుర్తుగా, ఆ స్వాతంత్ర ఫలితంగా స్వతంత్ర దేశాన్ని పాలించే పాలకుల ప్రసంగాలు, సందేశాలు స్వాతంత్ర రహితంగా వుంటాయంటే విడ్డూరం కావచ్చు కాని జరిగే ఆచారం అదే!

ఆయా ప్రసంగ పాఠాలు ముందుగా తయారు చేయబడి, చేర్పులు, కూర్పులతో మంత్రివర్గాల 'ఆమోదం' పొందుతాయి. వాటిని అందుకు సంబంధించినవారు చదువుతారు.

# ఒపీనియన్: 15

'గారడీ' విద్య ప్రదర్శించి, పొట్ట పోసుకునే వారు పూర్వకాలంలో (యిప్పుడు కూడ) ఎక్కువుగా వుండేవారు. గారడీ రూపాయిలు కురి పించి, ప్రజల దగ్గరనుండి 'పైసలు' వసూలు చేసుకుని బ్రతికేవారు. క్షణాలమీద 'మామిడి' చెట్టును మొలిపించి, కాయించి, కాయను కోసి దాని ముక్కను ప్రేక్షకులందరికీ పంచిపెట్ట గలిగిన అతను, యింటికి పోతూ ప్రజలు విసిరిన పైసలతో 'చౌకలో' ఒక పండును కొనుక్కోవడం మామూలు. ఈ మాదిరిగ తమ 'కనికట్లు'తో ప్రజలను భ్రమింపజేసి తమ బ్రతుకుతెరువు కొనసాగించడం 'వృత్తి'గా నేరం కాకపోవచ్చు.

అలాటి, ఆ గారడీవాళ్ళ వృత్తిని యిప్పుడు రాజకీయ నాయకులు స్వీకరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి స్వదేశీ ప్రభుత్వం యేర్పడిన తరువాత, ఈ గారడీ విద్య బాగా వృద్ధి చెందింది. గారడీవాళ్ళ సంఖ్య మరింత పెరిగింది. అయితే గారడీ విద్యలో క్రొత్త క్రొత్త పోకడలు, చేర్పులు కూర్పులు అవసరాన్నిబట్టి, ప్రజల అభిరుచులనుబట్టి చేస్తూ వస్తున్నారు. గారడీ వృత్తిలో పొట్టపోసుకునేవారికంటె, లక్షలరెట్ల సామర్థ్యంతో రాజకీయ నాయకులు కోట్లు సంపాదించి, కోట్లాది ప్రజలను నిత్య దరిద్రులుగ మార్చేస్తున్నారు. వృత్తి గారడీవాడు బ్రతుకు తెరువుకు, తను చేసే పని 'మాయ' అని అందరికీ తెలిసేటట్లె చేసి, పాప విముక్తి పొందేవాడు. కాని, రాజకీయ నాయకులు గారడీ ముసుగులో ప్రజల్ని నిలువుదోపిడీ చేయడమే కాక, పనికిమాలిన వారినిగా చేస్తున్నారు.

# ఒపీనియన్: 16

సంఘ శ్రేయస్సుకి 'దేవుడి బెదురు' అవసరమా? క్రూరత్వం, పశుత్వం మొదలైనసృష్టి యావత్తులోని చెడును (మంచిని కూడ) తనలో నిక్షిప్తం చేసుకున్న మనిషిని అదుపులో పెట్టడానికి 'దేవుడు' అనే బూచి అవసరం కాదా? జీవులలో దేనికీ అవసరంలేని, 'దేవుడు' మనిషికి ఎందుకు అవసరమైంది? మిగతా జీవులను అదుపు చేయడానికి సాధుత్వమో, బలప్రయోగమో, ప్రలోభమో అవసర మైనప్పుడు మనిషిని అదుపు చేయడానికి సామదాన భేద దండం మొదలైన అన్ని వుపాయాలు, సాధనాలు అవసరమైనాయంటె, మనిషిజ్ఞానం, సంస్కారం అర్థమౌతూనే వున్నాయి. వీటితోనే సరిపెట్టుకోవడం కుదరక, అన్నిటిని మించి పోయిన 'దేవుడు'తో భయపెట్టవలసి వచ్చింది. స్వర్గంలోనూ, పరలోకంలోనూ, మోక్షం తోనూ ప్రలోభ పెట్టవలసి వచ్చింది. పాపం, నరకం, మొదలైన పేర్ల తో భయపెట్టవలసి వచ్చింది. పుణ్యం పేరుతో 'ఆశ' చూపించవలసి వచ్చింది.

ఎన్ని చేసినా, మనిషి, మానవలోకం సృష్టిలో ప్రమాదకరమైన జీవిగ బ్రతుకు సాగిస్తూనే వుంది. అదుపు, ఆశ, భయం, భక్తి వగైరా వగైరా తత్కాలికమే కావడం, అంతకంటే ఘోరమైనది, వీటన్నిటినీ 'వ్యాపార దృష్టి'లో తెలివైనవారు మార్పు చేసి, స్వార్థాన్ని సాధిస్తూ సమాజంపై స్వారి చేస్తున్నారు. పాపం 'దేవుడు' ఏం చేస్తాడు?

# ఒపీనియన్: 17

మనిషిలోని అర్హత, సామర్థ్యం గుర్తింపుకు రావాలంటే ఆధారం వుండాలి. కొంత 'గతం' వుండాలి. కలవారికే కలిమి చేరుతుంది. ఆధారం వున్నవారికే అవకాశాలు చేరుతూ వుంటాయి. ధనవంతుని సంతానం వృద్ధిలోకి రావడానికి అవకాశాలు వుంటాయి. పదవిలో వున్న వారి సంతానం పైకి రావడానికి వీలుంటుంది.

ప్రపంచంలో ఏ రంగంలోనైనా, గొప్పవారుగ గుర్తింపు పొందిన వారందరికీ అందుకు ఆధారంగా వుండే 'గతం' ఎంతైనా వుంటుంది. ప్రసిద్ధి పొందినవారి 'పూర్వీకం' ఎప్పటికప్పుడు ఆ తరువాతవారి గొప్పతనానికి కారణం, ఆధారం అవుతుంది. అయితే 'గతం' యొక్క ఘనత ఏ మాత్రం లేని వారు గుర్తింపు పొందినవారు లేరా అంటే, అతి తక్కువ. అదైనా గుర్తింపు పొందే గతం గల అదృష్టవంతుల ఆసరా, ఆయా పరిస్థితులనుబట్టి దక్కినప్పుడు మాత్రమే గతం ఏమీ లేని వారికి గుర్తింపు వుంటుంది. ఏ విధంగానైనా గతంలేక, పరిస్థితుల ప్రభావంతో 'గతం' గలవారి తోడ్పాటులేక గుర్తింపు పొందినవారి సంఖ్య అనామకం. అరుదు. మనిషిలో 'టాలెంట్' కంటె, పరిస్థితుల అనుకూలత అవకాశాల అదృష్టం మనిషి గుర్తింపుకు, ప్రయోజక త్వానికి అతి ఎక్కువుగా తోడ్పడుతోందనేది వాస్తవం.

# ఒపీనియన్: 18

ఆలోచించగలిగినవారికి జీవితం అనంతమైన లోతులతో వున్నట్లు అర్థమౌతుంది. ఆ ఆలోచన విధానం క్రమపద్ధతిలో నిర్మాణాత్మకంగా జరిగితే ఎంతో 'జ్ఞానం' మనకి లభిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆలోచనకి బదులు బ్రతకడం అలవాటు గలవారికి ఇదేమీ పట్టదు. తెచ్చు కోవడం, తినడం, కనడం మొదలైన క్రియలు యాంత్రికంగా ప్రకృతిప్రేరణతో జరిగిపోతూ వుంటుంది. నిజానికి వారికి మనస్సుతో పని వుండదు. ఆ అలవాటు జీవితమే వారికి తెలియని రీతిగ ఆ మనసే చేస్తున్నప్పటికి ఆ 'స్పృహ' వారికి వుండదు.

పుట్టడం ఎందుకు? అన్ని ప్రశ్నించుకుంటే తర్కబద్ధంగా సమాధానం వుండదు. పుట్టుకను గురించి భౌతిక విజ్ఞానం ద్వారా శాస్త్ర విశ్లేషణ జీవ రసాయన పద్ధతులపై వివరణ జరగవచ్చు. కాని, పుట్టడం ఎందుకు అని ప్రశ్నిస్తే, అది అయోమయంగా అర్థం లేనిప్రశ్న కన్పిస్తుంది. నిజానికి అది అర్థం లేని ప్రశ్నగా కాదు. పుట్టుక ఎలా జరు గుతుందోవిజ్ఞానశాస్త్రం చెప్పినప్పటికి అది సంతృప్తికరంగా వుండదు. పుట్టడం ఎందుకు అనే ప్రశ్నకితత్వ శాస్త్రవేత్తలు, తాత్విక సాధకులు తమ జీవితాలు ఆ ప్రశ్నకి సమాధానం అన్వేషణలోనే గడిచిపోతున్నట్లు చెబుతారు. అది నిజం కాదు. ప్రశ్న అలాగే వుంది.

# ఒపీనియన్: 19

పదవి వున్నవారే ప్రజలు అనుకుంటె, భారతదేశంలో ప్రజాస్వామ్యం నూటికి నూరు పాళ్ళు అమలు జరుగుతోంది. ప్రపంచంలో ఏ దేశంలోనూ, బహుశా ప్రజాస్వామ్యంపుట్టిన తరువాత భారతదేశంలో అమలు జరిగినంత బాగా ఎన్నడూ అమలు జరిగి వుండదు.

అధికార పార్టీకి చెంది పదవిలో వున్నవారి 'ప్రజాస్వామ్యం' ప్రతిపక్షంలో వున్నవారి కంటె అద్భుతంగా అమలు జరుగుతోంది. పదవిలో వున్నవారే ప్రజాస్వామ్యం అనుకుంటె, దేశంలో మిగిలి పోయిన వారిని ఏమనాలి. అలా మిగిలిపోయినవారిలో కలిమికల వారు పదవిలో వున్నవారి దృష్టిలో 'ప్రజలు' ఈ ధనవంతుల దృష్టిలో అధికారంలో వున్నవారు తమ ప్రతినిధులు లేదా తమ చేతి క్రింద బ్రతికేవారు, చేతిలో కీలుబమ్మలు. కనుకతమ ప్రజలైన ధనవంతుల ప్రతినిధులుగ అధికారం చలాయిస్తున్నవారి చేతులలో ప్రజాస్వామ్యం అక్షరాల, అతి బ్రహ్మాండంగ, ఆడంబరంగ అమలు జరిగి మూడు పువ్వులుగ మూడు వందల కాయలుగ విరాజిల్లుతోంది.

దేశంలోని ధనవంతులు 'ప్రజలుగ' అధికారం పదవి వున్నవారు 'ప్రజా ప్రతినిధులుగ' తేలిపోయిన తరువాత యింకా మిగిలి పోయిన వారిలో రౌడీలు, గుండాలు, నీతిలేనివారు, ఆ "ప్రజా ప్రతి నిధులకు సేవకులు," ఇంకా మిగిలిపోయినవారి పేరేమి?

# ఒపీనియన్: 20

జీవితాన్ని అవకాశాలనుబట్టి కోరిన రీతిగ అనుభవించి, అనుభవించడానికి మరేదీలేక, ఎక్కువైన స్థితిలో భౌతిక జీవితం మీద ఆసక్తి తగ్గి, ఆధ్యాత్మిక భావం కలగడం కొందరిలో జరుగుతూ వుంటుంది. భౌతిక కోరికలు ఒకదానిపై మరొకటి తరుముతూవుంటె, మనశ్శాంతిని కోల్పోయి, మరో 'రిలీఫ్' కోసం క్రొత్తదనాన్ని ఆశించి ఆధ్యాత్మిక ధ్యాసను యేర్పరచుకోవడం మరికొందరు చేస్తూ వుంటారు. భౌతిక వాంఛలు తీర్చుకొనే అవకాశాలు పుష్కలంగా వున్నప్పటికి, వాటిని స్వేచ్ఛగ అనుభవించే వీలులేక, కోరికల భారం మరింత పెరిగిపోతూ వుంటే, ఆ ధాటికి తట్టుకోలేక, అశక్తతతో తప్పనిసరిగా ఆధ్యాత్మికం వైపు మనస్సు మార్చుకోడానికి ప్రయత్నించడం మరికొందరు చేస్తూ వుంటారు. అన్ని అవకాశాలు వున్నప్పటికి, తనవారి ప్రవర్తనపట్ల, హఠాత్తుగాగాని, లేక చాలాకాలం ఓర్పు తరువాతగాని వైరాగ్య భావాన్ని యేర్పాటు చేసుకుంటారు. భౌతిక దృష్టితో తాను అతిగా, ఆలోచనా రహితంగా 'ప్రేమించి'న, ఆ బ్రతుకు నే బ్రతుకుతూ, ఏదో హఠాత్తు సంఘటన తన కళ్ళు తెరిపించి, జీవి తాన ఆశ వదలుకుని, ప్రాణ త్యాగం చేయలేక, బ్రతుకుతీపితో ఆధ్యాత్మిక జీవితానికి అలవాటు పడతారు మరికొందరు. అయితే దారిద్ర్యం కారణంగా ఎంతమంది ఆధ్యాత్మిక రంగం ప్రవేశం జరుగుతూ వుంటుందో చెప్పడం కష్టం. నిజమైన పరివర్తన అనేది అతి అరుదైన సంగతి.

# ఒపీనియన్: 21

వ్యక్తుల ప్రవర్తనలోని మంచి చెడులు కుటుంబంపైన, సంఘంపైన ప్రభావాన్నిచూపిస్తాయి. మతకర్తల ప్రవర్తన ఆధ్యాత్మిక రంగాన్ని ప్రభావితం చేస్తాయి. అలాగే రాజకీయ నాయకుల ప్రవర్తన పద్ధతులు దేశం మొత్తం రాజకీయ రంగాన్ని మంచిగానో చెడ్డగానో తయారు చేయడమేకాక, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక రంగాలపై ప్రభావాన్ని చూపించి, వ్యక్తుల నైతిక స్థితిగతులతో సహా మొత్తం దేశ స్వరూప స్వభావాలను నిర్ధారణ చేయడం జరుగుతుంది. దేశాన్ని పాలించేవారి ప్రవర్తన, స్వభావం దేశం మొత్తాన్ని మంచిగానోచెడ్డగానో తయారు చేస్తుంది. కుటుంబంలోనివారి ప్రవర్తన ఆ కుటుంబానికి, వారికి సంబంధించినవారికి మంచిగానో చెడ్డగానో పేరు తెచ్చినట్లే, దేశంలోని రాజకీయ నాయకుల ప్రవర్తన దేశ గౌరవాన్ని, పెంచడమో, నాశనం చేయడమో జరుగుతూ వుంటుంది.

ప్రస్తుత భారతదేశపు రాజకీయం రోతపట్టిపోయింది. ఆర్థిక సాంఘిక సాంస్కృతిక, నైతిక రంగాలపై దాని ప్రభావం ఎంత ఘోరంగ పనిచేస్తోందో కూడ సులభంగ తెలుస్తుంది. దేశంలోని ప్రజల కడగండ్లు, ఆర్థిక, నైతికస్థాయి ఎంత నీచంగ దిగజారిపోయిందో తెలుసుకోడానికి పెద్ద అనుభవం అక్కర్లేదు. ఈ నీచస్థితికి కారణం, ఎవరు అనేదానికంటె, ఎందుకు అనేది ముఖ్యం.

# ఒపీనియన్: 22

పరలోకంలో యెహోవా దేవుడు వుంటాడని, ఏసుక్రీస్తు ఆయన కుమారుడని, మానవుల పాపాలను తొలగించడానికి దేవుడు తన కుమారుణ్ణి యీ లోకానికి పంపించి, శిలువ ఎక్కించాడని, ఆ తరువాత, తన దగ్గరకు చేర్చుకున్నాడని, ఏసు క్రీస్తు తనని నమ్మినవారిని 'రికమండ్ చేస్తే', దేవుడు అట్టివారిని పరలోక రాజ్యంలోకి రానిస్తాడని, ఏసుక్రీస్తు ద్వారా (రికమండేషన్) తప్ప, పరలోక ప్రవేశానికి అవకాశం లేదని క్రైస్తవుల నమ్మకం–ప్రచారం.

'దేవుడు' అనేదాని మూలం ఆలోచించే పద్ధతి అలావుంచి, కొడుకు, రికమండేషన్ సేవ చేయడం యివి మరీ విడ్డూరమైన విషయాలు... దేవుణ్ణి వదిలేసి క్రీస్తు భజన చేస్తే, ప్రార్థన చేస్తే పరలోక రాజ్య ప్రాప్తి! దేవుడి ప్రారంభం వునికి సంగతి అలావుంచి, ఆయనికి ఏసుక్రీస్తు ఎప్పుడు పుట్టాడు? ఆదంను, ఈవ్‌ను చేసినట్లు తయారుచేశాడా? క్రీస్తు ఈ లోకానికి వచ్చి యిక్కడ పాపుల కోసం శిలువ మరణం చెం దాడట! ఎవరి పాపములకోసం? క్రైస్తవుల పాపాల కోసమా యూదు లతో సహా, యావత్తు ప్రపంచ ప్రజలందరి కోసమా? ఎలా జరిగినా ఆయన మరణంతో పాపం పోయినట్లేనా? అలా పాపం పోగొట్టు కున్నవారంతా (ఏసుక్రీస్తు ఎవరికోసమైతే చనిపోయాడో వారంతా) సరాసరి పరలోకానికి వెళ్ళాలిగదా! క్రీస్తు మరణం తరువాత లోకంలో యింకా పాపం ఎలా మిగిలింది?

మనిషి అజ్ఞానానికి యిది ఒక ఉదాహరణ.

# ఒపీనియన్: 23

దేశ సమగ్రతను, భౌగోళిక సరిహద్దులను (టెరిటరీ) కాపాడ వలసిన బాధ్యత సావరిన్ ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే వారి కర్తవ్యం. వారి సామర్థ్యం ఆ రూపంలో వెల్లడి కావాలి. దేశాలను, భూభాగాలను పోరాడి ఆక్రమించడం ద్వారా, దేశ విస్తరణ గావించడం కూడ పాలకుల ధర్మంగా చలామణిలో వుండేది. అయితే అది రాచరికంలోనో, నియంతృత్వంలోనో, ఫాసిజంలోనో ఆనవాయితీగా జరగ వలసిన వ్యవహారం. సామ్రాజ్య వలసతత్వం అందుకు తార్కాణం. ప్రజాస్వామ్యంలో అది ముమ్మాటికీ తగని పని. ప్రతిదేశం, తమ సమగ్ర భూభాగంలో సక్రమ పరిపాలన సాగించుకోడానికి ప్రపంచ దేశాలన్నీ పరస్పరం సహకరించు కుంటూ, సహజీవనం జరపాలి.

అయితే, ఏ దేశపు పాలకులైనా, తమ దేశపు భౌగోళిక సరిహద్దులను సంరక్షించుకుంటూ, దేశపు భూభాగాన్ని ప్రజల సహాయంతో కాపాడవలసి వుంటుంది. పరిపాలకుల ధర్మంతో పాటు, వారి సామర్థ్యానికి కొలమానం. కాని, దురదృష్టవశాత్తు కాశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్తాను, నేపాలు ప్రాంతంలో మరికొంత భాగాన్ని చైనావారు బల ప్రదర్శన ద్వారా ఆక్రమించుకుని, తమ భూభాగంలో కలుపుకుంటే, నేటికీ ఈ ''వ్యక్తి పూజ'' చేయించుకునే పాలకులు ఏమీ చేయలేకపోయారు.

# ఒపీనియన్: 24

**తా**ము అధికారంలో వున్నప్పుడు దేశంలోని అల్లర్లకు, అశాంతికి, శాంతి భద్రతల లోపానికి దేశంలోని ప్రతిపక్షాలు కారణమని, విచ్ఛిన్నకర శక్తులు, విదేశీ శక్తులు, అభివృద్ధి నిరోధకులు ప్రతిపక్షాలకు తోడ్పడుతున్నాయని, తనని తన ప్రభుత్వాన్ని, తన కుటుంబాన్ని నాశనం చేయాలని కుట్ర ఫలితంగా అలా జరుగుతూ వుందని అధికారం లోవున్న రాజకీయనాయకులు అనే మాటలే! సర్వాధికారాలు తన గుప్పెట్లో పెట్టుకుని, రాజ్యాంగాన్ని తన స్వంత ఖాతాబుక్‌గా మార్చుకుని దేశాన్ని తన ఉద్యానవనంగానూ 'పెరడు' గాను భావించి యిష్టం వచ్చినట్లు తాను, తనవారు వుపయోగించుకునే సర్వాధికారిగ, నియం తగా, మహారాణిగా వెలిగిన ఇందిరాగాంధి ఆ తరువాత కాలంలో ప్రతిపక్షంలో వుండవలసి వచ్చింది. అయితే ఈనాడు దేశంలో జరిగే అల్లర్లు, అశాంతి, ఇదివరకు ఎన్నడూ లేని దేశ ప్రజలకు భద్రత పోయింది. పార్లమెంటు ఆటస్థలంకంటె అన్యాయమై పోయింది. అసెంబ్లీ ల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. గతంలో ఎన్నడూ లేనంత ఘోరంగ, రాజకీయం రోతబట్టిపోయింది.

పాలకులకు వ్యతిరేకంగా కుట్రపన్నేవి ప్రతిపక్షాలే గదా దీని కంతకూ కారణం? మరి ఈ ప్రతిపక్షాలు పాలనలో ఉన్నప్పుడు?

# ఒపీనియన్: 25

విచక్షణా జ్ఞానం లేని విద్య, లోకజ్ఞానం లేని పాండిత్యం అక్షర జ్ఞానం లేని దానికంటె ఘోరం. అక్షర జ్ఞానం లేకపోయినా విచక్షణా జ్ఞానం, లోక అనుభవం వున్నవారితో,లోకానికి పెద్ద నష్టం వుండదు. కాని చదువుకున్నా మనుకునేవారికి విచక్షణా జ్ఞానం లేకపోతేచాలా నష్టం కలుగుతుంది సంఘానికి. వారికి అహంకారం వుంటుంది ఇది మూఢత్వానికి, మూర్ఖత్వానికి కారణమౌతుంది. ఈ అహంకారంతో చాలామంది మామూలు మనుష్యులకు హాని కలుగుతుంది. అలాగే లోకజ్ఞాన శూన్యత్వంతో పాండిత్యాన్ని 'రికార్డు' చేయడం ఏ మాత్రం ఆలోచన గలవారికైనా అసహ్యంగానూ, చాదస్తంగానూ వుంటుంది.

బ్రతుకు వాస్తవాన్ని గుర్తించకుండా గమనించకుండా, పరలోక రాజ్యం, స్వర్గం మొదలైన ఊహాలోకాలను గురించి ప్రాధాన్యతను యిచ్చి, ప్రవర్తించడం బుద్ధి జీవి అయిన మనిషి చేయవలసిన పని కాదు. వారి ఊహలు ఆలోచనల ప్రకారం చచ్చిన తరువాత వారు చేరుకోవాలనుకునే పరలోకం మొదలైన వాటికోసం నియమించిన ఆచారాలకు, లేక ఆజ్ఞలకు పూర్తి విరుద్ధంగా లంపట బ్రతుకు బ్రతుకుతూ, దేవుడికి సలాంకొడితె, స్తోత్రం చేస్తే కొబ్బరికాయ కొడితే ఏమౌతుంది?

# ఒపీనియన్: 26

సహనం లేని వ్యక్తి సాధించేది ఏమీ వుండదు. స్వయంకృతాపరాధంతో సర్వమూ పోగొట్టుకోవలసి వస్తుంది. అయితే పరిమితిలేని ఓర్పు, చేతగానితనానికి, నైరాశ్యానికి అవకాశం యిస్తుంది. తన శక్తికి తగిన ఓర్మితో, ఆ పరిధిలోనే కార్య సాధనకు ప్రతిమనిషి ప్రయత్నం చేయాలి.

అలసత్వాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని 'ఓర్పు'తో సమర్ధించుకుంటూ, ఆత్మవంచన చేసుకునేవారే ఎక్కువమంది వున్నారు. తమ అసమర్ధతను కూడ ఓర్పు పేరుతో సమర్థించుకుంటూ, వూహలతో బ్రతుకు గడిపేవారు వున్నారు, గొప్పలు చెప్పుకునేవారూవున్నారు. అయితే వాస్తవ దృష్టితో అంచనా వేసుకుని, తగిన పద్ధతిలో కృషి చేస్తూ, అడ్డువచ్చే అవాంతరాలను తొలగించుకోవడంలో, తగినంత ఓర్పు చూపిస్తూ, కార్య సాధన చేయడం వుత్తమ లక్షణం. సామర్థ్యం లేని 'ఓర్పు' చేతగానివాని 'ప్రతిజ్ఞ' ఎందుకూపనికిరావు.

'ఓర్పు'కి, కార్యసాధన సామర్థ్యానికి అవకాశాలు కూడ ఎంతో ముఖ్యం. అవకాశాలు లేని సమర్థుడు, ఆయుధం లేని యోధుడు తుదివరకు పోరాడి విజయాన్ని పొందడం సాధ్యమయ్యే పనికాదు.

# ఒపీనియన్: 27

ఇతరులు చెప్పేదానిని సహనంతో పూర్తిగ సాధ్యమైనంత శ్రద్ధగా వినాలి. మనకి తెలిసిన విషయమే అయినప్పటికి, ఒక విషయంలో యితరులు చెప్పేదానికంటె, ఎక్కువ మనకి తెలిసినప్పటికి, వినడానికే ప్రయత్నించాలి. వీలుంటె, మనకి తెలిసిన దానిని వినిపించడానికి కూడ ప్రయత్నించాలి. మనకి తెలియనిదానిని తెలుసుకోడానికి సిగ్గుపడకూడదు. అలాగే తెలిసిన దానిని తెలియజేయడానికి భయపడ కూడదు. అహంకారంగాని, కేవలం అనుకరణగాని మంచిది కాదు.

జీవితాంతం తెలుసుకునేది, తెలియ జెప్పేది వుంటుంది. విద్యార్థులు వుపాధ్యాయులైనట్లె, ఉపాధ్యాయులు-విద్యార్థులుగ భావించుకోవలసిన అవసరం వుంటుంది. జ్ఞానార్జనకు యీ పద్ధతి అవసరం. కాని చాలా మందిలో యితరులకు చెప్పే లక్షణమే ఎక్కువ గా వుంటుంది. తాము తెలుసుకోవలసినది ఏమీ లేదు, తనకి కనిపించేవారంతా తనద్వారా తెలుసుకోవలసిన వారేననే అహం కారం అజ్ఞాని లక్షణం. వివేకం, వినయం సంయమనం జ్ఞానార్జనకు వుపయోగపడతాయి.

# ఒపీనియన్: 28

ప్రజలకు మేలు కలిగించేది పాలకులా, ప్రభుత్వ విధానమా? ఈ ప్రశ్న కొంత గజిబిజిగా వున్నా, ఒకదాని కొకటి సంబంధం లేదు. ప్రభుత్వ విధానం ప్రజాస్వామికమైనా, దాని నిర్మాణం, నిర్వహణ ప్రజల ద్వారా జరుగుతున్నట్లు కన్పించినా, ప్రజాస్వామ్యలక్షణాలైన రాజ్యాంగం ఫెడరల్ పద్ధతి, లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషియరీ మొదలైన హంగులు అన్నీ వున్నప్పటికి, ఇన్ని సంవత్సరాల స్వతంత్ర పాలనలో ప్రజా సమస్యలుతీరక పోగా, అవి మరింత జటిలమైనాయి దీనినిబట్టి, పాలకుల ప్రభావం ప్రభుత్వ విధానం అమలుపై భారీగా వుంటుందనేది స్పష్టమౌతోంది. పాలకులు స్వార్ధపరులు, అహంకారులు, అసమర్ధులు అయినప్పుడు అవినీతి ఆచార అలవాటుగా వారి ద్వారా అమలు జరిగిపోతున్నప్పుడు ప్రభుత్వ విధానం ప్రజాస్వామ్యమైనా, మరొకటైనా ప్రజలకు కలిగే ప్రయోజనం ఏదీ వుండదనేది యిన్ని సంవత్సరాల అనుభవం ఋజువు చేస్తోంది.

సూత్రాలు, సిద్ధాంతాలు, విధానాలు, వ్యవహారాలు ఆకర్షణీయమైన ప్రచారానికి పాలకులు స్వంత ప్రయోజనాలను సాధించుకోడానికి, ప్రజలను బానిసలుగా చేసి తమని ఆరాధించే హీనస్థితికి దిగజార్చ డానికి వుపయోగపడినట్లు గ్రహించవచ్చు.

# ఒపీనియన్: 29

'నేచర్ యీజ్ దేర్  ఇటీజ్ క్రియేటెడ్. క్రియేషన్ యీజ్ దేర్ యిట్ ఎగ్జిస్ట్సు  ఇవల్యూషన్ ఈజ్ దేర్  ఇట్ బ్రింగ్స్ ఛేంజ్. వెరైటీ అండ్ డిస్పారిటీ ఆర్ ఎటర్నల్. ఆల్ ది రిమెయినింగ్ ఈజ్ ఎయిదర్ టు మేక్ ఆర్ టు బి మేడ్. హ్యూమన్స్ ఇంటలిజెన్స్  ఈజ్ దేర్ టు ఎడ్జెస్ట్ ఆర్ విద్ ది స్కేల్ ఆఫ్ జస్టిస్ ఇన్ ఆర్డర్ టు ది కన్వీనియన్స్ అండ్ యిన్ ఎకార్డింగ్ టు ది ఎన్విరాన్‌మెంట్సు.

నా ఫిలసాఫికల్ వ్యూని, ఇంగ్లీషు భాషలో వ్యక్తం చేస్తూ, మాతృభాష తెలుగు లిపిలో వ్రాయడం అపోహలకి అవకాశం లేదు. నా ఆలోచనా ధోరణి మూలంలో యీ  పద్ధతిలోనే వుంటుంది. పైన నేను వ్యక్తం చేసిన తత్త్వంలో,  లేక అభిప్రాయంలో మరికొన్ని ప్రశ్నలుకు అవకాశం వుంది ముఖ్యంగా 'ఎగ్జిస్టెన్స్'అనే మాట చాలా ప్రశ్నలను రేకెత్తిం చవచ్చు. 'ఎటర్నల్' అనే మాట కూడ బహుశా ఆలోచన కలి గించవచ్చు.

ఏదైనా, కాకతాళీయంగా నా మనస్సులో కలిగిన భావం కాదది. ఏదో పుస్తకాలు చదవడం ద్వారా కలిగిన నిర్ణయం ఆలోచన కాదది. చాలా బాగా 'ఆలోచన',  'పరిశీలన', పరిశోధన, తరువాతనే నాకు కలిగిన భావాన్ని అలా క్రోడీకరించాను.

# ఒపీనియన్: 30

'మైండ్ అండ్ మేటర్, బోత్ ఆర్ దేర్ ఇన్ నేచర్. విచ్ యీజ్ ది ఫస్ట్? ఇటీజ్ నాట్ యాన్ యింపార్టెంట్ క్వశ్చన్, బికాజ్ మైండ్ ఈజ్ విదిన్ ది మేటర్ యిట్ సెల్ఫ్. బట్ ది ఎగ్జిబిషన్ ఆర్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ దోజ్ మే నాట్ బి ఇన్ ఎ సేమ్ క్వాలిటీ అండ్ క్వాంటిటి  అండ్ ఆల్సో ఇన్ కేస్ ఆఫ్ ఇంపార్టెన్స్ దే మే బి ఇన్ డిఫరెంట్. సో, నో క్వెశ్చన్ ఆఫ్ 'ఇజం' సెపరేట్‌లీ యిన్ రిగార్డింగ్ టు ది మైండ్ అండ్ మేటర్.

బట్, జనరల్లీ దేరార్ టు సెపరేట్ యిజమ్స్ యిన్ దిస్ కేస్. ది 'యిజం' దట్ రిలేట్స్ టు ది మైండ్, ఈజ్ కాల్డ్ 'ఐడియలిజం' ఇన్ దట్ వే ది యిజం దట్ కన్‌సర్న్స్ (Concerns) టు ది మేటర్ యీజ్ కాల్డ్ 'మెటీరియలిజం' బట్, టు స్పీక్ ది ట్రూత్, ది లేటర్ యీజ్ ది ఎక్స్‌టీరియారిటీ అండ్ ది ఫార్మర్ యీజ్ ది ఇంటీరియారిటీ ఆఫ్ ది సేమ్ కాజ్ అండ్ యాక్షన్.

సీడ్ యీజ్ దేర్. ఇటీజ్ మేటర్. దేరీజ్ లైఫ్ విదిన్ యిట్. యిటీజ్ మైండ్. హేవింగ్ ది కో ఆపరేషన్ అండ్ కో ఆర్డినేషన్ ఆఫ్ యీచ్ అదర్ బోత్ ఆఫ్ దెం గివ్ ది అవుట్ కం (ప్రొడక్షన్) యిన్ ది ఫారం ఆఫ్ 'ప్లాంట్' విద్ ది రిజల్ట్ ఆఫ్ సోయింగ్. సో, యిన్ దిస్ వే, ది 'మేటర్ ఎంకరేజెస్ ది మైండ్ యిన్ ది నేం ఆఫ్ కాజ్ లైజీ రీజన్ లైజీ నెసెసిటీ  సో ఆల్సో ది మైండ్ యిన్‌ఫ్లుయన్స్ ది మేటర్ యిన్ ది ఫారం ఆఫ్ యాక్షన్, ఆర్ ఇంప్లమెంటేషన్! ఇటీజ్ ది జిస్ట్ ఆఫ్ ది మైండ్, అండ్ మేటర్.

# ఒపీనియన్: 31

ప్రాచీన మానవ సమాజంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల విభజన స్పష్టంగా అమలు జరగలేదు. పుట్టిన జీవి బ్రతకడం ప్రధానంగ, అందుకు అవసరమైన, అనుకూలించిన మార్గాలను అనుసరించి, ఆకలి మొదలైన యీతి బాధలను 'మనస్సు' చెప్పినట్లు, ప్రకృతి అనుకూలించినట్లు తీర్చుకోవడమే జరిగేది. అప్పట్లో ప్రతి విషయం అంతే!

అయితే, జీవ పరిణామ దశ మాదిరిగానే, సంఘ పరిణామ గమనంలో మానవుని 'ఆలోచన'కి స్పష్టత, పక్వత యేర్పడుతున్నకొద్దీ, మానవ సమాజ జీవితం సాంఘిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక తదితర విధాలుగా, 'విభజన' జరిగి, అభివృద్ధి చెందడం ప్రారంభమైంది  తత్ఫలితంగా, అనేక ప్రాథమిక మాధ్యమిక దశలు దాటి, రాజకీయంగా, రాచరికం స్థిరపడింది. సమాజ జీవితంలో మిగతా రంగాలన్నీ దాదాపు 'ఫ్యూడలిజం'గా మార్పు చెందింది. అంటె మధ్య యుగాల కాలానికి, రాచరికం, ఫ్యూడలిజం మానవ సమాజాన్ని పాలించాయి.

అయితే, పరిణామ ప్రవాహంలో, మధ్యయుగాలు గడిచిపోయిన తరువాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం (పార్టీ నియంతృత్వం) రాజకీయంగానూ, బూర్జువా (పెట్టుబడిదారీ విధానం) ఆర్థిక సాంఘిక రంగాలలోనూ స్థిరపడింది. అంటే, మధ్యయుగాల రాచరికం, ఫ్యూడలిజాలను శిధిలం చేసి, వాటి అవశేషాలమీద, ఆధునిక యుగంలో నేటికి పార్టీ ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం ఏలుతున్నాయి.

# ఒపీనియన్: 32

విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి, ఆధునిక నాగరికత, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో భాగాలు మాత్రమే! సంపన్నులైనవారు నేటి అభివృద్ధిని పుష్కలంగా అనుభవిస్తూ వుంటె, అతిసామాన్యులైన 'ప్రజలు' దాని 'నీడలో' మాత్రమే వుంటున్నారు కొన్ని సందర్భాలలో విషయాలలో ఆ నీడకు కూడ వారు బహుదూరంలో వుంటున్నారు.

వ్యాపారం అనేది పెట్టుబడిదారీ విధానానికి ప్రాణం. దాని ద్వారా వలసాధిపత్యంతో సహా అనేక యితర ప్రయోజనాలను సాధిస్తోంది. వలస పాలన ప్రధానంగా గల 'సామ్రాజ్య వాదం' (రాచరికం) రాజ కీయంగ అంతరించి పోతున్నప్పటికి, దాని స్థానంలో అంతకంటె శక్తివంతము, ప్రమాదకరమైన 'ఆర్థిక సామ్రాజ్య వలస విధానం' అమలు జరుగుతోంది పెట్టుబడిదారీ విధానం ద్వారా. కోట్లాది పేద ప్రజలు కొద్ది సంఖ్యలో వుండే ధనవంతులపై ఆధారపడి వున్నట్లే, అధిక సంఖ్యలోగల పేద దేశాలు (బడుగు దేశాలు) అభివృద్ధి చెందుతూ వున్న దేశాలు, క్రొత్తగ వలస పాలన విముక్తి చెందిన దేశాలు స్వల్ప సంఖ్యలో గల సంపన్న దేశాలపై ఆధారపడి, వాటి రాజకీయ ఆధి పత్యానికి, 'గులాం' కావలసి వస్తోంది. అమెరికా, రష్యా–ఈ రెండు దేశాలు సిద్ధాంత భేదం లేకుండా ఆర్థిక వలస పాలన చేస్తున్నాయి.

# ఒపీనియన్: 33

పాత భావాలతో ఆచారాలతో బూజు పట్టిపోయి, మూఢ నమ్మకా లతో జడత్వాన్ని పొందిన సమాజాన్ని మేలుకొలిపి, వారిలో భావ చైతన్యాన్ని కలిగించడానికే తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహా పురుషుడు, విప్లవవాది, సంఘ సంస్కర్త జీసస్ క్రైస్ట్. హిందూ మతస్తుల మూఢత్వానికి చాదస్తానికి బలైపోయిన మహాత్మా గాంధీలాంటి ఎందరో మహానుభావులవలె, జీసస్ క్రైస్ట్ తాను సంస్కరించాలనుకున్న తన జాతీయులైన యూదుల మూర్ఖత్వానికి నిలువునా బలైపోయిన గొప్ప మనీషి. మానవునిగా పుట్టినందుకు మానవ సంఘానికి ప్రయోజనం చేకూర్చడానికి ప్రయత్నించడం ద్వారా తన జన్మ సార్థకం చేసుకున్నారు. మానవులందరికీ ఆయన జీవితం ఆదర్శప్రాయమైనది. ఆచరణ యోగ్యమైనది.

# ఒపీనియన్: 34

పుట్టుక కలిగిన దానిలోనుండే మరో పుట్టుక వస్తుంది తప్పనిసరిగా రావాలని లేదు  అయితే చేయబడిన దానిలోనుండి మాత్రమే మరొకటి చేయబడాలని లేదు. పుట్టుక కలిగిన దానిలోనుండి, చేయబడడం జరుగుతుంది, అలాగే చేయబడిన దానిని మార్పు చేయడం ద్వారా మరొక చేయబడినది వస్తుంది. పుట్టుక కలిగిన దాని పూర్వ స్థితిని అన్వేషిస్తూపోతే, సృష్టి ప్రారంభం కన్పించాలి. పుట్టుక కలిగిన దానిలో నుండి పుట్టడం వేరు  దానికి పుట్టుక లక్షణం కలిగి వుంటుంది. పుట్టుక ప్రారంభం వేరు దీనికి పుట్టించే లక్షణమే వుంటుంది. సైన్స్ దృష్ట్యా యిది అబద్ధం. తర్కబద్ధం కాదు, అయినా మనిషిచేత కనగొనబడిన సైన్స్ పుట్టుక గురించే యింకా పూర్తి పరిశీలన పరిశోధన చేయలేదు గనుక, పుట్టుక ప్రారంభం గురించి చాలా అభివృద్ధి చెందవలసి వుంటుంది. పుట్టుక లక్షణం కలిగినదానికి 'నాశనం' వుంటుంది. పుట్టించే ప్రారంభ లక్షణం గలిగినదానికి అలాటిది వుండదు. ఇది మెట్ట వేదాంతం కాదు. చాదస్తం అంతకన్నాకాదు  దేవుడి మూఢత్వం అసలే కాదు.

'ఇజాలు' పుట్టుకల లక్షణాన్ని, పుట్టించే తత్వాన్ని కలిగి వుంటాయని లేక, పుట్టుక లక్షణం, తత్వం కలదానిలోనుండి తయారౌతాయా? లేక తయారైన వాటి శిధిలాలపై జన్మిస్తాయా? వీటిలో కలిగేది ఇవల్యూషనా, రివల్యూషనా? అది భౌతికమా? లేక అందుకు భిన్న మైందా? యివి ముఖ్యమైన ప్రశ్నలే!

# ఒపీనియన్: 35

**జీ**వ పరిణామంలో భౌతిక మార్పు ఎక్కువగా జరుగుతూ వుంటుంది. అయితే అదే రేషియోలో మేధస్సు, బుద్ధి పెరుగుతుందా అనేది నాకు అనుమానం. భౌతిక పరిణామానికి తద్వారా కలిగే మార్పుకి, మానసిక పరిపక్వతకు, మేధా సంపత్తికి సంబంధం కన్పించడం లేదు. జీవులలో మానవ జీవి కూడా ఒకటి. జీవ పరిణామంలో మానవ జీవ భౌతికస్థితి ఒక దశ కావచ్చు. అది కూడ మార్పు చెందుతూవుండవచ్చు. కాని మేధస్సుకి యీ సూత్రం ముఖ్యంగా జీవ పరిణామ సూత్రం ఎంతవరకు  అప్లయి చేయడానికి వీలుందో యోచన చెయ్యాలి.

మత పద్ధతి, ఈ విషయంలో సంతృప్తికరంగా లేదు – దేవుడు, సృష్టి, కర్మ, జన్మ పుణ్యం, పాపం, మొదలైన మత పరిభాషా పదాలు అయోమయాన్ని కలిగించడమేకాక, వాటిల్లోనే అంతర్గత పరస్పర విరుద్ధత వుంటుంది. హేతువాద పద్ధతిలో తర్కబద్ధంగా యోచనచేస్తే, పరిశీలన జరిపితే అవి ఎంతవరకు నిలుస్తాయో చెప్పడం కష్టం. 'సృష్టి'ని గురించి హిందూ దార్శనకాలు కొంత పరిశీలన చేసినా తృప్తికరమైన సమాధానం వుండదు.

ఏమైనా, విజ్ఞాన శాస్త్ర జ్ఞానం పరిశీలన చేయవలసిన విషయం జీవ పరిణామ సూత్రం. దీనిని ఎంతో పరిశీలన చెయ్యాలి.

# ఒపీనియన్: 36

సాంఘిక పరిణామంలో 'రాజకీయం' కూడ రకరకాలుగ మారి, నేటికి 'ప్రజా స్వామ్యం' అనే దశకు చేరింది. అయితే నిజానికి పార్టీస్వామ్యం, వ్యక్తి లేక వ్యక్తుల నియంతృత్వమే ప్రజాస్వామ్యం పేరుతో నేటికీ చలామణి అవుతోంది. నిజమైన 'ప్రజల ప్రజాస్వామ్యం' రూపొందడానికి యింకా చాలాకాలం పట్టవచ్చు. అసలు నేటి 'ప్రజాస్వామ్యం' ఆ దశను చేరుతుందా అనేది కూడా అనుమానమే.

రాచరికం, మతం ఒకే నాణానికి రెండు ముఖాలు. పరస్పర ఆధారాలు. అయితే ఈ రెండింటికి కూడ 'విరోధం' సంభవించిన సందర్భాలు లేకపోలేదు అలాగె, ఈ రెండూ ఒకదానికోసం మరొకటి కృషి చేసిన సందర్భాలు కూడ చరిత్రలో వున్నాయి. అయితే ఈ రెండింటి ద్వారా ప్రజలకు కీడు కలుగుతుందనేది స్పష్టం. ఆ 'కీడు' స్వరూప స్వభావాలు వేరుగ వుండవచ్చు.

ప్రపంచంలో రాచరికం క్రమంగా అంతరించిపోతోంది. అంతరించిపోతోంది అనేకంటే, రూపాంతరం చెందుతోంది అనవచ్చు. పేరు ఏదైనా, మరో రూపంలో రాజకీయం రాచరికాన్నే అమలు చేస్తోంది నేటికికూడ. కనుక, రాచరికం అంతరించిందని సంతోష పడవలసిందేమీ లేదు. గతించేదానికంటే, ప్రతిష్టించేదానిని గురించే మేధావులు యోచన చెయ్యాలి.

# ఒపీనియన్: 37

భారతదేశానికి 'మతం' చాలా కీడు చేస్తోంది. భారతీయులను పాడు చేస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 'రాజకీయం' మతం చేసిన చెడును పెంచి, భారతీయ సంస్కృతి నైతిక స్థాయిని దాదాపు 'నిల్ బేలెన్స్'లోకి నెట్టివేసింది. మతాన్ని మించి పోయిన దుర్మార్గం రాజకీయం ద్వారా జరుగుతోంది. దేశ రాజకీయం కొందరి చేతులలో స్వార్ధంగా రూపుదాల్చడంతో నేటికి దేశ పరిస్థితులు అన్ని రంగాలలోనూ, హీనాతి హీనమైన నీచ స్థితికి దిగజారిపోయింది. యింకా పోతోంది. దీనికి అంతం వుంటుందా అనే సందేహం కలిగే పరిస్థితులు నేడు దేశంలో ముసురుకొని వున్నాయి. మానవ జాతిని మేలుకొల్పి, మార్గం చూపేమేధావులు ఈ దేశంలో యిప్పుడు వున్నారా అనే సందేహం కూడ కలుగుతోంది. దేశ పరిణామాలు, పరిస్థితులు దీనినే ఋజువు చేస్తున్నాయి.

'రాజకీయం' లేని మానవ జీవితమే కన్పించడం లేదు. పుట్టుకనుండే రాజకీయ 'శీతల హస్తం' నీడ పడుతోంది. విద్యార్థిగ, ఆ తరువాత జరగబోయే యావత్తు జీవితం రాజకీయమయమే! పురాణాలలో వామనమూర్తి విశ్వవ్యాప్తంలాగా భారత దేశంలో, వ్యక్తి పూజ, వ్యక్తి స్వార్థం, వ్యక్తి రాజకీయం స్థిరపడి వుంది.

# ఒపీనియన్: 38

'వర్గ పోరాటం' యొక్క సహజత్వాన్నిబట్టి, పెట్టుబడి దేశాలు లేక వర్గాలు, సోషలిస్టు దేశాల మధ్య వైరం సహజం. అది ఏదో కొంత ఎప్పుడూ కొనసాగుతూనే వుంటుంది. అందుచేత అగ్రరాజ్యాల మధ్య 'వైరం' సహజం. చైనా స్థితి కూడ అలాగే వుండాలి. ఇది ఆర్థిక సూత్రాలుపై ఆధారపడి విశ్లేషణ చేయడం ద్వారా సిద్ధాంత పరిమితిలో జరిగే పని.

అయితే 'రాజకీయం' ఇందుకు భిన్నంగా పనిచేస్తుంది. 'రాజ్య విస్తరణ కాంక్ష', 'ఆధిపత్యం' రాజకీయం ద్వారా యేర్పడతాయి. రాచరికంలో సామ్రాజ్యవాద ఫలితంలో, వలస విధానం అమలు జరగడం గతకాలంలో అమలు జరిగింది. వలస విధానంలో రాచరిక ధోరణి మారి, సోషలిస్టు పంథా యేర్పడినట్లు వర్తమాన పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

సిద్ధాంతపరంగా పూర్తిగ విరుద్ధమైన దేశాల మధ్య వైరుధ్యం సహజమే అనుకుంటే సోషలిస్టు, కమ్యూనిస్టు దేశాల మధ్య తీవ్ర విరోధానికి కారణం, 'సామ్రాజ్య విస్తరణ కాంక్షే. పేద దేశాలపై రాజకీయంగా పెత్తనం, ఆధిపత్యం సంపాదించే పోటీలో అగ్ర దేశాలు, పెట్టుబడి దేశాలను మించిపోయాయి. ఆర్థిక సిద్ధాంతాల సారూప్యం కంటె, రాజకీయ ఆధిపత్యమే వీటికి కావలసింది. రష్యా మద్ధతుతో వియత్నాం కంపూచియాపై దండెత్తడం, చైనా, వియత్నాంపై యుద్ధం చేయడం ఈ పరిస్థితినే స్పష్టం చేస్తున్నాయి.

# ఒపీనియన్: 39

ప్రస్తుత విజ్ఞాన శాస్త్రం యింకా ఎంతో అభివృద్ధి చెందవలసి వుంది. భవిష్యత్తులో అది చెందవలసిన అభివృద్ధితో పోల్చినప్పుడు, యింతవరకు జరిగింది చాల స్వల్పమని, బాగా అసంపూర్ణము, అసమగ్రము అని చెప్పవలసి వుంది. నిజానికి, యిప్పటి వరకు అమలు జరుగుతున్న విజ్ఞానశాస్త్రంలో ఎక్కువ భాగం వాస్తవ విరు ద్ధం. ఊహా మాత్రమైన అనేక సూత్రాలను, పరిశోధనాలయాలలో 'ఋజువు' చేస్తూ, వాటిని అమలు చేయడానికి ప్రయత్నించడం జరుగుతూ వుంది.

ఎంతో అభివృద్ధి చెందవలసిన శాస్త్రజ్ఞానం, విశ్వవ్యాప్తంగా విస్తరించవలసిన విజ్ఞానం కనీసం 'సూర్య కుటుంబం' వరకైనా, తన పనిని పూర్తి చేయగలుగుతుందా అనేది అనుమానం. సమగ్రమైన అభివృద్ధి కాకపోయినా, ప్రస్తుత స్వరూపస్వభావంలోనైనా, సూర్య కుటుంబ పరిజ్ఞానాన్ని సాధించగలుగుతుందా?

న్యూటన్ సిద్ధాంతాలు, ఐన్స్టీన్ సిద్ధాంతాలు యిప్పటివరకు సమగ్రమైనవిగా పరిగణింపబడుతున్నాయి. వీటిని సవాలు చేయ గలవారు లేకపోయినా, సందేహపడేవారు కొద్దిమంది అయినా ప్రస్తుత కాలంలో వున్నారు. అయితే వారు వెలుగు చూచే అవకాశాలు ప్రస్తుతం అంతగా లేవు.

నిజానికి న్యూటన్ సిద్ధాంత లోపం, ఐన్స్టీన్ సిద్ధాంతం అసమగ్రత అధిగమించడం ద్వారా మాత్రమే, ప్రస్తుత విజ్ఞాన శాస్త్రం కనీసం 'సూర్య కుటుంబాన్ని' పూర్తి చేయగలదు.

# ఒపీనియన్: 40

'కాలం' అంటే ఏమిటి? అలాగే 'దూరం' అంటే ఏమిటి? కాలం– దూరం సామాన్య ధోరణిలో ఆలోచిస్తే పెద్ద చిక్కు లేదు. వాటి నిర్వచనాలను గురించి తాత్విక భావంతో యోచన చేస్తే అంత సులువు కాదు. నిజానికి ఈ 'రెండూ' ఒక్కటే?

రెండు బిందువులకు మధ్య ఉన్న 'ఆకాశాన్ని' దూరం అనాలి. 'చలనం' ద్వారా ఈ దూరం 'కాలం'గా మారుతుంది అంటే భావించ బడుతుంది. దూరం అనేది దృశ్య పదార్థం కాని కాలం యాబ్స్ట్రాక్ట్ నేచర్ని కలిగి వుంటుంది. 'చలనం' ద్వారా 'దూరం' తరిగిపోతూ వుంటే, ఆ మేరకు 'కాలం' పెరుగుతూ వుంటుంది. అయితే యీ కాలం పెరుగుదల, దానికి సంబంధించిన భౌతిక 'దూరం' పూర్తి లేక అదృశ్యం అయ్యేంతవరకే వుంటుంది. దూరం పూర్తి కావడంతో కాలం దానితోపాటు అదృశ్యమై పోతుంది లేదా దూరంలో కలిసిపోతుంది. మళ్లీ 'దూరం' యేర్పడగానే కాలం ప్రారంభమౌతుంది. చలనం లేకపోతే దూరం దూరంగానే వుంటుంది. 'కాలం' ఉండదు. అంటే స్థంభించిపోతుంది.

'చలనం' ద్వారా ఒకవైపు దూరాన్ని 'నాశనం' చేస్తూ, అదే చలనం మరోవైపు కాలం సృష్టికి, కారణమౌతుంది. అంటే చలనం ఒక రూపంలో 'దూరం'గానూ, రెండోవైపు 'కాలం'గాను 'మార్పు' చెందుతూ వుంటుంది. ఇంతకూ 'చలనం' అంటె...?

# ఒపీనియన్: 41

'చలనం' విశ్వధర్మం. 'జీవ' చలనం అందులో భాగం. గతి, స్థితి చలనాల భేదం పరిణామ సూత్రానికి ఆధారం.

పదార్థపు సూక్ష్మాతి సూక్ష్మ ప్రమాణం (యిప్పటికి) పరమాణువులో జరిగే చలనం  ఆ చలనంలో జరిగే అంతశ్చలనం మొదలు, గ్రహాలు గ్రహకూటములు, నక్షత్రాలు నక్షత్ర కూటములు, నెబ్యులాలు వాటి కూటములు...... యిలా అనంత విశ్వం 'చలనం' కలిగి, నిత్యం స్థితి, గతి పరిణామ ఫలితాన్ని పొందుతూనే వుంది. ఈ చలనగతిలో, ఆధారపడడం, ఆధారం కావడం ప్రతిదానిలోనూ జరుగుతూ వుంది.

'విశ్వం' అంటే అనంతమైనది అని సరిపెట్టుకోవడం మినహా యిప్పటివరకు దానికి స్పష్టమైన నిర్వచనం లేదు. అయితే దేనికదే సంపూర్ణం, అసంపూర్ణంగా వుంటుంది విశ్వంలో. ఈ అనంత విశ్వంలో 'భూమి' అత్యంత సూక్ష్మమైనది. దీనిపై నివసించే మానవుడు ఊహకందని సూక్ష్మాతి సూక్ష్మ రేణువు. కాని, అనంత విశ్వాన్ని గురించి 'ఆలోచన' చేయగల మేధస్సు మనిషిలో వుండడం చిత్రమైన సంగతే అయినా, అది విశ్వధర్మానికి విరుద్ధమైనది, అతీతమైనది కాదు. నిజానికి యిది విశ్వధర్మ ప్రతిరూపం. ముఖ్యంగా మనిషి మేధస్సు సర్వ విశ్వ ధర్మానికి సంకేతం. తద్వారా అంటే మనిషిని పూర్తిగ తెలుసుకోవడం ద్వారా, అనంత విశ్వాన్ని గురించి ఆలోచనకు వీలౌతుంది.

# ఒపీనియన్: 42

మానవుడు బానిస! మతానికో, రాజకీయానికో, ఆచారానికో, చాదస్తానికో బానిసగా బ్రతకడమే మానవ జీవితంలో ఎక్కువ భాగం గడుస్తుంది. జనాభాలో అత్యధిక సంఖ్య 'బానిస' బ్రతుకునే అనుభవిస్తున్నారు.

రాజకీయంగ స్వతంత్రం పొంది, పరాయి ప్రభుత్వానికి బదులుగా స్వదేశీ ప్రభుత్వాన్ని యేర్పాటు చేసుకున్నప్పటికి, స్వదేశీ నాయకులకు రాజకీయ బానిసలై బ్రతుకుతున్నారు భారతీయులలో అధిక సంఖ్యాకులు. ఇతర దేశాలలో ఏవో కొన్ని ప్రాంతాలు తప్పించి, దాదాపు పరిస్థితి యిదే అయినప్పటికి, యీ విషయంలో భారతదేశానిదే అగ్రస్థానం. ఇంగ్లీషువారికంటె, ఎన్నో రెట్లు 'రాచరికం' ప్రజాస్వామ్యం పేరుతో అమలులోవుంది. ఇంగ్లీషువారికి బానిసలైన వారు ఆనాడు తక్కువ సంఖ్యలోనే వున్నారు. దేశం యావత్తు పరాధీనంలో వున్నప్పటికి వారి భాషకు, మతానికి, వేషానికి బానిసలైనవారి సంఖ్య తక్కువే! అయితే ఈ నాటి రాజకీయ నాయకులకు బానిసలైనవారి 'స్వతంత్ర భారతీయుల' సంఖ్య అంతకు ఎన్నో రెట్లుగా వుంది. అది భారతీయుల ఖర్మా? అని ఆలోచిస్తే, వాస్తవమా అనిపిస్తుంది. నాయకులు 'మాయ' చేయడంతప్ప, మేధాసంపత్తి లేదు. అయినా భారతీయ 'మేధావులు' సహితం సమ్మోహితులై పోతున్నారు.

# ఒపీనియన్: 43

చైనా, టిబెట్‌ను తన 'సామ్రాజ్యం'లో దౌర్జన్యంగా కలుపుకుంటె, ఆ చర్యను భారతదేశం ఆమోదించింది. అప్పటివరకు దాని పాలకుడైన దలైలామాకు ఈ దేశంలో రాజకీయ ఆశ్రయం కల్పించి 'అలీన విధానాన్ని' ప్రదర్శించింది భారతదేశం. అదే పద్ధతిలో 1962లో దురాక్రమణద్వారా యుద్ధం చేసి, కొన్ని వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా తన 'సామ్రాజ్యం'లో కలుపుకుంటె ఏమి చేయలేని స్థితిలో మిగిలిపోయింది.

తూర్పు పాకిస్తాన్ తన కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటుచేసి, 'బంగ్లా దేశ్'గా అవతరించడానికి తూర్పు పాకిస్తాన్ తరపున నిలిచి పశ్చిమ పాకిస్తాన్‌తో యుద్ధం చేసిన భారతదేశం, దేశ విభజన సమయంలో, మిగతా సంస్థానాలతోపాటు భారత దేశంలో కలిసిపోయిన కాశ్మీర్ సంస్థానాన్ని, పాకిస్తాన్ ఆక్రమించుకుని, యీనాటికి 'అజాద్ కాశ్మీర్' గా తన దేశంలో భాగంగా చేసుకుంటే, ఏమి చేయలేని స్థితిలో భార తదేశం వుంది.

ఈ దేశాన్ని పరిపాలించడానికే తమ కుటుంబం ఈ భూలోకంలో వుందని డబ్బా కొట్టించుకునే నెహ్రూ కుటుంబం పాలన ఈ దేశానికి విదేశాంగ విధానంలో జరిగిన మేలు యిది.

# ఒపీనియన్: 44

ప్రకృతిలో అనేక రకాలైన జీవులు బ్రతుకుతున్నాయి. నా దృష్టిలో 'మానవులు' కూడ ఒక విధమైన జీవులు మాత్రమే! బ్రతకడం వరకే పరిమితమై ఆలోచన చేస్తే, మనుష్యులకు, మిగతా జీవులకు ఏ మాత్రం భేదం కన్పించదు.

అయితే మానవులలో 'మేధస్సు' గలవారు కొద్దిమంది వుంటారు. వీరు బ్రతకడంతో పరిమితమై మిగతా జీవులలో కలిసిపోయి, తమ మేధాసంపత్తితో, మిగతా మానవ జీవుల బ్రతుకును సరళం చేయ డానికి, నాగరికత, అభివృద్ధి ప్రగతి మొదలైన పద్ధతిలో మానవుల జీవయాత్ర సాగిపోడానికి కృషి చేస్తారు.

మనుష్యులలో మేధావులు ఎలా తయారౌతారో? ఇందులో ప్రకృతి సహజత్వం కొంత కన్పిస్తుంది. మట్టి, రాళ్ళు భూమి సహజత్వమైనా రత్నాలు, వజ్రాలు విలువైన లోహాలు, మొదలైనవి ఎన్నో భూగర్భంలో తయారై వుంటున్నాయి. వాటిని ఎవరో తయారు చేశారు. మిగతా 'మట్టి' అలాగే వుందా? ఆ మట్టిలోనే ఈ 'విలువైనవి' ఎలా తయారై నాయి? అలాగే మనుష్యులతో సహా జీవులలో మేధావులు కూడ తయారుకావడం ప్రకృతి సహజం.

కాని, భూగర్భంనుండి వెలికివచ్చి వెలుగు చూచినప్పుడే వాటికి విలువ, వుపయోగం వుంటుంది. అలాగే అవకాశాలు కలిసివచ్చి, మేధావులు లోకానికి తెలిసినప్పుడే ఆ మేధస్సుకి విలువ వుంటుంది.

# ఒపీనియన్: 45

ఏదైనా ఒక కావ్యాన్ని అసలు ప్రారంభించనివారు నీచమానవులని, ప్రారంభించి పూర్తి చేయనివారు మధ్యములని, కార్యసిద్ధి పొందినవారు ఉత్తములని నీతి సూత్రకారుల భావన. కాని, నా ఉద్దేశ్యంలో ప్రారం భించనివారు నీచమానవులు కాదు. వారు సామాన్యులు. అది ప్రకృతి సహజం. అలాగే కార్యసాధనలో విజయాన్ని పొందినవారు ఉత్తములు కావచ్చు? ఇంతకూ ఒకానొక కార్యాన్ని ఆరంభ శూరత్వంతో ప్రారంభించి, దానిని గురించి మర్చిపోయేవారు, పూర్తిగ వదులుకునే వారు నీచ మానవులు. ఎందుకంటె, తమ శక్తి సామర్థ్యాలను అనుకూల అవకాశాలను సరిగా అంచనా వేసుకోకుండా, లోకం మెప్పుకోసమో లేక సమర్థులపై తేలిక భావంతోనో, అసూయతోనో చేయలేని కార్యాలు ప్రారంభించి, పెద్ద ఎత్తున 'ప్రచారం' సాగించి, దానిని అంతటితో ముగించే అసమర్థులు, అవివేకులే నిజమైన నీచమానవులు. ప్రజాస్వామ్య పాలకులు యిందుకు మంచి ఉదాహరణ.

ఇహపోతే, కార్యసాధకులైనవారంతా ఉత్తములని భావించడానికి వీల్లేదు. ఇతరుల శక్తి సామర్థ్యాలను, తమ అవకాశాలు, అదృష్టం ద్వారా ఉపయోగించుకుని, వారిని బలి తీసుకుని, తమ పేరుతో కార్యసాధనను లోకానికి చూపే కార్యసాధకులు అతినీచులు. ప్రజాస్వామ్య పాలకులలో యీ బాపతులు ఎక్కువగా వుంటారు.

# ఒపీనియన్: 46

పెత్తనం కోసం, గుత్తాధిపత్యం కోసం పోటీ పడడం, వలస విధాన లక్షణం. సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు యిది సహజం. బలహీనమైన దేశాలను తమ గుప్పెట్లో వుంచుకోడానికి ఆ బాపతు దేశాలు ప్రయత్నిస్తూ వుంటాయి. అయితే కమ్యూనిస్టు లేదా సోషలిస్టు దేశాలకు ప్రభుత్వాలకు యీ లక్షణం సిద్ధాంతరీత్యా వుండరాదు. కాని, ఆచరణలో వలసతత్వం పెట్టుబడిదారీ దేశాలకంటే, సోషలిస్టు దేశాలలోనే ఎక్కువుగా వుంది. పైపెచ్చు ఈ పోటీలో సాధారణంగా పెట్టుబడిదేశాలు అన్నీ ఒకరకమైన అవగాహనను కలిగివుండగా, సోషలిస్టు దేశాలు తమలో తాము బద్ధశత్రువులుగా, తమ వలస పోటీని సాగిస్తున్నాయి.

రష్యా, చైనాలు పేరుకు సోషలిస్టు కమ్యూనిస్టు దేశాలుగా పిలుచుకుంటున్నా, అవి ఈ వలస పోటీ కారణంగ బద్ధ శత్రువులుగా వున్నాయి. పెట్టుబడి దేశాలతోకూడ వాటికి అంత శతృత్వం కన్పించడం లేదు. పైపెచ్చు తమలో వున్న పోటీ కోసం, అవి పరస్పరం సాధించుకోడానికి, సామ్రాజ్యవాద, పెట్టుబడి దేశాల 'స్నేహాన్ని' సన్నిహితను కోరుతున్నాయంటె మరింత విడ్డూరంగ వుంది.

కంబోడియాలో చైనా అనుకూల ప్రభుత్వాన్ని వియత్నాం కూలదోసింది. వియత్నాం చైనాను వ్యతిరేకించి, రష్యాను అభిమానించి, చేరిపోయింది. చైనా వియత్నాంపై 'యుద్ధం' చేసింది. రష్యా హెచ్చరించింది. ఈ యుద్ధానికి ముందు చైనా విదేశాంగమంత్రి, అమెరికా పర్యటించి, యుద్ధాన్ని గురించి అక్కడే చెప్పాడు. ఇంతకూ సిద్ధాంతం ఏమైంది?

# ఒపీనియన్: 47

'స్థితి'కి 'ఆధారం' అవసరం. భూమికి ఆకాశం, పదార్థానికి శక్తి, శరీరానికి ఆత్మ, అలాగే కర్మకి ధర్మం ఆధారాలు. ఆధార శూన్యమైన దానికి స్థితి లేక ఉనికి వుండదు.

భాషకి భావం, భావానికి మనస్సు, మనస్సుకి బుద్ధి, బుద్ధికి అవసరం, అవసరానికి పరిసరాలు, పరిసరాలకి ప్రకృతి ఒకదానికొకటి ప్రేరేపితాలు కర్మకి కారణాలు, కారకాలు. ఈ కర్మకి పూర్వజన్మ అవశేషం అనేది అందరూ అంగీకరించదగిన విషయం కాదు. కేవలం నమ్మిక, ఊహ ఆధారంగ వుండే విషయాలను ప్రమాణికంగ అను కోవడం మూఢత్వం.

స్థితిని, ఆధారాలను హేతుబద్ధంగా ప్రశ్నించి, పరిశీలించి, పరి శోధనల ద్వారా ఋజువు చేసేదానికి విజ్ఞానశాస్త్రం అని పేరు. అలా కాక, స్థితిని ఆధారాలను దేవుడి పేర ఊహామాత్రంగా నమ్మిక, విశ్వాసం ఆధారంగా అంగీకరించేదానికి ఆధ్యాత్మిక మత విధానం. సైన్స్ ఋజువు చేయలేని దానిని ఆధారంగ, మత నమ్మిక తన ఊహలను దేవుణ్ణి సమర్థించుకోడానికి ప్రయత్నించడం సహజం. అయితే 'ఋజువు' కి యిక్కడ స్థానం లేదు.

పదార్థ జ్ఞానాన్ని పరిపూర్ణంగ పొందడం ప్రథమ ధర్మం. దాని ఆధారంగ ఆధ్యాత్మిక సమన్వయతకై ప్రయత్నించడం సత్యాన్వేషణ లక్షణం. ఈ భావ సారూప్యత, సమైక్యత మానవులలో కొరవడింది.

# ఒపీనియన్: 48

బానిసత్వం వ్యక్తికి, జాతికి సంకెళ్ళు వేస్తుంది. రాజకీయంగా ఒక జాతి పరాయి పాలన నుండి విముక్తి చెందవచ్చు. స్వదేశీ ప్రభుత్వాన్ని యేర్పాటు చేసుకోవచ్చు. అలాగే ఒక వ్యక్తి ఆస్తిని సంపాదించవచ్చు. తిండి బట్ట వసతి కలిగి కోరిన రీతిలో సుఖించవచ్చు అయినా వ్యక్తి మానసిక బానిసత్వాన్ని కలిగి వున్నంతకాలం సంకెళ్ళు పోయినట్లు కాదు.

రాజకీయంగా భారతజాతి చాలా సంవత్సరాల క్రితమే విముక్తి చెందింది. అయినా స్వదేశీ పాలకులతో సహా ప్రజలు బానిసలుగానే బ్రతుకుతున్నారు. స్వదేశీ పాలకులు తమ స్వార్ధానికి బానిసలై ప్రజలను మోసం చేస్తోంటే, పరాయి ప్రభువుల కంటే ఘోరంగ దోపిడీ చేస్తూ దేశాన్ని జాతిని సర్వనాశనం చేస్తోంటే, మానసిక దరిద్రులైన ప్రజలు (ఆర్ధికంగా గర్భదరిద్రులు) యిలాంటి, పాలకులను ఆరాధించు కుంటూ పూట గడుపుకుంటున్నారు. ఆత్మాభిమానాన్ని అమ్మేసుకుంటున్నారు.

యువతరం, ముఖ్యంగా స్వతంత్ర దేశంలో పుట్టిన వారైనా స్వతంత్ర భావాలు కలిగిలేరు. రాజకీయ వంచకుల స్వార్ధానికిఅమ్ముడు పోతున్నారు. కనీసం విద్యావంతులైనవారు కూడ మానసిక బాని సత్వాన్ని వదిలించుకోలేక పోతున్నారు. జాతి యావత్తు మానసిక బానిస మత్తుతో సహా అన్ని రకాలుగ దరిద్రమైవుంది.

# ఒపీనియన్: 49

'చెప్పింది చెయ్యడం, చేసింది చెప్పడం' ఒక మంచి లక్షణం. చెప్పిందానినే చేసినప్పుడు చేసిన దానిని గురించి వేరుగ చెప్పవలసింది ఏముంది? అనే ప్రశ్న ధర్మ సందేహంగా కలుగుతుంది. చెప్పినదానిని చేయడం ప్రారంభిస్తే, కార్మనిర్వహణలో కొన్ని మార్పులు చేర్పులు అవసరం కావచ్చు. అలాంటివాటితోనే మొదట్లో చెప్పింది చెయ్యడం సాధ్యం కావచ్చు. అలాంటప్పుడు కార్యప్రారంభానికి, దాని ముగింపుకు కొంత భేదం అవసరం కలగవచ్చు. ఈ భేదాన్ని ప్రారంభంలో చెప్పేట ప్పుడు ఊహించే అవకాశం వుండదు గనుక, చేసింది చెప్పవలసి వస్తుంది. అలాకాక, ప్రారంభంలో చెప్పినట్లే కార్యరూపంలో ముగింపు జరిగివుంటె చేసిన దానిని గురించి మరోసారి చెప్పవలసిన అవసరం వుండదు.

అలాకాక 'చేసింది చెప్పడం' అలవాటు చేసుకుంటె యీ తిరకాసు వుండదు. ఇది సులభం కూడ. చెప్పిందానిని చేయడానికి, దానిలోని వాస్తవాన్ని నిర్ధారించుకోడానికి కొంత వ్యవధి పడుతుంది. పైపెచ్చు, చెప్పింది అక్షరాలా కార్యరూపంలో చూపించడం అన్నివేళలా అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఆ సామర్థ్యం, సంకల్పం లేకపోవచ్చు. అందు చేతనే చెప్పడం ఎంతో ఎక్కువుగా వుంటోంది, చేయడం అతి స్వల్పంగా వుంటోంది చేసిన దానిని చెప్పడం మరీ తక్కువుగా వుంటోంది. అందుకే చేసిందే చెప్పడం మంచిది.

# ఒపీనియన్: 50

ప్రభుత్వ వ్యవస్థలో అధికార యంత్రాంగం (బ్యూరాక్రసీ) తప్పనిసరి. ఏదో రూపంలో యిది వుంటుంది. ఏ బాపతు ప్రభుత్వమైనా యిది తప్పనిసరిగా వుంటుంది. అధికార యంత్రాంగపు కార్యనిర్వహణపై ప్రభుత్వ ప్రయోజనం ప్రజలకు కలుగుతూవుంటుంది.

సాధారణంగ రాచరికంలో రాజుకి, నియంతృత్వంలో ప్రభుత్వాధినేతకు ఈ బ్యూరాక్రసీ వుపయోగపడుతూ వుంటుంది. మిలటరీ ప్రభుత్వంలో కూడ యిదే పరిస్థితి వుంటుంది. అందుచేత 'ప్రభుత్వం' ద్వారా ప్రజలకు మేలు కలగడంచాలా అరుదు. దేశపాలకుడు అధికార యంత్రాంగాన్ని కేవలం తన కోసమేకాక, ప్రజల కోసం కూడ వుపయోగించగలిగితే, ఆ మేరకు ప్రజలకు మంచి కలిగి, ప్రజారంజకునిగా, అట్టి పాలకుడు, రాజు ప్రజలచేత పిలవబడతాడు. కాని, ప్రజాస్వామ్యంతప్ప, మిగతా ఏ బాపతు ప్రభుత్వ వ్యవస్థలోనైనా, అధికార యంత్రాంగం, ప్రభువులకే వుపయోగపడం సర్వసాధారణం.

అయితే ప్రజాస్వామ్యంలో పరిస్థితి యిందుకు భిన్నంగా వుంటుంది వుండాలి కూడ. ఎందుకంటె, యీ బాపతు ప్రభుత్వంలో ప్రజలు ప్రధానంగాని, పాలకులు కాదు. అధికార యంత్రాంగం తమ ప్రభువులైన ప్రజలకు 'సేవ' చేయవలసి వుంటుంది. యిది తప్పనిసరి.

అయితే దురదృష్టవశాత్తు, భారతదేశంలో ప్రజాస్వామ్యంలో 'ప్రజాపాలకులు', బ్యూరాక్రసీ ఒకటై ప్రజా పీడితులుగా తయారైనారు. ఈ స్థితి రాచరికంలోకంటె ఘోరంగ అమలు జరుగుతోంది. మోసకారుల ముఠాగా వీరు వ్యవహరిస్తున్నారు.

# ఒపీనియన్: 51

పరిమితంగానైనా బ్రతకడానికి కర్మ చేయడం ప్రతి జీవికి తప్పనిసరి. కర్మ చేయించేది మనస్సు, మనస్సు నిర్ణయించేది బుద్ధి, బుద్ధిని ప్రేరే పించేది అవసరమనే పేరున పరిసరాలు, పరిస్థితులు, వీటిని చేకూర్చేది ప్రకృతి, యిలా జీవి బ్రతుకు ఒక దానికి మరొకటి సంబంధాన్ని కలిగి వుంటుంది.

పూర్వ జన్మ, ఉత్తర జన్మ మొదలైన వాటిపై నమ్మకం వున్నవారికి, పాపం,పుణ్యం స్వర్గం, నరకం, దేవుడు దెయ్యం వగైరా వగైరా సరం జామా అంతా ప్రోగు చేసుకుని, జీవి మనుగడను గురించి ఆలోచిస్తూ వుంటారు. దీనిలో వాస్తవం ప్రశ్నార్థకమైనా యీ పద్ధతిలోనే ఆలోచన చేసే వారి సంఖ్య అత్యధికం. వీరి నమ్మకాన్ని బట్టి, వర్తమాన జన్మను, గత జన్మలోని 'కర్మ' నిర్ణయిస్తుందని, అలాగే ఉత్తర జన్మ స్వరూప స్వభావాన్ని యీ జన్మ నిర్ధారణ చేస్తుందని చెబుతారు. అంటె, ఎప్పటి కప్పుడు జన్మను నిర్ధారణ చేసేది 'కర్మ' అని, వీరి నమ్మకం. అయితే ఆదిలో ఈ 'కర్మ' ఎక్కడ ఎలా ప్రారంభమైందనే ప్రశ్నకు సమాధానం అయోమయంగ వుంటుంది. కొన్ని సందర్భాలలో అపహాస్యంగ వుంటుంది.

ఈ ఆస్తికభావం ముప్పిరిగొన్న మనస్సుతో మాట్లాడేవారి తీరు హేతుబద్ధం ఏ మాత్రం కాకపోగా, ఒకదానికొకటి, విరుద్ధంగా వుం టాయి. హేతు నిర్ణయం సాధ్యంగాని చోట 'దేవుణ్ణి' అడ్డు వేస్తూ వుంటారు.

# ఒపీనియన్: 52

మిగతా జీవులకు మానవునికి ఎంతో భేదం వుంది. 'ఆలోచన'తో మనిషి అన్ని జీవులనుండి వేరు పడుతున్నాడు. సృష్టిని పరిశీలించి, పరిశోధించి తనకి వుపయోగపడే విధంగా చేసుకోగలుగుతున్నాడు. శాస్త్రజ్ఞానంతో ఎంతో పురోగమిస్తున్నాడు. భూగోళం రూపురేఖలే మార్చి వేస్తున్నాడు మానవుడు.

అయితే మేధావులు మానవజాతిలో అతి పరిమితంగా వుండడానికి కారణం ఏమిటి? మిగతా కోటానుకోట్లు 'జనం' కూడ మానవ రూపం లోనే వున్నారు గదా!వారు కూడ మానవులుగ వ్యవహరించబడు తున్నారు గదా! జీవ పరిణామంలో మానవ జన్మ ఉత్తమమైనదని ఆస్తికులు, నాస్తికులు కూడ అంగీకరిస్తున్నారు. మానవులలోనే 'మేధా వులు' మాత్రమే సృష్టిలోని జీవులన్నిటికంటె, తక్కిన మానవులందరికంటె ప్రత్యేకతను కలిగి వుండడానికి, మిగతా అత్యధిక మానవులు, తక్కిన జీవుల మాదిరిగానే బ్రతకడానికి కారణం ఏమిటి? వేదాంతాల 'ఖర్మ' సంగతి అలా వుంచి, జీవ పరిణామ సిద్ధాంతవాదులు ఆలోచన చేయవలసిన ముఖ్యమైన ప్రశ్న యిది.

# ఒపీనియన్: 53

భారతదేశంలో ధనవంతులు, రాజకీయాధికారం గలవారు, వారిని ఆశ్రయించి, సేవించేవారు ప్రత్యేక తరహాగా బ్రతుకుతున్నారు. దేశం లోని మిగతా ప్రజల బ్రతుకు విధానానికి వీరి జీవిత పద్ధతికి ఏ మాత్రం పోలిక వుండడం లేదు.

నిత్య జీవితంలో వారికి వున్న అవకాశాలు ఆర్థిక వనరుల సహకారంతో కోరిన రీతిగ బ్రతకడం మామూలే! ఆర్థిక రంగంలో యీా వ్యత్యాసం సర్వసాధారణమై పోయింది. కూటికి లేనివారు కోట్లాది ప్రజలు దేశంనిండా అలమటిస్తూనే వుండి, కోట్లాది ధనంతో కోరిన జీవితాన్ని గడపగలుగుతున్నారు, ధనవంతులు, రాజకీయంలో వున్న వారు. కేవలం రాజ్యాధికారం గలవారే యీా మాదిరిగ వ్యవహరించడంలేదు, వారికి అందుబాటులో వున్నవారి సంగతి అంతే. ఆర్థిక రాజకీయ సాంఘిక రంగాలలో కలవారి వర్గం జీవించే విధా నానికి ప్రజలు జీవించే పద్ధతికి స్వర్గానికి- నరకానికి(ఇవి ఊహ మాత్రమే అయినా ఉపమానానికి వ్యత్యాసాన్ని తెలియజేసుకోడానికి వుపయోగించుకోవచ్చు) ఉన్న భేదం వుంది.

అంతేకాదు, స్వర్గంలో వుండే దేవతలు, మానవుల చేత ముడుపులు పుచ్చుకుంటున్నట్లు, ఈ కలవారి వర్గం, సామాన్య ప్రజలను దోపిడీ చేసి కులుకుతున్నారు.

# ఒపీనియన్: 54

'రీజన్' లేనిది రెలిజియన్. అవసరం కలిగినప్పుడు, అలవాటుగ 'తిని' బ్రతకడం 'జీవి' లక్షణం. 'ఆలోచన'తో విచక్షణ జ్ఞానం కలిగి, మిగతా జీవులకంటె, భిన్నతర హాలో, ప్రత్యేక పద్ధతిలో బ్రతకవలసినది మానవుడు. ఇది ఒక క్రమంగా జరగాలి.

అయితే రీజన్ లేని మతంతో, రీజన్, ఆలోచనతో, హేతువును ప్రశ్నించుకుంటూ బ్రతకవలసిన మానవునికి ఏమిటి సంబంధం? అనాదిగా ఏదో రూపంలో మతం మానవునితోనే వుంటోంది. ఈనాటికి దాని ప్రభావం మరింత పెరిగింది. శాస్త్ర జ్ఞానంతోపాటు అది కూడ పెరుగుతోంది. శాస్త్రజ్ఞానం మనిషి మేధా సంపత్తికి, ఆలోచనా శక్తికి ప్రతిరూపం అనుకుంటె, దాని మాదిరిగానే అతి శక్తివంతంగా హేతువు లేని, మతం, ఉనికి లేని దేవుడు స్వర్గ నరకాలు, పరలోకాలు ఎలా ప్రచారం అవుతున్నాయి. మనిషి మూఢత్వానికి మతం ఒక నిదర్శనం. ఆస్తిక ఆచారాలు మనిషి బుద్ధిని ఖూనీ చేస్తాయి. పరస్పర విరుద్ధమైన శాస్త్రజ్ఞానం–మత మౌఢ్యం ఒకదానికొకటి పోటీపడి ఎలా పెరగగలుగుతున్నాయి? ఈ రెండింటిలో ఒకదాని అభివృద్ధి మరొకదాని క్షీణతకు కారణం అవుతుంది. శుక్లపక్షం, బహుళపక్షం (పౌర్ణమి, అమావాస్య) ఒకసారి ఒకేరీతిలో ఎలా పెరుగుతాయి?

# ఒపీనియన్: 55

పసివాడి అజ్ఞానం, అమాయకత్వం ముద్దు కలిగిస్తాయి. స్వచ్ఛమైన మనస్సులో నుండి, అమాయకత్వం బయటపడుతోంటె చూడ ముచ్చ టగా వుంటుంది. అందుకే పసిపిల్లల ప్రవర్తన, అల్లరి మనస్సుకి హాయిని కలిగించి, అలసట పొందినవారికి సేద తీరుస్తుంది. శక్తిని కోల్పోయిన మనస్సుకి యింత సంతోషాన్ని కలిగిస్తూ,తిరిగి మనస్సుకి బలం కలిగిస్తుంది. పసిపిల్లల సహచర్యంతో, మనస్సును తత్కాలికంగా ఆలోచనలకు దూరం చేసుకొని, తృప్తిని, శక్తిని, సుఖాన్ని పొందవచ్చు. పసిపిల్లల చూపులలో, బోసి నవ్వులలో వారి ముఖాలలోనే ఏదో అనిర్వచనీయమైన ఆనందం, కన్పిస్తుంది.

అయితే, మనిషి మూర్ఖత్వం యిందుకు భిన్నంగా వుంటుంది. మనస్సును బాధ పెడుతుంది. మూర్ఖత్వానికి, అమాయకత్వానికి, అజ్ఞానానికి ఏమీ సంబంధం లేదు పైపెచ్చు అహంకారంతో కూడిన మూర్ఖత్వం దాని ఉధృతం చెప్పనలవి కాదు. సున్నిత మనస్సు గలవారికి యిది మరీ ఘోరమైన ఫలితాలను కలిగిస్తూ వుంటుంది. ఇలాటి మూర్ఖుల సంఖ్య హెచ్చుగావున్న సంఘానికి దూరంగా వుండాలని, ఇలాటి మనుష్యులు కన్పించని, వినిపించని, ప్రశాంత వాతావరణంలో బ్రతకాలని అందరి కోరిక.

# ఒపీనియన్: 56

సోషలిజాన్ని గురించి మాట్లాడేవారు క్యాపిటలిస్టులే! చట్టాలను గురించి చెప్పేవారు, వాటిని చేసేవారు, వాటిని స్వయంగా అమలు చేయనివారే! పైపెచ్చు, వాటికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, చట్టాలను, అధికారాన్ని స్వంతానికి వాడుకునేవారే క్రమ శిక్షణ గురించి చట్టాలకు లోబడి వుండాలని ప్రజలకు ఉపన్యాసాలిస్తారు. దేశంలో అల్లర్లు సృష్టించి, అమాయక ప్రజలను బలి తీసుకుంటూ, తమ రాజకీయ, మత ప్రయోజనాలను సాధించుకునేవారే, అదే వృత్తిగా గలవారే. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం గురించి, మత సామరస్యం, వర్గ సామరస్యం, మానవ సమానత్వం, సోదరత్వాన్ని గురించి, నిత్యం ఊకదంపుడు వుపన్యాసాలను యిస్తూ వుంటారు. నాయకులు, పాలకులు, ధనవంతులు ప్రజలకోసం చెప్పేది, చేసేది ఒక విధానంగ వుంటుంది తమకోసం చేసుకునే యేర్పాట్లు, ఎత్తుగడలు మరో తీరుగ వుంటున్నాయి. రెండింటికి సంబంధమే వుండడం లేదు.

అయితే, తమ నిజరూపాలు ఏ మాత్రం బయటపడనీయకుండా, ప్రజా సేవకులుగా, ప్రజల సమక్షంలో నటన చేయడం, ముఖ్యంగా, నేటి రాజకీయంలో సర్వసాధారణమైపోయింది. స్వార్థం, మోసం, మాయ, దోపిడీ, అసత్యం-యివి నాయకులకు అలంకారాలుగా వున్నాయి.

# ఒపీనియన్: 57

ప్రాణవాయువు ప్రత్యక్షంగా కన్పించకపోయినా, అది శరీర ఉనికికి మూలాధారం. ఆకాశం స్పష్టంగా భౌతికంగా కన్పించకపోయినా, ప్రకృతి ఉనికికి అది మూలాధారం. గురుత్వాకర్షణశక్తి గ్రహాల ఉనికికి ఆధారం (భూమి గురుత్వాకర్షణ శక్తి, ఆ మాటకొస్తే, గ్రహాల ఆకర్షణ శక్తికి సంబంధించిన ప్రస్తుత శాస్త్రీయ (న్యూటన్) సిద్ధాంతానికి భిన్నమైన అభిప్రాయాన్ని నేను కలిగి వున్నాను) అలాగే ధర్మం, న్యాయం, సాంఘిక జీవితానికి మూలమైన ఆధారాలు. ఇవి ఘన రూపంలో లేదా మరోదృశ్య రూపంలో కన్పించకపోయినా, మనిషి మానసిక దోపిడీకి, తోడ్పడేవే! మానవ సాంఘిక జీవితానికి అత్యంత ఉపయోగం, ఆధారం అయిన వాస్తవాలైన ధర్మం, న్యాయం, ఆత్మ, మతంతో ముడిపెట్టి, తద్వారా మనిషిని దేవుడికి బలి పెట్టడం ఆస్తికుల ధోరణి. ఇది అతి ఘోరం. మనిషి వ్యక్తిత్వానికి, సాంఘిక ఉనికికి వుపయోగమైన నిర్వచనాలలో వాటిని వుపయోగించాలి.

# ఒపీనియన్: 58

అవకాశాలు లేనివారికి, అవి వున్నా ఆచరణ చేతగానివారికి ఆలోచనాశక్తిగొప్ప శాపంగా పనిచేస్తుంది. భారతదేశానికి సంబంధించినంతవరకు ఉన్నత కులంలో జన్మించడం, ఆర్థికంగా పుష్కలంగా కలిగివుండడం, హోదా అధికారం కలవారి అండదండలు కలిగి వుండడం 'గొప్పతనానికి' మూల కారణాలు  గొప్పవాడు కావడానికి కనీస అర్హతలు. తెలివితేటలు, సామర్థ్యం, మంచితనం, మొదలైన లక్షణాలు అప్రధానములే!

రాజకీయ రంగంలోనే కాదు, శాస్త్రజ్ఞాన విషయంలో కూడ యిదే జరుగుతోంది. ప్రతి రంగంలోనూ యీ పరిస్థితే అనుభవంగా తెలు స్తోంది. దేశంలో ప్రతిరంగంలోను మహా మహా మేధావులు ఎందరో వున్నారు. నేటికి గుర్తింపు గలిగి గొప్పవారుగాచలామణి అవుతున్న వారితో పోల్చి చూస్తే, అజ్ఞాతంగా కాలగర్భంలో కలిసిపోయేవారు ఎన్నో రెట్లు ఘనతగలవారు, జ్ఞానం గలవారు. అయినా, యధా ప్రజా తధా రాజా అన్నట్లు ఈనాటి రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్నారు. వీరు దేశ చరిత్రకు మచ్చే అయినా, అరణ్యరోదనలాంటి ఆవేశం అనర్థాలను, అవస్థలను తెచ్చిపెడుతుంది.

# ఒపీనియన్: 59

పాలకులు, ప్రభుత్వాధికారులు, ప్రజాస్వామ్యంలో అయితే ముఖ్యం గా అధికార పార్టీ నాయకత్వం–వీటి మిశ్రమరూపం ప్రభుత్వం మిగతా వారంతా ప్రజలే! ఈ ప్రజలకే పాలకులై అధికార్లను అదుపు చేస్తూ, ప్రజలకు అనుకూలంగ ప్రభుత్వాధిపత్యం కలిగివుంటే, దానిని ప్రజా ప్రభుత్వం అని అనవలసి వుంటుంది. అందుకు భిన్నంగా ఏ రూపంలో పరిపాలన జరిగినా అది ప్రజల ప్రభుత్వం కానేరదు... ఒకానొక రాజకీయ పార్టీ అయినా, నాయకుడైనా, రాజైనా, నియంత, ఫాసిస్టు ఎవరైనా ప్రజలకు దూరంగ వుండి, ప్రజలను శాసించడమే తమ ఘనతగా భావించి వ్యవహరించడం మానవచరిత్రలో ఎక్కువగా జరుగుతోంది. 'ప్రజాస్వామ్య యుగంలో' కూడ పార్టీ పేరుతోనో, పార్టీ నాయకత్వం పేరుతోనో ప్రజలను శాసించడమే జరుగుతోందిగాని, ప్రజలను పాలించడం జరగడంలేదు. తమ చిత్తం వచ్చినట్లు శాసనాలు చేస్తే,వాటిని మూగ జీవులుగ అనుసరించడమే ప్రజల కర్తవ్యంగా నేటి ప్రజాస్వామ్య పాలకులు భావిస్తున్నారు. ఇది మరో బాపతు ప్రభుత్వంలో జరిగితే సరిపెట్టుకోవచ్చుగాని, ప్రజాస్వామ్యం, సోషలిజం, సెక్యులరిజం మొదలైన వాటిపై రాజ్యాంగాన్ని నడిపిస్తున్నామని 'డబ్బా' వాయించుకునే ప్రజానాయకులను సహించలేము.

పాలకుల అజ్ఞ పాటించడమే తప్ప మరో పని చేయలేని 'ప్రజ' దేశంలో వున్నంత కాలం పరిస్థితి మార్పు లేదు.

# ఒపీనియన్: 60

సృష్టి పరిణామం 'జీవం' ప్రారంభం అయ్యే వరకు ఒక దశగా భావించవచ్చు. ఆ తరువాత జీవ పరిణామం ప్రారంభమై అనేక దశలను ప్రతిసారి ఎంతో కొంత ఔన్నత్యాన్ని సంతరించుకుంటూ, ఏకకణ జీవి నుండి మానవుని వరకు కొనసాగింది. జీవపరిణామ భాగంలో ఏకకణజీవి ఒక స్పష్టమైన దశ. మానవుడు ఆ జీవ పరిణామ దశకు, లేదా మొత్తంగా జీవపరిణామానికే చివరిదశ కావచ్చు బాహ్యంగా.

అయితే జీవి అంతర్గత పరిణామానికి ప్రారంభం మానవునితోనే జరిగింది. ఈ దృష్టితో చూచినప్పుడు భావం భాష, వాటి పరిణామ ఔన్నత్యం చాలా సంవత్సరాల నుండి కొనసాగుతూ వుంది. బహుశా ఎంతోకాలం సాగకపోవచ్చు.

మనిషిలోని ఆంతరంగిక పరిణామం నాగరికత విజ్ఞానశాస్త్రం అభివృద్ధి, సత్యాన్వేషణ దానికి సంబంధించిన జ్ఞానం మొదలైన భాగాలుగా అభివృద్ధి జరుగుతోంది. ఈ దృష్ట్యా మానవులలో జ్ఞానవంతులు జీవ పరిణామ దశలో చివరి దశలో వుంటారు సాధారణ మానవులు జీవ పరిణామంలో మానవ దశలోనే వుంటారు. అంటే జీవుల కోవకే చెందుతారుగాని జ్ఞానుల తరగతికి చేరుకోలేరు. అందుకే జ్ఞానులు ***'అల్ప సంఖ్యాకులు.'***

# ఒపీనియన్: 61

భారతదేశానికి సంబంధించినంతవరకు ఎక్కడ ముట్టుకున్నా 'కంపు' గా వుంది. ఏ రంగాన్ని గురించి ఆలోచించినా 'నీచత్వం' తప్ప మరొ కటి కన్పించడంలేదు.

రాజకీయరంగంలో, 'ప్రజాస్వామ్యం' ఆర్థికరంగంలో 'సోషలిజం', సాంఘిక రంగంలో 'సెక్యులరిజం' సాంస్కృతిక రంగంలో సినిమా సాహిత్యం-యీ విధంగా మనిషిని యావత్ సమాజాన్ని 'రోత' పుట్టించే స్తున్నాయి.

ప్రస్తుతం రోత పుట్టించే పై సంగతులు సిద్ధాంతరీత్యా సరియైనవి ఉన్నతమైనవే! అయితే స్వార్ధపరుల సామర్థ్యాలతో, అవి నేటికి, యీ దేశంలో అంతటి హీనస్థితిని పొందాయి. మురుగునీటిలో మాణిక్యం పడినట్లుగా, ముఖ్యంగా స్వార్థం రూపుదాల్చి నేటి రాజకీయ నాయకులు, పెట్టుబడిదార్లు, వారి తాబేదారుల చేతులలో పడి, అమూల్యమైన ఆ సిద్ధాంతాలు మనిషిని అధోగతికి తీసుకుపోతున్నాయి. సమాజం జారుడు మెట్లపై ప్రయాణం చేస్తోంది.

దీనికి ముక్తి కలిగించాలంటే, మురికి నీళ్ళను కెలకడం, 'దేవడం' కాదు, దానిని పూర్తిగ తోడి, ఆ అవశేషాలే లేకుండా చెయ్యాలి.

# ఒపీనియన్:62

భారతీయ వేదాంతం (ఖర్మ) కర్మ సిద్ధాంతానికి అధిక ప్రాధాన్యతను యిస్తోంది. మానవ జీవితంతో సహా ప్రతి జీవి కర్మానుసారమే జరిగి పోతూ వుంటుందనే సారాంశం. గతజన్మ కర్మ ఆ తరువాత జన్మను ఎప్పటికప్పుడు నిర్ధారణ చేస్తూ వుంటుందనేది సిద్ధాంతం. జీవి కర్మకు బానిస. మనిషి అంతే!!?

ఈ కర్మ ప్రారంభాన్ని గురించి నేను వేసే ప్రశ్నలకు యింతవరకు నాకు సమాధానం లభించలేదు. హేతుబద్ధంగా ఆలోచన చేస్తే కర్మకి స్థానం లేని మాట వాస్తవమే అయినా అది శాస్త్రీయ దృక్పథంతో (ఆస్తిక వేదాంత వాసన ఏ మాత్రం లేకుండా) పరిశీలన చేస్తే మరో రూపంలో అందులో కొంత 'వాస్తవం' కన్పిస్తుంది?

సంచిత కర్మ, ప్రారబ్ధ కర్మ, ఆగామి కర్మ అని, కర్మ మూడు విధాలుగవుంటుందట! సంచిత కర్మ, ఆగామి కర్మ స్వరూప స్వభావాలు కొంత సారూప్యతను కలిగి వుంటాయట! ఈ రెండింటిలో మొదటిది పూర్వజన్మకి పూర్తిగ సంబంధించి, స్థిరంగా వుంటుంది. ఆగామి కర్మ భవిష్యత్ జన్మను నిర్ధారణ చేస్తుంది. ప్రారబ్ధ కర్మ ప్రస్తుత జీవితాన్ని అంటె వర్తమాన జన్మను నడిపిస్తూ వుంటుంది. ఈ జన్మలో మానసిక, శారీరక యావత్తు జీవితం ఈ ప్రారబ్ద కర్మను అనుసరిస్తుంది. దీనిని ప్రతి జీవి అనుభవించి తీరాలి. మానవుడు, తరతమ భేదాలు లేకుండా ఈ ప్రారబ్ద కర్మను అనుభవించాలి. దేవుడి సేవలో వున్నవాడైనా, పాతకుడైనా ఈ కర్మ తప్పదట! అయితే జీవితాన్ని 'దేవుడికి' అంకితం చేస్తే తక్కిన రెండు కర్మల నుండి 'విముక్తి' చెందవచ్చుట???

# ఒపీనియన్: 63

ప్రతి తల్లితండ్రి తమ సంతానం సంతోషంగా వుండాలని కాంక్షిస్తారు. తమశక్తి కొలది వారి మంచికి, సుఖానికి, అభివృద్ధికి కృషి చేస్తారు. తమకు ఉన్నంతలో సమాన దృష్టితో తమ పిల్లల్ని ప్రయోజకులుగా చేయడానికి శక్తినంత వుపయోగిస్తారు. అయితే మానవుని అవకాశాలు, శక్తి సామర్ధ్యాలు పరిమితంగా వుండడంతో తాను ఆశించిన రీతిగా సాధించలేడు. ఏమైనా ఉన్నంతవరకు సాధ్యమైనంతవరకు తమ సర్వ స్వాన్ని తమ సంతానం కోసం త్యాగం చేస్తారు మానవులు.

దేవుడు సర్వసృష్టికి తండ్రిలాంటివాడు. తాను సృష్టించిన యావత్ జీవులనుతన పిల్లల మాదిరిగా సంతానం మాదిరిగా ప్రేమించి, వారి సుఖానికి సర్వం కలిగించ వలసిన ధర్మం వుంది. అయితే మాన వుడి శక్తి పరిమితం కావడంతో అనుకున్నంత మేర చేయలేడు. దేవుని విషయం అలాంటిదికాదు. ఆయన సర్వశక్తివంతుడు! సృష్టి చేయగల వాడు. అంతకుమించి మరొక 'శక్తి' లేదు. తాను చేయలేనిది ఏమీ లేదు. అలాటి దేవుడు తన సంతానం సుఖంగా బ్రతకడానికి చేయలేనిది ఏముంది?

అయితే పరిస్థితి భిన్నంగా వుంది. సృష్టి తరతమ భేదాలతో, దుఖం తో సతమతమైపోతుంది. అవకాశాలు సృష్టించుకున్న 'కొద్దిమంది' హాయిగ సకల భోగాలతో బ్రతుకుతూ వుంటే, కోట్లాది ప్రజలు దిక్కు మాలిన బ్రతుకు బ్రతుకుతున్నారు. దేవుడికి యిది న్యాయమా? సృష్టికర్త, తండ్రి అయినవాడికి, తన సంతానం పట్ల యిలా వ్యవహరించడం ఏమైనా సబబా? మానవత్వమా?

# ఒపీనియన్: 64

ప్రకృతి తాకిడికి గురి అయి ఎంతో నష్టం, కష్టం జరిగిన ప్రాంతా లను పరిపాలకులు, నాయకులు పర్యటనచేసి ఆయా దృశ్యాలను దర్శిస్తారు. అయితే ఈ విపత్తు జరిగిన చాలా రోజులు తరువాత, రాజకీయ నాయకుల 'పోటీ వేట' ప్రారంభమౌతుంది.

వారి పర్యటనకు, వారి వారి విరోధాలను బట్టి, సన్నాహాలు చేయడం కూడ జరుగుతుంది. నాయకులు తమకి అలవాటైన రీతికి ఉపన్యాసాలు దంచేస్తారు. సానుభూతి ప్రకటనలు చేస్తారు. ఎందుకు? అంతా రాజ కీయం. ఆపదలో వున్న ప్రజలకు నాయకులు 'దర్శన మిస్తే' ఆయా పార్టీల స్థానిక నాయకులు 'ఓట్లు' 'దేవుకోడానికి' మంచి వీలుగ వుంటుంది. ఆ మాదిరిగా తమ తమ పార్టీల 'బలం' పెంచు కోవడంతో పాటు, తమ బడానాయకుల గొప్పతనాన్ని వృద్ధి చేస్తారు.

ఆపదలో చిక్కుకుని, అన్నిటిని పోగొట్టుకుని, "హాలో లక్ష్మణా!" అంటూ అఘోరించే అంగలార్చే ప్రజలను, యిదే సమయమని 'పూడ బలిసిన' నాయకులు, సకల మర్యాదలతో, రాజలాంఛనాలతో, అధికార దర్పంతో వారికి దర్శనమిచ్చి, వారిపట్ల 'సానుభూతిని' మాయ ప్రేమ నటించి, వారిని కొనడానికి ప్రయత్నించడం,పోటీ పడడం ఎంత అమానుషమో ఆలోచన చెయ్యరు.

ఈ నాయకుల పర్యటనకు, తదితర లాంఛనాలకు అయ్యే 'ఖర్చు', సర్వం కోల్పోయిన ఆ అభాగ్యులకు కొన్ని రోజులు బ్రతకడానికి వుప యోగపడుతుంది.

# ఒపీనియన్: 65

పాలకుల నుండి, ప్రజలవరకు, పండితులనుండి పామరునివరకు, అవినీతి అలవాటుగా మారింది. జీవితంలో అది అతి ముఖ్యమైన భాగముగా స్థిరపడింది. దాని చెడును గురించి మాట్లాడడం అందరికీ సరదా, ఫ్యాషన్ అయిపోయింది. దీనిని తొలగించాలనేది రాజకీయ నినాదమైంది. దొంతగతనం చేసినవాడు సమయానుకూలంగ జనంలో కలిసిపోయి, “దొంగ దొంగ, దొంగని పట్టుకోండి” అంటూ అందరి కంటె ఘనంగా, బిగ్గరగా అరచినట్లుగా, అవినీతిపరులు, దానిమీద బ్రతికేవారు, దాని నిర్మూలనను గురించి గొప్పగా నినాదాలు, యిసత్తా, స్వార్థ ప్రయోజనాలను సాధించుకుంటున్నారు. ఈ విషయంలో తరతమ భేదాలు లేవు సరిగదా ‘అంతరాత్మ’ ను కూడ యీ బురదలోకి యీడ్చి, పబ్బం గడుపుకుంటున్నారు పెద్ద పెద్ద నాయకులు.

అవినీతిని ఆచరించలేనివారు, దాని నిర్మూలనకై వినిపించే నినాదాలను నిజమని నమ్మేవారు, అలా నడుచుకోడానికి ప్రయత్నించే వారు నేటి సమాజంలో పనికిమాలిన వారుగ, వెలివేయబడినట్లు గేలి చేయబడుతూ, నానా బాధలు పడుతూ బ్రతుకులు వెళ్ళదీయవలసి వస్తోంది.

భారతదేశంలో, ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కలిగిన అభివృద్ధిలో అవినీతి ముఖ్యమైనది.

# ఒపీనియన్: 66

కన్పించేదికాక, కన్పించనిదేదో వుందని, అనిపించేదికాక, అనిపిం చనిది ఏదో వుందని, అనుభవించేదికాక, అంతకంటే అద్భుతమైనది మరేదో వుందని, శరీర సాధ్యమైనది కాక, అతీతమైనది మరోకటి వుందని, ఈ లోకంకాక, మరేదో లోకం వుందని, అలాగే మనిషికాక, సృష్టికర్త 'దేవుడు' ఉన్నాడని, ఆస్తిక మతం చెబుతోంది. దృష్టమైన దానిని, స్పష్టమైన దానిని అప్రధానముగ భావించి, అదృష్టం, అస్పష్టము అయిన వాటికోసం అంకితమైపోయినట్లు ప్రవర్తించడం మానవత్వాన్ని మర్చిపోవడమే!

ప్రాణాధారమైన శరీరాన్ని తుచ్ఛమైనదిగా భావించి, అందులో అదృశ్యంగా, ఊహామాత్రంగా వుంది అనుకునే 'ఆత్మ' గురించి, ఘోషిం చడం అజ్ఞానానికి సంకేతం కాదా? కాదని ఆస్తికుల దబాయింపు.

హేతువుకు అతీతమైన ప్రతిదానిని దైవలీలగ, దేవుడి మహిమగ భావించడం మనిషి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకోవడమే! మనిషి ప్రారంభమైనప్పటినుండినేటి మానవునికి మధ్య సాగిన చరిత్ర గమ నాన్ని పరిశీలిస్తే, యిది స్పష్టమౌతుంది. ప్రాధమిక దశలో తెలియనిది ప్రతిదీ దేవుడిగా భావించడం జరిగింది. అయితే ఆనాటి తెలియనిది ఎంతో ఈనాడు తెలిసింది అంటే, ఆ మేరకు 'దేవుడు'కూడ అదృశ్యం కావాలి గదా!... ఇలా జరిగేది కేవలం జ్ఞానం గలవారిలోనే!

# ఒపీనియన్: 67

సంఘ జీవితపు అవసరం పెరిగినకొద్దీ మనిషిని అదుపు చేయవలసి వచ్చింది. ప్రకృతిరీత్యా క్రమశిక్షణలేని జీవిని, ముఖ్యంగా మనిషిని అదుపు చేయకపోతే,సంఘ జీవితం, సంఘటితంగా, శాంతి సౌఖ్యా లతో కొనసాగడం అసాధ్యం. అందుకునియమాలు, కట్టుబాట్లు కావ లసివచ్చాయి.

మానవ మానసిక స్థితి అభివృద్ధి చెందుతున్నకొద్దీ, సంఘ స్వరూప స్వభావాలు మార్పు చెందుతూ వుంటాయి. అందుకు తగినట్లుగా నియమాలు, కట్టుబాట్లు, మార్పు చెందుతూ వుంటాయి అలా చెందాలికూడ. అందుకే కాలప్రవాహంలో సాంఘిక జీవితం అనేక రీతులుగా మారుతూ వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. అయితే భౌగోళిక స్థితిగతులు, పరిసరాల ప్రభావం, ప్రకృతి అనుకూల ప్రతికూలాలు, మనిషి మానసిక శారీరక సామర్థ్యం-వీటి హెచ్చు తగ్గులను బట్టి మనిషిపై వాటి ప్రభావాన్నిబట్టి సాంఘిక పరిణామం, దానికి తగినట్లు మనిషి జీవిత విధానం సహజంగానే మార్పు చెందుతూ వుంది.

మానవ జీవితంలో ముడిపడి వున్న సాంఘిక జీవిత పరిణామం, అభివృద్ధి అనేక రంగాలుగ జరుగుతుంది. సహజ పరిణామం, విప్లవం, పరిస్థితుల ప్రభావం- ఇలాటి ద్వారా జరుగుతూ వుంది. అయితే ఏ రూపంలోనైనా 'మార్పు'ను వ్యతిరేకించే వారు, ఎదురు నిలిచేవారు, చాదస్తులు, ఛాందసులు, అన్ని కాలాలలోనూ, అన్ని ప్రాంతాలలోనూ వుంటూ వుంటారు.

'మార్పు' కోరేవారు, దానిని సాధించాలనుకునేవారు యిలాటివారి సవాలును ఎదుర్కోవాలి. పోరాడాలి.

# ఒపీనియన్: 68

'పలుకుబడిగలవారు, పది 'రాళ్ళు' గలవారు పదవికోసం పోటీ పడడం, అధికారం కోసం ఆరాటపడడం ప్రజాస్వామ్యం, పరిశ్రమలను 'జాతీయం' చేసి, బూర్జువా బ్యూరాక్రాట్స్‌కి ఒప్పగించి, వాటిని నష్టాలతో నడిపిస్తూ, పెట్టుబడిదార్లకు ప్రోత్సాహాన్ని కలిగిస్తూ, ప్రభుత్వ సహకారంతో పలుమార్గాలు, లాభాలు కలిగించడం 'సోషలిజం'. కులమతాల భేదాలను చట్టబద్ధం చేస్తూ, ప్రత్యేక సదుపాయాల పేరుతో వర్గద్వేషాలను రెచ్చగొట్టి, 'రాజకీయం' నడపడం సెక్యులరిజం. అబద్ధాలతో, ఆపద మొక్కులతో, ఆకర్షణీయమైన నినాదాలతో, ఎప్పటికప్పుడు అవసరానికి తగినట్లు రంగులు మార్చి నటన చేస్తూ, ప్రజలను గొప్పగా, దగా, మోసం చేయడం ప్రజాసేవ. అధికార సుస్థిరత కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డమైనదార్లు త్రొక్కి, దొరికిన 'గడ్డి' తినడం, గొప్పగా ప్రచారం (స్వంత డబ్బా) చేసుకోవడం నాయకుని గొప్పతనానికి, సామర్థ్యానికి నిదర్శనంగా చలామణి అవుతోంది.

ప్రజాస్వామ్యం పేరుతో ప్రపంచమంతా దాదాపు యీ మాదిరిగానే ప్రజలను వంచన చేయడం జరుగుతూ వున్నప్పటికి, ఈ విషయంలో భారతదేశానిది అగ్రస్థానం. లోకానికే ఆదర్శప్రాయంగా వుంది!

మానసిక దాస్యం పోతే మార్గం ఏదైనా వుంటుందేమో!

# ఒపీనియన్: 69

రాజులకు రాజ్యాంగం వర్తించదు. రాచరికంలో 'రాజ్యాంగానికి' స్థానం లేదు. ఉన్నా, అది ప్రజలను బాధించడానికే! రాజు యిష్టం, చిత్తం రాజ్యాంగంగా చలామణి అవుతుంది.

ప్రజాస్వామ్యంలో యిందుకు భిన్నంగా వుంటుంది వుండాలి కూడ. పాలకులను ఆదేశించేది, ప్రజలకు ఉపదేశించేది ప్రజాస్వామ్య రాజ్యాం గం. ప్రజాస్వామ్యంలో పాలకుల 'చిత్తం' రాజ్యాంగం కాకూడదు ప్రజల ప్రతిబింబం రాజ్యాంగం కావాలి.

అయితే, భారత 'ప్రజాస్వామ్యంలో' పాలకుల చిత్తం చట్టాలలోనూ, అధికార్ల యిష్టం వాటిని అమలు జరపడంలోనూ వుంటోంది. ప్రజలు అవసరం లేదు. అధికారం పొందడానికి ఓట్లు వేయించుకోవడం వరకే వారితో పని. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి స్వదేశీ ప్రభుత్వం అమలు జరిగిన తీరు యిలాంటిదే! అయితే వింతలో వింత ఒకటి వుంది. శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో, పాలకుల 'చిత్తం', అధికార్ల 'యిష్టం' మొత్తం 'ఆమెలోనే' కలిసిపోయి, ప్రజలు, అధికార్లు పాలకులు, ప్రభుత్వం దేశం- ఇలా వేరువేరుగా కన్పించక సర్వం ఆమెగానే 'అవతారం' అవతరించింది. "భారతదేశమే ఇంధిరాగాంధి, ఇందిరాగాంధియే భారతదేశం"గా ఆమె తన విశ్వరూపం లాంటి భారత దర్శనం యిచ్చింది.

# ఒపీనియన్: 70

ప్రస్తుతం భారతదేశంలోవున్న రాజకీయ వ్యవస్థ స్వరూప స్వభావాలు, పార్టీలు పూర్తిగ వాటి వాటి అస్థిత్వాలను రూపుమార్చి, యిందుకు భిన్నమైన పూర్తిగనూతన సిద్ధాంత దృక్పథంతో మరో రాజకీయ స్వరూపం అవతరించాలని, అప్పుడే సమాజ స్వరూపం కూకటి వేళ్ళతో మార్పుచేసి, నూతన వ్యవస్థకూ రూపురేఖలు దిద్దడానికి అవకాశం వుంటుందని నా రాజకీయ భావం. ఇది ఈనాటిదికాదు. ప్రారంభం నుండి, అంటే నాకు రాజకీయ దృక్పథం రూపుదాల్చుతున్నప్పటినుండి నాకు గల భావం యిదే. స్వార్థానికి మారుపేరైన పార్టీ ప్రజాస్వామ్యం స్థానంలో ప్రజల ప్రజాస్వామ్యం ప్రతిష్టించబడాలనేది నా సంకల్పం.

అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు, అవి ఏ పేరుతో వున్నప్పటికి ప్రజలను, దగా చేస్తున్నాయనేది నా వుద్దేశం. 'నాశన బీజం' అంతర్గతం గా గల రాజకీయ పార్టీలు, వాటి నాయకులు పతనం కాక తప్పదని కూడ నేను చెబుతూ వుండేవాడిని. శ్రీమతి ఇందిరాగాంధి నాయకత్వ ప్రారంభంతో రాజకీయ పార్టీల విచ్ఛిన్నం, రాజకీయ పతనం ప్రారంభమై ఆమె కాలంలోనే, ఆధ్వర్యంలోనే తారాస్థాయికి చేరి, నేటికి దేశంలో 'రాజకీయ శూన్యత' యేర్పడింది. ఇది మార్పును తెచ్చే సంధికాలం.

ఈ సమయంలోనే, నూతన రాజకీయ వ్యవస్థ ప్రారంభం కావాలి. ప్రస్తుత రాజకీయ పార్టీలకు అతీతమైన రీతిలో అది జరగాలి. నేటి రాజకీయ శిధిలాలపై, నూతన వ్యవస్థకు ప్రారంభం జరగాలి.

# ఒపీనియన్: 71

సాధారణంగా, స్వంతానికి ఒకటి, సమాజానికి మరొకటి, రెండు విధాలైన జీవిత ఫక్కీని నడుపుకోవడం 'మనిషికి' జరుగుతూ వుంటుంది. ఈ రెండు జీవిత విధానాలు ఒకదానికి మరొకటి భిన్నంగానూ, విరుద్ధంగానూ వుండడం కూడా సహజమే! వ్యక్తి తత్వాన్ని సమాజానికి తెలియనీయకుండా మనిషి జీవించడమే 'సామర్ధ్యం'గా చలామణి అవుతూవుంటుంది. సమాజం కోసం యేర్పాటు చేసుకున్న జీవి తంకూడ ఆయా పరిస్థితులకు అవసరమైన రీతిలో పలువిధాలుగ రంగులు మారుతూ వుంటుంది. అయితే వ్యక్తిగతమైన 'తత్వం' మార్పు చెందదు. అది ఏ పరిస్థితిలోనూ ఒకటిగానే వుంటుంది. ఇలా జరగడం మనిషికి సంబంధంగల ప్రతి రంగంలోనూ ప్రత్యక్షమౌతూనే వుంది.

ప్రజాస్వామ్యం సోషలిజం, కమ్యూనిజం, సెక్యులరిజం మొదలైన మాటల నినాదాలు సమాజ జీవితం కోసమేగాని, వ్యక్తి తత్వానికి కాదు. ఈ మాటలు వల్లించేవారి 'తత్వం' యిందుకు పూర్తి భిన్నంగా వుంటుంది. అలాగే దేవుడు, ఆస్తికత్వం, ఆచారం, ప్రేమ మొదలైన వాటిని గురించి చెప్పేవారు చెప్పించేవారి వ్యక్తిగతజీవితం, తత్వం మరోవిధంగా, యిందుకు భిన్నంగా వుంటుంది. అలాగే, నాస్తికత్వం, మానవత్వం ప్రకృతి మనిషి సామర్ధ్యం మొదలైన వాటిని గురించి పెద్ద పెద్ద పదజాలం వాడేవారు, వాటిని నిత్యజీవితంలో యిందుకు భిన్నంగ వ్యవహరిస్తారనేది పరిశీలిస్తే నిత్య సత్యం. అందుకే మనిషి బాహ్య జీవితానికి, అంతర్గత వాస్తవానికి పూర్తి విరుద్ధత వుంటుంది.

నన్ను ఆస్తికునిగా (గురువుగా) భావించి వచ్చేవారు, నాస్తికునిగా గ్రహించి వెడుతూ వుంటారు. అయితే వెళ్ళినవారు వస్తూ వుంటారు, వచ్చినవారు వెళ్తూనే వుంటారు. ఇంతకీ నేను వ్యక్తిగతంగా నాస్తికుణ్ణి కాదు, ఆస్తికుణ్ణి కాదు. ఎందుకంటె, మనిషి మేధస్సు పరిణామ ప్రభావంతో యీనాటికి ఆ రెండు పదాలు, తత్వాలు పాతబడిపోయా యి. ప్రజలలో (మానవులలో) ఆ రెండు భావాలు నిత్య నూతనంగా వుంటున్నా, మేధస్సు వృద్ధి చెందినవారు, అందుకు అతీతంగ వుండవలసి వస్తుంది.

"కర్త కర్మ క్రియ అనేవి తప్పనిసరి. కార్య కారణ విధానం ఒకటి వున్నప్పటికి, ఆ పరిధిలోనూ యివే వుంటాయి. క్రియ చేసిన వాడు కర్త. తత్ఫలితం అనుభవించడం కర్మ. 'సృష్టి' చేయడం క్రియ అనుకుంటే, దానికి 'కర్త'ని దేవుడు అనుకోవాలి. నిజానికి తత్ఫలితం 'కర్మ' దేవుడు అనుభవించాలి. కాని, అలా జరగదు ప్రత్యక్షంగా. ఇహపోతే ప్రకృతికి సంబంధించినంతవరకు మనిషి కర్త. ప్రకృతికి సంబంధించి ఆ కర్త చేసే 'కర్మ'ని అనుభవించాలి. ప్రకృతిలో మనిషి చేసే క్రియా ఫలితాన్ని 'కర్మను' మనిషే అనుభవిస్తాడు. అతనితోపాటు, అతనికి సంబంధించిన వారూ అనుభవిస్తారు. అంటే క్రియ, కర్త అనేవి దేవునికి, మానవునికి సమానమే అయినా, 'కర్మ' అనుభవించే విషయంలో ఇద్దరూ భేదిస్తూ వుంటారు. సృష్టికి కర్త దేవుడైతే ప్రకృతి కర్త మనిషి. అంటె కర్తవ్యం ధర్మం. పైపెచ్చు కర్మని అనుభవించిన దేవుడి కంటె, దానిని అనుభవించే మనిషికి బాధ్యత ఎక్కువ.

సూర్యుడు, చంద్రుడు వెలుగుకు కారణమైనా, అవి ఎల్లవేళలా అందుబాటులో వుండవు. 'దీపం' కావాలి. అలాగే 'దేవుడు' సృష్టికర్త అయినా, మనిషికి అందుబాటులో వుండేది, వుండవలసింది, అతని 'కర్తవ్యం.' కనుక మనిషికి తన కర్తవ్యం, సామర్ధ్యం, కృషి, దేవుడు, మొదలైన వాటికంటె అది ముఖ్యం. కనుక"కర్మనిజపించే కంటె కర్త వ్యాన్ని నెరవేర్చు" ఒక ఆస్థిక చాధస్తునికి నేను చెప్పిన కర్తవ్య బోధ.

# ఒపీనియన్: 73

"పదార్థ (ప్రకృతి) స్పందన భావాన్ని కలిగిస్తే, ఆ భావానికి శబ్దం ప్రాథమిక ఆధారం అయితే, భాష, ఆ శబ్దానికి స్పష్టమైన రూపమైతే, దాని అభివృద్ధి పరిణామ ఫలితం సాహిత్యం, దాని చారిత్రక రికార్డు సంస్కృతి తదితరమైనవి.

అయితే, వ్యక్తిగతమైన భావం, భాష, ఆ వ్యక్తిపై చూపించే ప్రభావం కంటె,ఇతరుల భావం, భాష, విస్తృతార్థంలో సాహిత్యం దాని ప్రక్రియలు వ్యక్తిమీద, సంఘం మీద, మంచిగానో చెడుగానో హెచ్చుగా ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ 'సాహిత్యం' సాధారణంగ, సమాజాన్ని పాలించేవారి చేతులలో వుంటుంది గనుక తత్ఫలిత ప్రభావం అలాగే వుంటుంది. సాహిత్య సృష్టి (రచన) చేసేవారు, పాలకులకు, ప్రభువులకు అంకితం (అమ్ముడుపోవడం) కావడం సహజంగానే జరుగుతూ వుంటుంది గనుక, అట్టి సాహిత్య స్వరూప స్వభావాలు, ఆయా (అగ్ర)హారాల వర్గాల స్వరూప స్వభావాలనే వ్యక్తం చేయడం సహజం. 'ప్రజలు' మందబుద్ధులు, మానసిక, శారీరక బానిసలుగ వుండడం, పాలకులకు, సంఘదోపిడీ చేసే స్వార్థపరులకు చాల అనుకూలంగ వుంటుంది గనుక, వారిని అలా తయారుచేసే 'సాహిత్యసృష్టిని'ప్రోత్సహించడం సహజం. నేటికి ఏదో పేరుతో జరిగేది యిదే! పురాణాలు యీ విషయంలో చేరవలసిన చోటికి చేరాయి. 'ప్రజాస్వామ్యం' కూడ అదే దారిలో వుంది.

# ఒపీనియన్: 74

'ఆత్మ' భావం, దానికి సంబంధించిన 'జ్ఞానం', దర్శనం, ఆధ్యాత్మిక ఔన్నత్యానికి సోపానమని సాధారణ వేదాంత భావం. 'ఆత్మజ్ఞానం' బ్రహ్మైక్యతకు, అద్వైత భావానికి, మోక్షానికి అతి ప్రధానమని అందుకు సంబంధించిన వారు చెబుతూ వుంటారు. అందుకు అవసర మైన భక్తి భావం, గురించి, అనేక పద్ధతులలో భక్తులకు బోధిస్తూ వుంటారు. ఆత్మదర్శనం కోసమే రమణ మహర్షిలాంటి ఎందరో గొప్పవారు తమ జీవితాలను అంకితం చేశారు. 'తపస్సు' చేశారు. పూర్వం మునులు, ఋషులు చేసిన తపస్సు భావం ఏమోగాని, ఆత్మ సాక్షాత్కారం ఆధ్యాత్మిక రంగంలో అత్యంత ముఖ్యమైనదిగా అంగీక రించబడింది. ఆత్మను గురించి, దాని మాతృక అయిన పరమాత్మ గురించి వాటి తత్వజ్ఞానాన్ని గురించే ఎంతోమంది గురువులు ఉ పదేశం యిస్తూ వుంటారు. అందులోని పరమార్థం ఎందరికి తెలిసిందో, ఎందరు ఎంతవరకు పొందారో చిదంబర రహస్యం!

అయితే, నా దృష్టిలో 'ఆత్మ' భావం, ఆధ్యాత్మిక జ్ఞాన పరిపూర్ణతకు పెద్ద అవరోధం. ఇలా అనడం వింతల్లో వింతగా, పరమ అజ్ఞానంగా అనిపించవచ్చు. కాని నిజానికి నేను బాగా, మహా బాగా యోచన చేసిన తరువాతనే, ఎంతో పరిశీలన జరిపిన తరువాతనే, ఎన్నో ఋజు వులు తర్కబద్ధంగా చేసిన తరువాతనే, పూర్తి ఆధ్యాత్మిక భావంలో నేను సాగించిన కృషి ఫలితంగానే యిలా చెబుతున్నాను. ఇవి వాస్తవం. 'ఆత్మ' 'పరమాత్మకు' ఒక పెద్ద అవరోధం???

# ఒపీనియన్: 75

మతం-రాజకీయం, మనుష్యుల్ని మూఢుల్ని, జడుల్ని చేస్తున్నాయి. మానవుని మానసిక అభివృద్ధిని ఎప్పటికప్పుడు అరికట్టి, మట్టిముద్దగా మారుస్తున్నాయి. ఈ పరిస్థితి ఈనాటిది కాదు. మానవజన్మ ప్రారంభ మైనప్పటినుండి అవిచ్ఛిన్నంగా సాగిపోతూ వస్తున్న అజ్ఞాన వాహిని యిది. 'సాహిత్యం' దానికి ఆధారం.

అయితే మానవ అభివృద్ధి, సంస్కృతి, నాగరికత ఎంతో అభివృద్ధి చెందుతూ, శాస్త్ర జ్ఞానం, విజ్ఞాన శాస్త్రం అద్భుతంగా అభివృద్ధి జరిగి, తత్ఫలితంగా మనిషి జీవితం ఆధునికం అయినట్లు అనుభవ పూర్వకంగా తెలుస్తుంది. దీనిని కాదనడానికి వీల్లేని వాస్తవం. అయితే, 'జ్ఞానం', మేధస్సు, చైతన్యం, అభివృద్ధి, మానసిక వికాసం మొదలైన విశేషాలు ఏ కాలంలోనైనా కొద్దిమంది వ్యక్తులకే పరిమితమైనట్లు, చరిత్ర పరిశీలన తెలియజేస్తుంది. మిగతా జనం, ఆ 'నీడలో' 'బొమ్మలుగ' బ్రతకడం మామూలుగ జరిగిపోతూ వుంది. వేదజ్ఞానమైనా, శాస్త్ర జ్ఞానమైనా, విజ్ఞాన శాస్త్ర జ్ఞానాభివృద్ధి అయినా మానవులందరి మాన సిక వికాసానికి, చైతన్యానికి ప్రతి బింబాలు, ప్రతినిధులు ఎందుకు కాలేదు? అనే విషయాన్ని పరిశీలిస్తే, మానవ పరిణామం, ఆ మాట కొస్తే జీవపరిణామంలో, యింతవరకు తెలియని రహస్యం ఏదో వుంది.

ఏది ఎలా వున్నా-మతం, రాజకీయం అభివృద్ధి నిరోధకాలై, మానవుని పట్ల 'శాపాలు' గా పరిణమించాయి... ఫలితంగా, 'జనం' జీవులలో అతి నీచమైన స్థాయిలో బ్రతకడం జరుగుతోంది.

# ఒపీనియన్: 76

భారతదేశంలోని ప్రజాస్వామ్యం, సామ్రాజ్యవాదుల రాచరికం కంటె ఘోర మైంది. వలస పాలనలో బానిస బ్రతుకు కంటె, స్వదేశీ పాలనలో నీచంగ వుంది ప్రజల బ్రతుకు. ఆర్థిక దారిద్ర్యం కంటె, మానసిక దారిద్ర్యం, బుద్ధిహీనత, మూఢత్వం, జడత్వం, ఆరాధనాతత్వం మితిమీరిపోయాయి జనంలో. నేటికి బ్రతికి వుండి, ప్రజల మధ్య వున్నవారి బ్రతుకు తీరు స్పష్టంగా తెలుస్తున్నా కొద్దిమంది ఘరానా గొప్పవారు, మోసకారులు, దగా వెధవలు జనానికి 'దేవుళ్ళు'గా కన్పిస్తున్నారంటే, అలాటి నీచులను వారు ఆరాధిస్తున్నారంటె, దేవుని అవతారాలుగ భావించి ప్రేమించి, 'భక్తులు'గా బుద్ధిమాలిన బ్రతుకు బ్రతుకుతూ, చెక్కభజన వ్యక్తిపూజ, ఆరాధన చేసి, కాలం గడుపు తున్నారంటె, ఈ శతాబ్దంలోని 'జనం', ముఖ్యంగా భారతదేశంలో 'మంది' స్వరూప స్వభావాలు అర్థం చేసుకోవచ్చు.

దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం, కొద్దిమంది బుద్ధిమంతులు, చైతన్యవంతులు, ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం గలవారు వుండేవారు. వారి కారణంగానైనా అతి స్వల్పంగానైనా, స్వాతంత్ర్య పోరాట ఫలితంగా, అప్పుడప్పుడు ప్రజలలో 'చైతన్యం' మచ్చుకి కన్పించేది. వేళ్ళమీద లెక్కపెట్టగల మనీషి గల మనుషులు వుండేవారు. కాని నేటికి ఏడుగురు గ్రుడ్డివారు ఏనుగును చూచిన చందంగా, భారత ప్రజలు ప్రజాస్వామ్యాన్ని గుర్తిస్తున్నారు.

# ఒపీనియన్: 77

'స్కైలాబ్' పతనం గురించి, ప్రజలు అనుకునే తీరు, వ్యాఖ్యానాలు,వారి వారి ప్రవర్తన పరిశీలిస్తే, ఇరవై శతాబ్దంలో వున్న భారతీయులు మొదటి శతాబ్దం కంటె వెనకబడి వున్నారు అనుకోవలసి వస్తుంది. ప్రకృతి వికారాలను చూచి, ఆనాటి అనాది, అజ్ఞాని అయిన మానవుడు రాయిలోనూ, రప్పలోనూ, చెట్టులోనూ, పుట్ట లోనూ దేవుణ్ణి చూచి, శరణుజచ్చిన తీరు, ఈనాటికీ స్పష్టంగా ప్రజలలో కన్పిస్తోంది. స్కైలాబ్ పతనం గురించి ప్రజల ప్రవర్తన, ఆనాటి మానవుణ్ణి తలంపుకు తేక మానదు. పూనకాలు, పూజలు, జపతపాలు, శాంతులు, మ్రొక్కుబడులు వగైరా వగైరా 'జాతర' చూస్తుంటె, నేటి మనిషిలో 'విజ్ఞానం' ఏ పాలులో వుందో తెలుస్తుంది. విద్యావంతు లుగ, విజ్ఞానవంతులుగ కన్పించేవారు, అనిపించేవారు, నటించేవారు స్కైలాబ్‌ను గురించి చేసే వ్యాఖ్యానాలు, వింత ప్రవర్తనల ఆలోచన గలవారికి అసహ్యాతను కలిగిస్తుంది. విజ్ఞానశాస్త్రం అంటె ఏమీ తెలియని, అక్షరజ్ఞానం లేని అతి సామాన్యులు అనాది మానవుణ్ణి తమ ప్రవర్తనతో గుర్తు చేస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. అలాకాక, ఆధునిక విద్యను అభ్యసించి, స్కైలాబ్‌లాంటి శాస్త్ర విశేషా లను గురించి కనీసం చదువుకునే వీలు (ఆలోచించే తీరు ఏలాగూ లేదు) వున్నవారు సహితం, దాని పతనానికి సంబంధించి 'పాపం', శాపము, దేవుడి కోపము, కలియుగ నాశనం మొదలైన పరమ మూర్ఖత్వపు, చాంధసత్వపు పోకడలు, 'ప్రవచనాలు'చేస్తున్నా రంటె, ఏనాటికి మనిషి జ్ఞాని కాలేడని, పైపెచ్చు తిరోగమనమని అర్థం చేసుకోవచ్చు.

# ఒపీనియన్: 78

అదుపులేని కోరిక మనిషికి శాపం. కొన్ని సమయాలలో విచక్షణా జ్ఞానాన్ని పోగొట్టి, పశుతుల్యుని చేస్తుంది. రాజ్య కాంక్ష మరీ నీచమైనది. ప్రమాదకరమైనది. మనిషిని మృగతుల్యునిగా మార్చి, మానవత్వాన్ని నామరూపాలు లేకుండా చేస్తుంది.

రాచరికంలో యీ ప్రమాదం, రాచరికపు కుటుంబాలవరకే వుం టుంది. అవకాశాలను బట్టి, దర్బారులో ప్రముఖులకు కూడ యీ వ్యాధి సోకుతుంది. రాజ్యాధికార పోరాటం ఏ స్థితిలోనైనా, ఏ రూపం లోనైనా తీవ్రస్థితిలో సాగినా, క్రూరస్థితిని చేరినా, పరిమితంగానే వుంటుంది. దాని తాకిడి, ఫలితం ప్రజలకు ప్రత్యక్షంగా వుండదు. పరిపాలకుని ప్రభావం ప్రజలపై పడడం మరో విషయం.

కాని, ప్రజాస్వామ్యంలో రాజ్యాధికారపు పోటీ, పోరాటం, హద్దులు లేని నీచత్వానికి చేరుతుంది. పోల్చడానికి మరొకటి దొరకని నీచాతి నీచస్థితికి మనిషిని తీసుకుపోతుంది. ఆ సమయంలో విచక్షణా జ్ఞానం సంగతి అలా వుంచి, కనీస బుద్ధికూడ లేకుండా పోయింది. పైపెచ్చు ఈ భాగం ప్రజాస్వామ్యం పేరు విస్తృతస్థాయిలోవ్యాపిస్తుంది. అనేక మందిని నాయకులను బుద్ధిహీనులుగ మారుస్తుంది. ప్రజలందరు, ఎంతోకొంత దీని ప్రభావం అనుభవించాలి.

నేటి భారతదేశంలో రాజ్యాంగాధికారం కోసం సాగుతున్న పోరాటం ఊహకందని నీచస్థితికి చేరింది.

# ఒపీనియన్: 79

ప్రజాస్వామ్యం రాజకీయంలోనూ, సోషలిజం ఆర్థిక రంగంలోనూ, సెక్యులరిజం సాంఘిక స్థాయిలోనూ అనుసరించవలసిన ప్రధాన సూత్రాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది అంటే ఒకరకంగా దేశాన్ని పాలించేవారిని, పాలించబడేవారిని ఆదేశిస్తోంది. కాని ఆచరణలో అది 'ఉచిత సలహా' స్థాయిలో కూడ లేకపోగా, అందుకు భిన్నంగా అనుభవంలోవుంది. భారతదేశంలో అది సహజమే అని సరిపెట్టుకో వలసి వస్తుంది.

తార్కికంగా ఆలోచిస్తే, మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. అంటె, మరో మాటలో, పార్టీ పాలన ఇందులో ప్రధానమంత్రి ముఖ్యపాలనా ధికారం గల ప్రభుత్వ పద్ధతి. కనుక 'ప్రజాస్వామ్య' పార్టీస్వామ్యంగా ఆచరణలో వుంటుందిగాని, 'ప్రజల ప్రజాస్వామ్యం' అనే మూలార్థంలో ప్రజాస్వామ్యం ఆచరించబడడమేలేదు. అలాగే పెట్టుబడిదారీ విధానం అమలులో వున్న ఆర్థికరంగంలో 'సోషలిజం' అనేదానికిఅర్థం లేదు. ఏ విధంగా చూచినా, పెట్టుబడిదారీ పద్ధతి సోషలిజం పరస్పర విరుద్ధాలు, శతృసమానులు. వాటి వునికిలోనే ఆ భేదం వుంది. అలాంటప్పుడు ఆచరణలో పెట్టుబడిదారీ విధానాన్ని అధికార పూర్వ కంగా అంగీకరించి, ఆచరణలోపెట్టి, 'సోషలిజం' రాజ్యాంగబద్ధమంటే, యింతకంటే హాస్యాస్పదం మరొకటి లేదు. అలాగే, 'రిజర్వేషన్' పేరులోనో, మరో పేరుతో సర్వం 'కులం, వర్గం' తో సంఘ జీవితంచట్ట బద్ధంగా సాగిస్తూ, సెక్యులర్ పదాన్ని రాజ్యాం గంలో రాసుకోవడం వింతకదా! ప్రజలను మోసం చేయడమే గదా!

# ఒపీనియన్: 80

నీటి అడుగున బురదలో పుట్టి, నీటిపైకి వచ్చి వికసిస్తాయి తామర పువ్వులు. అంతమాత్రాన బురదలో (నీటి అడుగున) పుట్టిన ప్రతిదీ నీటిపైకి వస్తుందని, పుష్పిస్తుందని అర్థం కాదు. అది సృష్టిధర్మం కూడ కాదు. అలాగే, నేలపైన, గాలి వెలుతురో పుట్టినప్పటికీ, అన్ని ఒకే తీరుగ పెరగడం ఫలవంతం, ప్రయోజనం కావడం జరగదు. అది సృష్టిధర్మం కాదు. కనుక నీటిపైకి రానివి, నేలమీద పెరగనివి ఎన్నో వుంటాయి. అవి అంతటితోనే అంతమైపోతాయి. పుట్టడం, గిట్టడం అనేవి సృష్టిధర్మం. పెరగడం ఫలవంతం, ప్రయోజనకారి కావడం ప్రకృతి ధర్మం.

ఈ సూత్రం తిరిగే జీవులకు కూడ వర్తిస్తుంది. అందులో మనుష్యులకు ముఖ్యంగా యిది అమలులో వుంటుంది. పుట్టడం, పెరగడం, చావడం అనేదిసహజంగా జరిగిపోవడం ఎక్కువగా వుంటుంది. వీటితోపాటు, ముఖ్యంగా పెరగడం, ప్రయోజనవంతం కావడం కొద్ది మందికే పరిమితమై వుంటుంది. అందుకు కారణాలు అనేకం. ఆ కారణాలు కూడ వివిధ తత్వాలను, స్వభావాలను కలిగి వుంటాయి.

భారతదేశానికి సంబంధించినంత వరకు కులం, ధనం, అధికారం, ఇవి మనిషి  ఔన్నత్యానికి, ఘనతకు తోడ్పడే అత్యవసర విషయాలు అర్హతలు. 'జాతకం' తెర వెనక వ్యవహారమే!

# ఒపీనియన్: 81

తత్వ విచారణ, సత్యాన్వేషణ అనేది లౌకికాతీతమైనవి. భౌతిక పరిమితి, పరిపూర్ణత ద్వారా అందుకు మార్గం సులభమౌతుంది. మానసిక పరిపక్వత, హృదయ విశాలత మొదలైన అంశాలు యిందుకు అవసరమౌతాయి. ఆధ్యాత్మిక, సాధకులమనుకొనే వారిలో, దాని ప్రవేశానికి కనీస అర్హతలు ఎందరికి వున్నాయనేది ఆత్మ పరిశీలన ద్వారా తెలియవలసిన విషయం.

ఈ ఆత్మ పరిశీలన అనేది కేవలం ఆధ్యాత్మిక సంబంధమైనదే కాదు. భౌతిక దృష్టిలో, నిత్య జీవితంలో వ్యక్తిగత పరిశీలనకు వుపయోగించుకోవలసిన అంశంకూడ కాని, నిత్యజీవితంలో, మనిషి ఆచరించే 'కర్మ'లో ఈ ఆత్మ పరిశీలనకు ఎంతవరకు తావు వున్నది అనేది ప్రశ్నార్థకమే! ఆలోచనగల మనిషి తన జీవితంలో చాలాభాగం యీ ఆత్మ పరిశీలనకు తావులేకుండానే గడిచిపోతుంది.

ఆత్మపరిశీలనగల వ్యక్తులలో, దాని స్పష్టత, సమగ్రత ఎంత అనేది మరొక ముఖ్యమైన ప్రశ్న. ఆత్మ పరిశీలన పేరుతో ఆత్మవంచనకు, అహంకారానికి పాల్పడితే, అంతకంటే అజ్ఞానం మరొకటి వుండదు.

ఏమైన, ఆచరించే 'కర్మ'ని ఆత్మ పరిశీలనతో పరీక్షించి, గ్రహించిన వాస్తవాన్ని ఆచరణలో పెట్టడం 'జ్ఞాని'కి ప్రథమ కర్తవ్యం.

# ఒపీనియన్: 82

రీతి లేనిది రాజకీయం (రాచరికం). నీతిలేనిది ఆస్తికత్వం (మతం). ఈ రెండింటికీ స్థానం లేనిది ప్రజాస్వామ్యం (పార్టీ ప్రజాస్వామ్యం). ఇది తారాస్థాయికి చేరిన దేశం భారతదేశం.

ఆశించేది, ఆశపడేది ఒకటి. అందరికీ చెప్పేది మరొకటి. (ఆంత రంగికులకు చెప్పేది వేరొకటి) ఆచరించేది యిందుకు భిన్నం. చివరికి సాధించుకునేది ఆ మొదటిది. మధ్యలో దగాపడేది "ప్రజలు". ప్రజా సమస్యలను నినాదాలలో పెట్టి, (మత్తుమందు కలిపి) నటించేవారు నాయకులు ప్రజాస్వామ్యంలో వంత కొట్టేవారు కార్యకర్తలు. ఘటికులైన వారి నటనకు తన్మయులై, (మానసిక) బానిసలై స్వార్థ పరులైన వంచ కులకు సర్వం ఒప్పగించి దగాపడి ఊసురోమనేవారు ప్రజలు. వారే నిజమైన ప్రజలంటే.

ప్రజాస్వామ్యం (పార్టీస్వామ్యం లేక పెత్తనం, నియంతృత్వం) పేరుతో ప్రపంచంలో ఏ దేశంలో సాగుతున్న పరిపాలనైనా యిదే తంతు తతంగంతో సాగిపోతోంది. ప్రచార సామర్థ్యంతో, 'ప్రజాస్వామ్యం'లోని క్రూరత్వాన్ని నియంతృత్వాన్ని అసహ్యకరమైన అవినీతిని, హద్దులేని పాలకుల స్వార్థాన్ని, అహంకారాన్ని "ప్రజలకు" తెలియనీయకుండా చేయడం జరుగుతోంది. ప్రజాస్వామ్య ముసుగు లో ప్రజాదోపిడీ, హత్యాకాండ జోరుగా పెద్ద ఎత్తున జరిగిపోతోంది.

# ఒపీనియన్: 83

భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం, భారత సంస్కృతి లక్షణం, లక్ష్యమని, ఘనతగా చెప్పుకోవడం చాలామందికి అలవాటు. ఆధ్యాత్మిక విలువల ఆధారంగ ఆలోచన చేసే యిది ద్వైతం, అద్వైతంగా భావించవచ్చు. ద్వైతం, అద్వైతంగా మారడం మోక్ష సాధన మార్గం అవుతుందిట!

ఆ సంగతి అలా వుంచి, ద్వైతాన్ని ద్వంద్వంగా సాంఘిక, రాజకీయ, ఆర్థిక (భౌతిక) రంగాలను పరిశీలన చేస్తే కొంత వాస్తవం కన్పిస్తుంది. ఈ ద్వంద్వం ప్రతిదానిలోనూ, దేనిమార్గాన అదే ఎంతో అభివృద్ధి చెందుతోంది. దరిద్రులు-ధనవంతులు, పామరులు-పండితులు- వెధవలూ- మేధావులు మూర్ఖులు-మముక్షువులు బానిసలు- ప్రభువులు పనికిమాలిన 'చెత్త'-పారిశ్రామికవేత్తలు దగాపడేవారు- దోపిడీదారులు -ఇలా ప్రతి విషయంలోనూ ద్వంద్వం విపరీతంగ కొనసాగిపోతోంది- అలాగే ప్రజలలోనూ, 'ప్రజా' నాయకులలోనూ అద్వైతం-ద్వైతం అద్భుతంగా పని చేస్తోంది. స్వార్థం అద్వైతంగానూ, అవినీతి ద్వైతంగాను చెప్పనలవిగాని విధంగా బ్రహ్మాండంగ వుంది. ఫెడరల్ రాజ్యాంగంలో యూనిటరీ రాజకీయం, సోషలిజం విధానంలో పెట్టుబడిదారి పద్ధతి, సెక్యులర్ నినాదంలో కులవ్యవస్థ సంపూర్ణంగ సాగిపోతోంది. ఇంతకంటె ద్వైతం-అద్వైతం సారం మరేముంటుంది?

# ఒపీనియన్: 84

'ప్రజాస్వామ్యం–సోషలిజం', 'ఆర్థిక సంస్కరణలు' 'ఎన్నికల సంస్కరణలు', 'జాతీయ విద్యా విధానం', 'మతం–రాజకీయం', 'కులం–దాని బలం', 'స్త్రీ–సమాజం', 'పార్టీరహిత ప్రజాస్వామ్యం', మొదలైన వ్యాసాలలో (దేవుడు, ఆత్మ, మొదలైన ఆధ్యాత్మిక విషయాలకి సంబంధించిన వ్యాసాల సంగతి అలావుంచి) రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో, చాలాకాలంనుండి స్థిరపడిపోయిన వ్యవస్థ స్వరూప స్వభావాలను స్పష్టంగా పరిశీలించి, పరిశోధించి, లోపాలను చూపించి, సమస్యలను వివరించి, పరిష్కారాలను, సూచించడం జరిగింది.

ప్రజాస్వామ్యం పేరుతో అమలు జరుగుతున్న పార్లమెంటరీ పరిపాలనా విధానం సమాజంలో దోపిడీ వర్గాలకు ఒక శక్తివంతమైన సాధనం మాత్రమే! సమాజంపైస్వారీ చేయడానికి వుపయోగపడే వాహనం మాత్రమే! అందుకే 'ప్రజల ప్రజాస్వామ్యం' (పార్టీ రహితమైనది) కావాలని, రావాలని చెబుతూ, అది ఎలా సాధ్యమో కూడ వివరించాను. అలాగే ఆర్థికరంగంలోకూడ స్వార్థపరులకు దోపిడీదారులకు వుపయోగపడుతూవున్న 'సోషలిజం' సమాజ వంచన మాత్రమే. దాని స్థానంలో 'ఆర్థిక న్యాయం' నేను ప్రతిపాదించాను. అలాగే సాంఘిక స్వరూప స్వభావాలకు సంబంధించి నా భావాలు కొన్ని స్పష్టంగా వున్నాయి.

# ఒపీనియన్: 85

వినాయక చవితి. ఏనుగు తల, ఎలుక వాహనం గల గణపతి దేవుణ్ణి, పత్రితోనూ, కలువ పువ్వులతోనూ పూజించి, ఉండ్రాళ్ళు నైవేద్యంగా (ఆహారంగా) అర్పిస్తారు. వడపప్పు, చలివిడి, పై తిండిగా, లేక ఉపాహారంగా కూడ సమర్పిస్తారు. ఆకారానికి తగిన ఆహారం!

జంతువులు మృగాలు మొదలైనవేకాక, పాము, ఎలుక, నెమలి మొదలైన యితర జీవులతో ఏదో సంబంధం వుంటుంది, హిందూ దేవుళ్ళకు. ప్రాచీన కాలంలో యితర దేశపు దేవుళ్ళు కూడ యిదే బాపతుగా వుండేవారమో! ఆకారంలోగాని, కనీసం వాహనం లేక అలంకారంగాగాని మనిషి పోలిక గల దేవుళ్ళు యితర ప్రకృతి జీవులతో సంబంధాన్ని కలిగివుంటారు. అలా వుండడంలో గల ఔచిత్యాన్ని అర్థ వివరణ లేకుండా, కేవలం భక్తి పారవశ్యతతో ఘనంగా, విస్తరించి చెప్పుకోవడం తప్ప, వాస్తవం లోకానికి తెలియదు - దేవుడి దశావతారాలు, జీవ పరిణామానికి ఒక స్పష్టమైన సంకేతం లేక మంచి ఉదాహరణ అనే విషయాన్ని శాస్త్రీయంగా వాస్తవ దృష్టితో హేతుబద్ధంగా వివరించే స్థితి లేకపోగా, మూఢభక్తితో, చెక్క భజనలో లీనమైపోవడమే జరుగుతోంది. చాందసత్వం చాదస్తం ప్రధానంగ వుంది.

బీజ విస్తరణకు, వ్యాప్తికి ప్రకృతి (భౌతికం) మనోవికాసానికి, ఆత్మవిశాలతకు ఆధ్యాత్మికం (పదార్థ రహితం) ప్రధానంగ ఉద్దేశించబడ్డాయి.

# ఒపీనియన్: 86

**జీ**విత పోరాటంలో పూర్తిగ ఓడిపోయానని ఒప్పుకోను. అయినా యింతవరకు చెప్పుకోదగిన 'విజయం' పొందలేదని అంగీకరిస్తాను. జీవితంలో ఎదురీత మినహా మరో విధమైన రిలీఫ్ కన్పించడం లేదు యింతవరకు  అయినా జీవితంపై నిరాశ లేదు. ఆత్మవిశ్వాసం ఏ మాత్రం సడలలేదు. పరిస్థితులకు దాసోహం అనే ప్రశ్నేలేదు. తుది వరకు పోరాటమే నా లక్ష్యం.

అనుకూల పరిస్థితులు లేకపోగా, అన్నివిధాల వ్యతిరేకత ఎదురౌతున్నప్పుడు, అనుభవం అవకాశవాదాన్ని సమాజ వాస్తవ విషయంగా తెలియజేస్తున్నప్పుడు, ఆశయాలు, సూత్రాలు, సిద్ధాంతాలు మొదలైన కట్టుబాట్లతో జీవితాన్ని కట్టివేయడం మూర్ఖత్వం అనిపించుకోదా? నిజమే! సాధారణంగా తొమ్మిదిమందికి భిన్నమైన పద్ధతిని పదవవాడు అనుసరించినప్పుడు, అది వారి దృష్టిలో ఎబ్బెట్టుగాను, వ్యతిరేకం గానూ, మూఢత్వంగాను, చాదస్తంగాను వుంటుంది. ఆ వ్యక్తి ఒక్కడైనా, ఆ భిన్నత్వంలోని ఔన్నత్యాన్ని, ప్రత్యేకతను, వాస్తవదృష్టితో, నిగ్రహంతో పరిశీలించి, పరామర్శించగలవారు చాలా అరుదు. అయినా, తన మార్గం వాస్తవమైనదని, సత్యమైనదనిపూర్తి విశ్వాసంగల వ్యక్తి, ఎవరి సమ్మతికోసమో ఎదురు చూడరాదు. కర్తవ్యం కొనసాగించాలి.

# ఒపీనియన్: 87

రాష్ట్రాల అసెంబ్లీల సభ్యులు, పార్లమెంటు సభ్యులు రాష్ట్రపతిని ఎన్నుకోవాలి. ఈ సభ్యులలో మెజారిటీ సభ్యులు రాష్ట్రపతిని ఎన్ను కుంటారన్నమాట. సాధారణంగ అధికార పార్టీయే మెజారిటీ గలిగి వుంటుంది. అధికార పార్టీ అంటే, ప్రధానమంత్రి 'యిష్టం' అనేది స్పష్టం. కనుక రాష్ట్రపతి, ప్రధాని యిష్టం ప్రకారం ఎన్నిక కావడం జరుగుతుందన్న మాట.

పార్లమెంటులో 'మెజారిటీ' పార్టీ నాయకుణ్ణి రాష్ట్రపతి ప్రధాన మంత్రిగా నియమిస్తూ, ఆయన సలహా (యిష్టం) ప్రకారం కేంద్ర మంత్రిమండలిని నియమించాలి. అలాగే ప్రధాన న్యాయమూర్తి పదవిలాంటి అత్యున్నత పదవులన్నీ ప్రధాన మంత్రి 'యిష్టం' ప్రకారమే రాష్ట్రపతి నియమించాలి.

పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని రాష్ట్రపతి ఆమెదించి తీరాలి. పునరాలోచనను ఒక్కసారి కోరవచ్చుగాని తిరస్కరించరాదు. పార్లమెంటు అంటే 'మెజారిటీ' పార్టీ సమ్మతి. మెజారిటీపార్టీ అంటే ప్రధానమంత్రే. అంటే ప్రధానమంత్రి 'యిష్టాన్ని' చట్టరూపంలో రాష్ట్రపతి ఆమోదించి తీరాలనేది దీనిద్వారా స్పష్టమౌతుంది.

మంత్రిమండలి సలహా ప్రకారం, అంటే, ప్రధానమంత్రి 'యిష్టం' ప్రకారం రాష్ట్రపతి లోకసభను 'రద్దు' చెయ్యాలి. తిరస్కరించడానికి రాష్ట్రపతికి హక్కులేదు. లోక్‌సభ విశ్వాసం కోల్పోయిన ప్రధానమంత్రి సలహానుకూడ రాష్ట్రపతి తిరస్కరించడానికి వీల్లేదు!!!

మన రాజ్యాంగం ఎంత గొప్పదో దీనిని బట్టి తెలుస్తోంది గదా!

# ఒపీనియన్: 88

గురుడు సింహరాశిలో చేరడంద్వారా పం(డెండు సంవత్సరాలకు ఒకసారి వస్తూ ఉండే (ఈ పన్నెండు సంవత్సరాలలో, అంటే ప్రతి సంవత్సరం దేశం మొత్తం మీద ఒక్కొక్క ప్రాంతంలో పుష్కరం వుంటుంది. అంటె ప్రతి సంవత్సరం పుష్కరం వుంటుంది) పుష్కర స్నానం చేస్తే పాపం పోతుందని, పుణ్యం వస్తుందని, ఆ సమయంలో జరిపించే 'పిండ ప్రధానం'తో పితృదేవతలు సంతోషిస్తారని భారతీయుల నమ్మకం. కేవలం నమ్మకమే కాదు దేశవ్యాప్తంగా యిది ఒక బలవత్తరమైన ఆచారం.

ఈ పుష్కరాలని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా, అందుకు కావలసిన యేర్పాటు చేస్తుంది. దాదాపు లక్షలకు మించి కోట్లకు చేరిన ధన వ్యయంతో ప్రభుత్వం యాత్రికులకు కావలసిన యేర్పాట్లు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ సిబ్బంది, శాంతి భద్రత కోసం తీవ్రంగా కృషి చేస్తోంది. వ్యాపారులకు యిది ఒక మంచి అవకాశం లాభాలు దిమ్మరించుకోడానికి. హిందూ మత శాఖలకు, అలాటి సంఘాలకు యిది మంచి వుత్సాహకరమైన సమయండబ్బు చేసుకోడానికి యాత్రి కులపై పన్ను విధించడం ద్వారా ప్రభుత్వం కూడ వీరితో కలిసి, పుష్కరాలను సొమ్ము చేసుకుంటోంది.

ఒక్కసారి ఏటి స్నానం చేస్తే పాపం పోతుందని, పుణ్యం వస్తుందని అవస్తలుపడే యాత్రికుల మూఢత్వానికి నవ్వాలో, ఏడవాలో తెలియదు.

# ఒపీనియన్: 89

సూత్రప్రాయంగ ఆలోచిస్తే, రాష్ట్రపతి పదవి, ప్రధానమంత్రి పదవి పూర్తిగ భిన్నమైనవి. పరిపాలనా దృష్టితో ఆలోచన చేస్తే సారూప్యత, సమన్వయత కొంత వున్నప్పటికి, పరస్పర విరుద్ధతే ఎక్కువ.

ఎప్పటికప్పుడు దేశంలోని రాజకీయాల స్వరూప స్వభావాలకు ప్రతిబింబంప్రధాన మంత్రి పదవి అయితే, రాజ్యాంగానికి ప్రతిరూపం రాష్ట్రపతి పదవి (రాజకీయ) ఆటల పోటీలలో ఒక జట్టు నాయకుడు ప్రధానమంత్రి అయితే, అంపైర్ రాష్ట్రపతి పదవి. కొలిచే వ్యక్తి ప్రధానమంత్రి పదవి అయితే, 'కొలమానం' రాష్ట్రపతి పదవి. కనుక రాజకీయాల ఆటుపోటులకు అతీతంగా, వ్యక్తి లేక ముఠా ప్రభా వాలకిలోను కాకుండా, రాజ్యాంగ రక్షణ చేస్తూ, కుటిల రాజకీయాల నుండి ప్రజలకు 'న్యాయం' ప్రసాదించడం ద్వారా దేశ ఔన్నత్యానికి ప్రధాన కర్త కావలసిన పదవి రాష్ట్రపతిపదవి.

కాని దురదృష్టవశాత్తు రాజ్యాంగం అమలులోకి వచ్చిన ప్రారంభంలో ఒకరిద్దరు తప్పించి, ఆ పదవిలోకి వచ్చినవారంతా రాజ్యాంగానికి హాని చేయడం ద్వారా ప్రజలకు కీడు చేశారు. రాజ్యాంగ రక్షణకు ప్రమాణ స్వీకారం చేసి, ప్రధానమంత్రి రక్షణకు కృషి చేయడమే ఎక్కువగా జరిగింది. ముఖ్యంగా ఇందిరాగాంధి ప్రధాన మంత్రి పదవి నిర్వహణలో రాష్ట్రపతి పదవి ఆమె చేతిలో 'మంత్రదండంగా' వుపయోగపడింది. లోక్‌సభ రద్దు యిందుకు మంచి ఉదాహరణగా మనకు తెలుస్తుంది.

# ఒపీనియన్: 90

'ప్రజాస్వామ్యం' పద్ధతిలో పరిపాలన భారతదేశానికి తగినది కాదా? భారతీయులు దానిని సద్వినియోగం చేసుకోలేరా? స్వపరిపాలన నిర్వహించుకోగల రాజకీయ పరిజ్ఞానం భారతీయులకు అలవడదా? 'ప్రజల ప్రజాస్వామ్య' స్థాయిలో కాకపోయినా కనీసం 'పార్టీ ప్రజాస్వామ్యం' పరిమితిలోనైనా 'రాచరికపు నీడలో' దేశాన్ని పాలించుకునే సామర్థ్యం భారతీయులకు లేదా? తమ పాలనద్వారా ప్రజా సమస్యలు తొలగించలేకపోయినా, అంతటి సామర్థ్యం లేకపోయినా, కనీసం దేశాన్ని నానాటికి హీనమైన స్థితిలోకి దించివేయకుండా తమ నాయకులను ప్రజలు అదుపు చేయలేరా? ప్రజల సమ్మతిలో పాలనాధికారం పొంది, ప్రజాసేవకులుగా ప్రజలను పాలించి, తమ పనులకు ప్రజలకు 'సంజాయిషీ' సమాధానం చెప్పుకోవలసిన నాయకులను 'వ్యక్తి ఆరాధన' పేరుతో ప్రజాస్వామ్యాన్ని రాచరికంకంటె హీన స్థితికి తెచ్చే ప్రజలకు మానసిక దాస్యం వదలి, రాజకీయ (వ్యక్తిత్వం గల) చైతన్యం కలిగే కాలం భారతదేశానికి, భారతీయులకు లేదా? ప్రజాస్వామ్యం ముసుగులో 'ప్రజానాయకుల' బ్రాండుతో తమ ఏజెంట్లను పరిపాలకులుగా చేసి, విదేశీ రాచరికంలో కంటె ఘోరంగా దోపిడీ చేసే స్వదేశీ పెట్టుబడిదార్లను, బూర్జువాలను అదుపు చేసే నాథుడు ఈ దేశంలో పుట్టడా???

# ఒపీనియన్: 91

రాచరికం-ఫ్యూడలిజం ప్రజాస్వామ్యం-పెట్టుబడిదారీ విధానం ఒకదాని ప్రక్కన ఒకటి బతుకుతూ వుంటాయి. ఫ్యూడలిజానికి ముందు వున్న రాజకీయం సమగ్రతను కలిగిలేదు. సాంఘిక జీవితం కూడ దాదాపు ఒక పద్ధతిలో లేదు.

సోషలిజం, కమ్యూనిజం అనేవి ఆర్థిక విధానాలు, యిజాలు మాత్రమే. వీటిని అమలు చేయగల రాజకీయ స్వరూప స్వభావం ఎలా వుండాలి అనేది అతి ముఖ్యమైన ప్రశ్న. ప్రస్తుతం అమలులో వున్న ప్రజాస్వామ్య రాజకీయం పెట్టుబడిదారీ విధానాన్ని మాత్రమే అమలుచేసి, బూర్జువా వ్యవస్థని వృద్ధి చేయగలదు. సోషలిజం లేదా కమ్యూనిజాలను అమలు చేయగల పరిస్థితి సూత్రరీత్యా కూడ ప్రస్తుతప్రజాస్వామ్యంలో లేదు. అది సాధ్యం కాదు. కనుక సోషలిజం లేదా కమ్యూనిజాన్ని అమలు చేయగల నూతన రాజకీయ విధానం అవసరం అవుతోంది.

ప్రజాస్వామ్యం, సోషలిజం, సెక్యులరిజం అనేవి బూర్జువా స్వార్థ ప్రయోజనాలకు వుపయోగపడగలవు. వాళ్ళ దోపిడీ విధానాన్ని ప్రజలకు తెలియకుండా చేయడానికి సోషలిజం అనేదాన్ని మోసపూ రితంగా పెట్టుబడిదార్లు వుపయోగిస్తున్నారు. అలాగే ప్రజాస్వామ్యం కూడ. రాజకీయంగ ప్రజాస్వామ్యాన్ని, ఆర్థికంగా సోషలిజాన్ని, సాంఘి కంగా సెక్యులరిజాన్ని, కేవలం పెట్టుబడిదార్ల ప్రయోజనాలను చెక్కు చెదరకుండా కాపాడుతూ, దోపిడీ విధానం కొనసాగేటట్లు చేయబడుతోంది.

# ఒపీనియన్: 92

దాదాపు అరవై సంవత్సరాలపాటు, ముఖ్యంగా ముప్పయి సంవత్స రాలపాటు కొనసాగిన స్వాతంత్ర్య పోరాట ఫలితంగా, నీతి, ధర్మం, త్యాగం మాత్రమే తెలిసిన మహావ్యక్తుల, మహాత్ముల ఆత్మార్పణ ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది స్వదేశీ ప్రభుత్వం యేర్పడింది. ఆ మహాయజ్ఞంలో మనస్ఫూర్తిగ పాల్గన్నవారిలో అప్పటికి మిగిలిన కొంతమంది ప్రజలను పాలించడం ప్రారంభించారు. అయితే, స్వార్థం రూపుదాల్చినవారు, అవినీతినే ఆరాధించేవారు, అహంకారమే అలంకరణగా ధరించినవారు, తనకోసమే సర్వాన్ని నాశనం చేయడం అలవాటు గలవారు, అబద్దాలు చెప్పడమే అలవాటుగా చేసుకున్న దగాకోరులు, ప్రజలను కుక్కలకంటె (ఊర కుక్కలు) హీనంగా భావించేవారు, తాము యీ దేశాన్ని పాలించడానికే భూమిపై అవతారమెత్తినట్లు ప్రచారం చేసుకునేవారు, చేయించుకునేవారు, దోపిడీ తమ లక్ష్యమైనా, ప్రజా సేవకులుగా ప్రచారం ద్వారా ప్రజలను వంచన చేసేవారు, కుల వ్యవస్థను పోషిస్తూ, 'కుల హీనులను', బలహీనులను ఉద్ధరిస్తున్నట్లు డప్పు వాయిస్తూ, వారిని నీగ్రో బానిసల కంటే నీచంగా మానసిక దాసులుగ, మట్టి ముద్దలుగ మార్చేవారు దేశం, దేశంలోని ప్రజలు ఏమైపోయినా, తమ శ్రేయస్సే ప్రధానంగా భావించేవారు, ఆనాటి త్యాగమూర్తుల నీడలలో పెరిగి గోముఖ వ్యాఘ్రాలుగ గొఱ్ఱెతోలు కప్పుకున్న తోడేళ్ళుగా నటించి, ఆ తరువాత యీ దేశానికి పాలకులై, ప్రజాపీడులై దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారు.

# ఒపీనియన్: 93

సంయోగం-వియోగం-ఈ మధ్యలో జరిగే వినియోగం తత్ఫలితంగా జరిగే, జరుగుతున్నట్లు కన్పించే, అనిపించే పరిణామం-ఇది సృష్టి స్థితి, విశ్వగతి. నిజానికి యీ గమనాన్ని సృష్టి గతి, విశ్వ స్థితి అని అనాలి. కాని అది జీవ పరిణామరీత్యా సరికాదు. ఈ విషయంలో జీవం-జడం సూత్రరీత్యా ఒకటే అయినా, పరిశీలన కోసం వేరు చేసి ఆలోచన చెయ్యాలి.

పరిణామ ప్రక్రియను పొందే ప్రతిదీ జీవమే! అందుకే జడం కూడ ఒక రకమైన, ఒక దశ మేరకు జీవమే! జడంలో కూడ చలనం వుంది. అయితే అది జీవంగా పరిణామం చెంది ప్రత్యక్షమైనప్పుడు అంతర్గత చలనం (జీవం) స్పష్టంగా తెలుస్తుంది. అంటె, విశ్వపదార్థ పరిణామంలో జీవస్థితికి ముందు దశ (స్థితి) జడమన్నమాట! దానికి ముందు దశ కూడ జీవమే! అయితే ఆయా దశల పరిణామ స్వరూప స్వభావాలు భిన్నంగా కన్పించవచ్చు. కాని పరిణామ మూల స్థితి, సూత్ర రీత్యా ఒక్కటే!

అందుకే అనంత విశ్వమే జీవం. పరిణామ క్రమంలోని దశలను బట్టి పరిశీలనా సౌలభ్యం కోసం జీవం-జడం-అంతకుపూర్వం, అవి విడదీయవలసి వుంది. కనుక, జీవం నిమ్నత్వం, ఔన్నత్యం కేవలం భూమికి మాత్రమే పరిమితమై లేదు. అనంత విశ్వవ్యాప్తంగా జడ-జీవ పరిణామం వుంది. పరిశీలించగలిగితే?

# ఒపీనియన్: 94

మానసిక వికృతికి, అపరిపక్వతకు, అజ్ఞానానికి నాగరికత అని పేరు పెట్టుకుని పిలుచుకోవడం మనిషికి అలవాటు అయింది. అలం కరణలో భిన్నత్వానికి నాగరికత అని పిలవడం జరుగుతోంది. ఆహార విహారాలకు, వేష భాష వినియోగంలలో వున్న వికృతాన్ని నాగరికతగా భ్రమించడం ప్రస్తుతం ఎక్కువగా వుంది. నిజానికి మనిషిలోని ప్రతి వికార చేష్టకు, రుచికి, అభిరుచికి, నాగరికత పేరు పెట్టడం నేటి మానవులలో హెచ్చుగా వుంది. మనిషిలోని యీ మానసిక వికృతికి వికారానికిపోటీ పడలేకపోవడం లేదా అనుకరించకపోవడాన్ని అనాగ కరితగా, వెనుకబడినతనంగా భావించడం మామూలు అయిపోయింది.

మనిషి మేధస్సు ఎదగకపోవడం ఫలితంగా వికార చేష్టలు విపరీత పోకడలు మనిషిలో చోటు చేసుకుంటున్నాయి. సహజంగానో అసహ జంగానో ఒకచోట యేర్పడిన వికార చేష్టకు, వికృత మార్పుకు అనుకరణ జోడించి, క్రొత్తదనంగా భావించడం అత్యధిక సంఖ్యాకులు చేస్తున్నపని.

గుణ దోషాల పరిశీలనతో పని లేకుండా గ్రుడ్డి అనుకరణ ఫలితంగా మానవ సమాజంలో జ్ఞానానికి తావులేకుండా పోతోంది. అత్యధిక సంఖ్యాకుల అజ్ఞానం పరిమిత సంఖ్యలో వున్న జ్ఞానుల జ్ఞానం చాదస్తంగా లెక్కింపబడుతోంది.

# ఒపీనియన్: 95

ఆధునిక మానవుడు ప్రకృతి సంపదను ఎంతో ఎక్కువుగా వినియోగించుకున్నట్లుగా కన్పిస్తుంది. అది నిజం కాదేమో! నిజానికి ఉపయోగంలో వున్నదానినే మరింత ఎక్కువగ వుపయోగించుకోడానికి ప్రయత్నం జరుగుతోందిగాని, ప్రకృతిలో ఎక్కువ భాగం వినియోగంలో లేకుండా వుంది.

భూమిపై జలసంపద ఎంతో వుంది. కాని, మనిషి వుపయోగించుకునేది అతి స్వల్పం. మనిషి ఆకలి తీర్చే సముద్రం ఎంతో వుంది. కాని వుపయోగంలో లేదు. నేలపై నదులలో నీరు అత్యధికభాగం వృధాగా సముద్రాలలో పడుతోంది. అయినా సేద్యానికి నీరు లేక భూమిలో ఎంతో భాగం బీడుగా వుంటోంది. నేలలో ఖనిజ సంపద అపారంగ వుంది కాని వెలికి తీసి మానవుని వుపయోగానికి వచ్చేది చాలా తక్కువ.

మానవశక్తి ఎంతో వృధా అయిపోతోంది. శారీరక శక్తి వినియోగించుకునే అవకాశాలు, అవసరాలు యింకా ఎంతో ఎక్కువుగా అమలు చేయవలసి వుంది. అలాగే మేధాశక్తి అత్యధిక భాగం పనికి రాకుండా పోతోంది. అడవిలో వెన్నెలవలే, మానవులలో మేధాశక్తి వృధా అవుతోంది. అందుకే మానవలోకం 'లేమితో' బాధపడుతోంది.

# ఒపీనియన్: 96

భారతదేశంలో త్రేతాయుగానికి ముందు రాజకీయం ఎలా వుందో గాని, ఆనాటి నుండి యీనాటివరకు రాజకీయం నాటకీయంగా జరిగిపోతూ వుంది.

రాముడికి రాజ్యం రాకుండా చేసింది ఆయన పినతల్లి కైకేయి. పాదుకా పట్టాభిషేకం జరిపించి, భరతుడు రాజ్యం ఏలాడు. (రామున్ని) పాదరక్షలు ప్రజల్ని పాలించినట్లా? రాముని పాదరక్షలు రాజ్యమేలితే, పాదముద్రలు పుణ్యక్షేత్రాలైనాయి! పవిత్ర స్థానాలైనాయి!

ద్వాపరయుగంలో ధర్మరాజు జూదమాడి రాజ్యాన్ని రెండవసారి కూడ పోగొట్టుకున్నాడు. ఉమ్మడి భార్యను కూడ పందెంలో ఓడి ఆడినమాట ప్రకారం అడవికి పోయాడు. అడవి జీవితానికి గడువు తీరి వారు తిరిగివస్తే, ఆడినమాట తప్పి,ఐదు వూళ్ళు కూడ నిరాకరించాడు దుర్యోధనుడు. కురుక్షేత్ర యుద్ధంలోగాని యీ రాజకీయం పూర్తి కాలేదు. దీనికి అంతకూ ముఖ్య సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్మ భాగోతం (మాయ రాజకీయం)

కలియుగంలో స్వదేశీ రాజుల స్వంత రాజకీయాలు విదేశీయులకు ఆహ్వాన పత్రికలైనాయి. పరాయివారి కిరాయి రాజకీయాలు కిరాతక రాజకీయాలను ప్రవేశ పెట్టాయి. స్వతంత్ర భారతదేశపు నేటి రాజకీయాలు పడుపువృత్తి కంటె దిగజారి పోయాయి!!!

బానిస దేశంలో బ్రతికే ప్రజలకంటె, దిగజారిన స్థితిలో 'జనం' రాజకీయానికి చెక్క భజన చేస్తున్నారు.

# ఒపీనియన్: 97

వేగంగా కదిలే మేఘాల మధ్య చిక్కుకుపోయిన వాయువు, అంత కంతకు సాంద్రత పెరిగిన కారణంగా, అంతకంటె వేగంగా తనను బంధించిన మేఘాన్ని తొలగించుకుని బయటకు రావడానికి ఆ వాయువుచేసే ప్రయత్న ఫలితమే ఉరుము. అంటె, అత్యధిక పీడనంతో మేఘాల మధ్య వాయువు వాటిని 'బరస్ట్' చేసుకుని బయటకు వచ్చిన ఫలితమే! అప్పుడు యేర్పడే శబ్దమే 'ఉరుము'. ఆ విధంగా బలవంతంగా బయటికి వచ్చే వాయువులోని అధిక పీడనం, మేఘంలోని నీటి ఆవిరి పరస్పర వికర్షణ ద్వారా పుట్టుకొచ్చే అత్యధిక ఉష్ణం, భూమి వాతావరణంలో ప్రవేశిస్తే, తత్ఫలితంగా కలిగిదే మెరుపు. అయితే శబ్దంకంటే, వెలుతురు వేగంగా ప్రయాణం చేస్తుంది గనుక ముందుగా కలిగిన ఉరుముకంటే, ఆ తరువాత యేర్పడిన మెరుపు మనకి ముందుగా కన్పిస్తుంది. పైపెచ్చు, ఉరుము మేఘాల మధ్య యేర్పడితే, మెరుపు భూవాతావరణంలో కలుగుతుంది. సూత్రరీత్యా ఈ రెండూ భూవాతా వరణంలోనే యేర్పడుతున్నా, రెండింటికి అంతరంవుంది.

# ఒపీనియన్: 98

అనంత విశ్వంలో ఎన్నో నక్షత్రమండలాలు నక్షత్ర మండలంలో అసంఖ్యాక నక్షత్ర కోటి. నక్షత్ర కోటిలో సూర్యుడు ఒక నక్షత్రం. సూర్యుని కుటుంబంలో భూగోళం ఒకటి. ఇది కొన్ని గ్రహాలకంటె చిన్నది, మరికొన్నిటికంటె పెద్దది. నక్షత్రంతో పోల్చితే భూమి ఎన్నో వందలరెట్లు చిన్నది.

భూమిపై నాల్గింట మూడు భాగాలు నీరు. ఒక వంతు భూమి ఐదు (ఆరు) ఖండాలు. ఖండంలో అనేక దేశాలు. దేశంలో అనేక రాష్ట్రాలు. రాష్ట్రంలో అనేక జిల్లాలు. జిల్లాలో అనేక గ్రామాలు పట్టణాలు. గ్రామాలలో ఎన్నో యిండ్లు, ఇండ్లలో కొన్ని గదులు, గదిలో ఒకచోట మానవజన్మ (ఏ జీవి జన్మయినా దాదాపు యింతే!)

మనిషి (జీవి) శరీరంలో ఎన్నో భాగాలు. ఒక భాగంలో ఎన్నో విభాగాలు. విభాగంలో ఎన్నో కణాలు. కణంలో ఎన్నో జీవాణువులు. జీవాణువులో కొన్ని విభాగాలు... ఇలా విభాగించి విశ్లేషిస్తే యింకా... యింకా... సూక్ష్మాతి రూపం...

జడపదార్థపు విభాగంలో విభజనంలో పరమాణువు కొంత గుర్తింపు కలిగినది. పరమాణు విభజన... మళ్ళీ విభజన... మళ్ళీ విభజన (చేయగలిగితే) మళ్ళీ విభజన... ఇలా వూహించలేని సూక్ష్మం. విశ్వరహస్యం, విజ్ఞాన సర్వస్వం, అందులో మనిషి స్థానం... చాల చిత్రం!!!

# ఒపీనియన్: 99

జాతిపిత మహాత్మాగాంధీజీ పుట్టినరోజు. ఇంకా ఎంతోమంది పుట్టినరోజు. అయినా గాంధీజీ పుట్టిన రోజుగ దీనిని గుర్తించడం జరుగుతోంది. ఇలాగే నెహ్రూ పుట్టిన రోజు ఆయన కూతురు పుట్టిన రోజు, రాముడు పుట్టిన రోజు, కృష్ణుడుపుట్టిన రోజు... పుట్టిన రోజులు కొన్ని పండుగలుగా చలామణి అవుతున్నాయి. నిజానికి ప్రతిరోజు, ప్రతినిమిషం, పుట్టిన ఆనవాలుగ కలిగివుంది. కోటానుకోట్ల జనం నిత్యం పుట్టిన రోజులు కలిగివున్నా, గుర్తు పెట్టుకునేవి కొన్ని మాత్రమే!

వలస పాలకులైన బ్రిటీషువారితో అహింసాయుత పోరాటం సాగించి, దేశానికి రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో మహాత్మా గాంధీ ప్రముఖ పాత్ర వహించడం చరిత్ర ప్రసిద్ధి. త్యాగం ఆధారంగా ఆయన ఆ కార్యం సాధించడం జరిగింది. దేశ ప్రజల సుఖం, దేశం అభివృద్ధి తద్వారా సాధించవచ్చునని ఆయన ఆశించడం జరిగింది. కాని, ఆయన 'త్యాగం' ఫలితంగా (ఆయనతోపాటు ఎంతోమంది త్యాగం చేయడం జరిగింది) దేశానికి వచ్చిన స్వాతంత్ర్యాన్ని ఆయన వారసులం అనుకుంటూ, ఆ తరువాత వారు ఆ స్వాతంత్ర్యాన్ని, దానితో పాటు దేశసంపదను, ప్రజల కష్టార్జితాన్ని 'స్వాహా' చేయడం ప్రారంభించి, మహాత్ముణ్ణి మర్చిపోయారు.

# ఒపీనియన్: 100

మంచితనం, మానవత్వం, సంస్కారం, సానుభూతి మనిషికి వుండవ లసిన ముఖ్య లక్షణాలు. అయితే 'నాగరిక ప్రపంచం' దృష్టిలో యివి అసమర్థుడి గుణాలు. మంచితనానికి బదులు వంచన, మానవత్వానికి బదులు దోపిడీతత్వం సంస్కారానికి బదులు స్వార్థం, సానుభూతికి బదులు కపట నటన ప్రతి మనిషికి వుండవలసిన కనీస లక్షణాలుగ గుర్తింపు జరుగుతోంది. మనిషి మనిషిని వేటాడడం వినోదం, నిత్యకృత్యంగా అమలు జరుగుతోంది. ఈ వేటలో ఓడిపోయేవాళ్ళు ఒక మేరకు విజయం పొందేవాళ్ళు కొందరు వుండగా, వేటగాళ్ళ దాడికి బలైపోయే అమాయకుల సంఖ్య అత్యధికం.

మనుష్యుల్లోను (ప్రజలను) వేటాడే వేటగాళ్ళు అనేక పేర్లు పెట్టు కుంటారు. అందుకు తగిన ఆయుధాలను, అవసరమైన యితర సరంజామాను ఎప్పటికప్పుడు, అధునాతన పద్ధతులలో సమకూర్చుకుంటూ, 'వేట' తీరుతెన్నులను మార్పు చేసుకుంటున్నారు. ఒక్కొక్కసారి వేటగాళ్ళ మధ్య 'పోటీ' వస్తుంది మరోసారి 'రాజీ' వుంటుంది. ఏమైనా ఏదో పేరున, అందరూ కలిసి ప్రజల్ని బలితీసుకుంటున్నారు.

రాజకీయం, మతం, సంఘసంస్కరణ, ఇజాలు – ఈ మాదిరిగా అనేకపేర్లతో వేటగాళ్ళు గ్రూపులుగ చీలి, ప్రజలను వేధిస్తూ, సాధిస్తూ వుంటారు. వారిని బలి తీసుకుంటూ వుంటారు.

# ఒపీనియన్: 101

జీవ పరిణామంలో మనిషి చివరిదశ. అందుకు, ముందు జరిగిన జీవ పరిణామంలో ఎన్నో 'రకాలు' జీవులు యేర్పడినాయి. భౌతిక పరిణామం మనిషితో పూర్తయినట్లే!

మానసిక పరిణామం మనిషి దగ్గరనుండి ప్రారంభమౌతుంది. (జీవ) భౌతిక పరిణామంలో అనేక దశలు యేర్పడుతూ, వివిధ రకాల జీవులు వునికిని పొందినట్లే, మానసిక పరిణామం మనిషి దగ్గరనుండి ప్రాథమిక దశతో ప్రారంభమై పరిణామక్రమంలో వివిధ దశలను, అందుకు తగిన స్థితిని పొందుతూ దాని స్వరూప స్వభావం బహిర్గతమౌతూ వుంటుంది.

జీవ పరిణామానికి ముందు (జడం) పదార్థ పరిణామం కూడ యిలాగే వివిధ దశలను, స్థితి గతులను, స్వరూప స్వభావాన్ని కలిగి వుంది. దానికి ముందు 'శక్తి' పరిణామం యిదేరీతిలో జరిగింది స్థూలంగ ఆలోచిస్తే! దాని వివరణ ఎంతో వుంటుంది. నిజానికి శక్తి పరిణామ స్వరూప స్వభావం పదార్థ, జీవ పరిణామాలకు పూర్తిగ భిన్నమైంది సూత్రరీత్యా.

అంటే, శక్తి పరిణామం, పదార్థ పరిణామం, జీవపరిణామం, మానసిక పరిణామం–ఇలా వివిధ పరిణామ ఫలితం సృష్టి.

# ఒపీనియన్: 102

స్వార్థ త్యాగ ఫలితంగా వచ్చిన (రాజకీయం) స్వాతంత్ర్యం స్వార్థ పరుల చేతులలోపడి వ్యర్థమైపోయింది. దోపిడీకి మరో అర్థంగా అది తారుమారైంది. సంఘ ద్రోహులు, పెట్టుబడిదార్లు, సమాజాన్ని దోపిడీ చేసేవారు, దాడి చేసేవారు, పరిపాలకులైనారు. ప్రజల సొమ్మును వేలాది కోట్ల మేరకు 'పానకాల స్వాముల' వలె స్వాహా చేస్తూ, ప్రజా సేవకులుగా ప్రచారం చేసుకుంటూ దేశాన్ని దగా చేస్తున్నారు.

ప్రజాస్వామ్యం ముసుగులో ప్రభుత్వాధికారం కొద్దిమంది 'రాక్షసుల' చేతులలో కేంద్రీకృతమై, నియంతృత్వాన్ని, రాచరికాన్ని మించిపోయింది పరిపాలన. సోషలిజం పేరుతో సంపద యావత్తు పెట్టుబడిదార్ల పెట్టెలలోకి పోయింది. కలియుగ కుబేరులు అనేకమంది తయారైనారు. గంజికి గతిలేని కోట్లాది ప్రజలు రాజకీయ నాయకుల ఇంద్రజాలం, మాయాజాలంలో మునిగి, 'బట్టలో పేలాలు' రుచి చూశారు. దేశం లోని 'మేధావులు' వెధవలై, దేశాన్ని అన్ని రంగాలలోను సర్వ నాశనం చేసిన రాజకీయ నాయకులు మానవ జాతికే కళంకం. దేశ చరిత్రకే తీరని మచ్చ!

# ఒపీనియన్: 103

ఉన్నదానిని (ఉనికిని) వదిలేసి, లేనిదానిని (ఊహ) ఉన్నట్లుగా, పైపెచ్చు అదే వాస్తవమైన దానిగ భావించి, ఆరాధించడం, ఆశించడం ఆస్తికత్వానికి ఆధారం. అంటె, ఆనవాయితీగా, అలవాటుగా వస్తున్న 'ఊహను' వాస్తవాలైనట్లు భ్రమించి, భావించి, ఆశించి, ఆరాధించి, ఆ మేరకు వ్యక్తిత్వాన్ని అసలు వాస్తవాన్ని విస్మరించడం ఆస్తికత్వం ద్వారా జరుగుతున్న అపకారం. మానవుని మేధస్సును మట్టికంటె హీనంగ భావించడం యిందులో మరో విశేషం. బుద్ధికి తెలియని దానిని ప్రతిదీ దైవత్వంగా భావించడం మరో బలహీనత. మానసిక వికార విశేషాలను దైవలీలలుగ భావించడం, అట్టి దానిని ప్రదర్శించే గారడీగాండ్లను గాడ్‌మెన్‌గా భావించి, భజనలు చేయడం మనిషి చేసే మరో నీచకార్యం. మనుష్యులులో యీ బలహీనతను ఆధారంగా చేసుకుని, స్వార్థపరులు ప్రచార సాధనాలుగ తయారైన బాబాలను, స్వాములను, అవతార పురుషులుగా తయారుచేసి, మూఢజనాన్ని బుద్ధిహీనులుగ మార్చడం ఆధ్యాత్మిక భావనతో పేరుతో సాగే బడా వ్యాపారం.

బాబాలు, స్వాములు, అవతారాలు ఎవరికివారే 'దేవుని'గా ప్రచారం చేయించుకుంటూ, పూజలందుకుంటూ ఆ మేరకు ఒకర్ని మరొకరు పనికిమాలిన వారుగ నిరూపించుకుంటున్నారు. ఇంతకూ అందరూ గారడీ గాడిదలే!!

# ఒపీనియన్: 104

మనిషి జీవిత విధానం, అతని 'శీలాని'కి సంకేతం. జాతి జీవిత విధానాన్ని సంస్కృతి అని అంటాం. అంటె, ఒక దేశంలో మొత్తం ప్రజల జీవిత విధానంగాని, లేక ఒక జాతి వర్గ విభాగాలకు చెందిన వారి జీవిత విధానంగాని, సంస్కృతి అని చెప్పాలి. మానవుల సజీవ జీవన విధానాన్ని సంస్కృతి అని, పిలవవచ్చు ఇది అనేక విధాలుగ వుంటుంది. అంతమాత్రాన ఒకటి మరొకదానిపై శాశ్వతంగ వున్నత మైనదని చెప్పడానికి వీలుండదు. ఒకానొక జీవిత విధానం లేదా సంస్కృతిలోని 'సజీవతం' ప్రగతి తత్వం, క్రాంతి విధానం దాని ఔన్నత్యానికి గీటురాయి. ఈ ఔన్నత్యపు ఔచిత్యం కలకాలం స్థిరంగా వుండదు. 'మార్పు'కి లోను కావడం సహజంగా జరుగుతూ వుంటుంది.

భారత సంస్కృతి చాల ఉత్కృష్టమైనదని కొందరి భావం కావచ్చు. అలాగే, ఇతర సంస్కృతులు కూడ, వేటికవే అలాటి భావాలను కలిగి వుండవచ్చు. కాని,ఒకే సంస్కృతి అన్నిటికి ఆదర్శమైనట్లు అన్ని కాలాల లోనూ వుంటుందనుకోవడం, అతిశయోక్తి మాత్రమే! సహనం, సహ జీవనం సంస్కృతికి అవసరం కావాలి. సజీవత్వం దానికి మార్గదర్శకం కావాలి.

# ఒపీనియన్: 105

సృష్టి, జీవ పరిణామాన్ని గురించి యింతవరకు మనిషికి తెలిసింది నిజానికి చాలా తక్కువ. ఆ తెలిసిన దానిలో కూడ అత్యధిక భాగం వాస్తవ విరుద్ధం, ఊహా జనితం. సృష్టిసంబంధమైన, విశ్వ పరిణామ సంబంధమైన జ్ఞానం తెలుసుకోడానికి యింకా ఎంతో దూరం విజ్ఞాన శాస్త్రం ప్రయాణం చేసి, పురోగమించవలసి వుంది. కాని, నేటి మనిషి, యిప్పటికే సృష్టి రహస్యం చాలావరకు, దాదాపు పూర్తిగ తెలిసినట్లు భ్రమించడం జరుగుతుంది. ఇది మనిషి అజ్ఞానానికి మచ్చుతునక.

అయితే విజ్ఞాన విషయానికి సంబంధించి ఆలోచిస్తే, నేటి మానవుడు నమ్ముతున్న జీవపరిణామ సూత్రం చాలా లోపభూ యిష్టంగా వుంది. అయితే డార్విన్ లాంటి ప్రముఖులు ప్రతిపాదించిన జీవపరిణామ సిద్ధాంతం పూర్తిగ తప్పు అని అనడానికి అవకాశం లేదు. భౌతిక పరిణామం పరిశీలిస్తే అది పరిణామ సూత్రానికి చాలా దగ్గరగా వుంది. కాని, సృష్టి, విశ్వం మొదలైన విషయాలకు సంబంధించి, విజ్ఞాన విశాల భావంతో, యోచన చేస్తే పరిణామ సూత్రం అందులో ఒక అంశం మాత్రమే! విశ్వరహస్యం జీవపరిణామ సూత్రానికి చాలా భిన్నమైనది. సృష్టి రహస్యం (జీవి సంబంధమైనది) జీవ పరిణామ రహస్యంకు అన్వయం కావచ్చు.

# ఒపీనియన్: 106

ఆస్తికత్వం (మతం) అవినీతిని, ప్రజాస్వామ్య రాజకీయం స్వార్ధాన్ని దోపిడీని ప్రోత్సహిస్తున్నాయి. ఒకవిధంగా చెప్పవలసివస్తే అవినీతికి, స్వార్ధానికి, మతం, రాజకీయమే ప్రధాన కారణం అని చెప్పవలసి వస్తుంది. ఈ రెండింటిని అదుపుచేసి, సంస్కరించకపోతే, వ్యవస్థ యింతకంటె నాశనమై, మనిషి మనుగడకే ముప్పు రావచ్చు. ప్రస్తుతస్థితి యిలాగే కొనసాగితే సమీప భవిష్యత్‌లో, ఆటవిక జీవితం ప్రారంభమై, చరిత్ర తిరోగమించి, పునరావృతం కావచ్చు.

(రాజకీయ) నాయకులు అంటె నాశనకారులుగ, మతకర్తలు, ప్రము ఖులు, ప్రచారకులు అంటె, మనిషి మేధస్సును మట్టిగా మార్చే గారడీ వాళ్ళని అర్ధం చెప్పుకోడానికి వీలుంది. ఈ పరిస్థితి యీనాటికి కాక పోయినా, అది తీవ్రస్థితికి చేరడం నేటి కాలంలో జరిగిందని చెప్ప వచ్చు. సాంఘికంగా ఆలోచిస్తే స్త్రీకి శీలం పోయింది, పురుషునికి పుంసత్వం తగ్గింది. వ్యభిచారం ఆచారమైంది. విచ్చలవిడిగ సిగ్గు బిడి యం మానేసి సంచరించడం నాగరికత, సంఘ పురోభివృద్ధికి సంకేత మైంది. వావివరుస, వయస్సులతో నిమిత్తం లేకుండా వ్యభిచారం, స్వేచ్ఛగా సాగుతోంది. కుటుంబ వ్యవస్థ ఆటవిక స్థితికి చేరుతోంది. పశువుకి మనిషికి బ్రతుకు పద్దతిలో భేదం కన్పించడం లేదు – ఫ్యాషన్, భాష, వేషం తప్ప.

# ఒపీనియన్: 107

దేవుడు అంటేనూ, దేవుడి తాలూకు వాళ్ళమని చెప్పుకునే బాబాలు, స్వాములు, గురువులు తదితరమైన ఆ బాపతు చిల్లరమల్లర దగారాయు ళ్ళంటేనూ నాకు పరమ అసహ్యం. అలాంటివాళ్ళను గురించి వినవలసి వచ్చినా, చూడవలసివచ్చినా, ఆలోచన చేయవలసివచ్చినా నాకు ఎంతో చికాకు వస్తుంది.

'పాపం' అనేది ఏదైనా వుంటె (భౌతిక అర్థంలో లేక సాంఘిక భావంలో) దీనికి ప్రత్యక్ష రూపు దాల్చినవారు బాబాలు అండ్ కంపెనీ, సంపన్నులు, రాజకీయవాదులు, సంఘ ద్రోహులు ప్రజల్ని ఏదో ఒకవైపు (కొంతకాలానికైనా తిరిగి పూడ్చుకోడానికి వీలైనరీతిగ) నాశనం చేస్తోంటే, మతానికి చెందిన దోపిడీ దొంగలు (మత్తుమందు అమ్మేవారు) మనిషి మనస్సుకే 'మైకం' కలిగించి, మనిషిని మొత్తంగా సర్వనాశనం చేస్తూ, ఆ వునికికే అర్థం లేకుండా చేస్తున్నారు. వీరి ద్వారా సంఘానికి, మనిషికి కలిగే హాని, కీడు జీవితాంతం ఏ విధంగానూ సరిచేసుకోవ డానికి వీలులేనిది. నిజానికి మనిషి బాహ్యజీవితానికి రాజకీయం, అందులో భాగస్వామ్యులైన ధనస్వాములు, భూస్వాములు, సంఘ ద్రోహులు కారణమైతే మనిషిమొత్తం జీవితానికి ఆధారం కావలసిన, మనస్సును మట్టిగా మార్చి ఘోరాతి ఘోరమైన 'పాపం' చేస్తున్నారు. ఆధ్యాత్మిక స్వాములు, సృష్టికి ద్రోహులు.

# ఒపీనియన్: 108

దైవభక్తి, రాజభక్తి భారత సంస్కృతిలో ముఖ్యమైన భాగం. ఇందులో అత్యధిక భాగం మూఢత్వం మిళితమై వుండడం ముఖ్య విశేషం. విచక్షణా జ్ఞానాన్ని, ఆలోచనకు ఏ మాత్రం అవకాశంలేని మూఢత్వం యిది. చరిత్ర నేర్పే అనుభవం కూడవారి భక్తి విశేషాన్ని కొంచెం కూడ మార్చలేదు.

విజ్ఞానశాస్త్రం అభివృద్ధి మానవ జీవిత విధానాన్ని అనేక పద్ధతులలో మార్చి వేస్తోంది. ప్రకృతి రహస్యాలను, సృష్టి రహస్యాలను అనంత విశ్వ రహస్యాలనుతెలియజేసే కృషి కొనసాగుతోంది. ఆ మేరకు ప్రపంచ మానవులలో వారి ఆలోచనావిధానంలోనూ, జీవిత పద్ధతిలోనూ మార్పు తెస్తోంటే, భారతీయులలో 'భక్తి భావం' మూఢత్వాన్ని ముది రేలా చేస్తోంది. మెదడుతో పనిలేని విధంగా జీవితం సాగిపోతోంది. ఆలోచనలేని మనిషి భక్తికి, విచక్షణలేని సాహిత్యంతోడై, మనుష్యులను  పశుప్రాయులు మృగప్రాయులు కంటె హీనంగ చేస్తోంది. నేటి పరిస్థితికి మతం, రాజకీయం వ్యాపారస్తుని కల్తీసరుకు, నకిలీ వస్తువును పోలినవిగా తయారైనాయి.

మతం – రాజకీయం భారతదేశానికి సంబంధించినంతవరకు అతి నీచస్థితికి దిగజారి మనిషిని మానసికంగా అనాది మానవుని దగ్గరకు నేటి 'నాగరిక' మనిషిని తీసుకుపోయింది.

# ఒపీనియన్: 109

మతానికొక 'దేవుడు', హిందూమతానికి అనేకమంది దేవుళ్ళ, దేవతలు. గ్రీకు, ఈజిప్టు మొదలైన అతి ప్రాచీన దేశపు మతాలకు అనేకమంది చిల్లరదేవుళ్ళు దేవతలు వున్నప్పటికి హిందూ మతం ఆ విషయంలో ప్రథమస్థానం.

'దేవుడు' అనే సంకుచిత పదం, మనిషి పరిమిత జ్ఞానానికి గుర్తు మాత్రమే! అలాటి దేవుడు మరెన్నో 'అవతారాలు' ధరించి, మనిషి బుద్ధిని, జ్ఞానాన్ని మరింత కుదించివేయడం, ఆలోచనగల వారికి, మానవ అభివృద్ధికి భవిష్యత్‌ను వూహించ గలవారికి ఆందోళనకర విషయం. కాలగమనంలో, పారిశ్రామిక అభివృద్ధితో మనిషి అజ్ఞానం మూఢత్వం క్రొత్త క్రొత్త రంగులను ప్రదర్శిస్తోంది. మనిషి అజ్ఞానపు మాయా రూపమే, 'నాగరికతగ' చలామణి అవుతోంది. ఇది 'కలియుగ మాయ'అని సర్ది చెప్పేవారు అజ్ఞానానికి  అంధకారానికి ప్రతినిధులు, మాత్రమే! నిజానికి నేటి 'నాగరిక ఆధునిక మానవుడు', బాహ్యంగా, భ్రమలో నాగరిక (విజ్ఞాన) మానవునికి కన్పిస్తూ అంతర్గతంగా (మానసిక జ్ఞానంలో) తిరోగమనంలో వున్నట్లు స్పష్టంకాగలదు. నానాటికి జ్ఞానం, విజ్ఞులు పరిమితమైపోవడం జరుగుతోంది ఇది యింతేనా?

# ఒపీనియన్: 110

వ్యక్తి ఘనత కోసం 'దేవుణ్ణి' వాడుకుంటూ, వెరైటీగా ప్రచారం సాగించుకునే  ఆస్తికత్వం, మరో కోణంలో అదే పని చేసే 'నాస్తికత్వం' దానిలోనే మరికాస్త వెరైటీ, స్పెషాలిటీ చూపించే హేతువాదం, యిలాం టివాటితో, ఆలోచనగల వారికి అసహ్యత కలుగుతుంది. ఏదో పేరుతో మనిషిని దోపిడీ చేయడం మానసికంగా ఖూనీ చేయడం తప్ప, ఆస్తిక, నాస్తికత్వాలతో వేరే ప్రయోజనం కలగడం లేదు.

ఆధ్యాత్మికంలోని సత్యాన్ని, భౌతికంలోని వాస్తవాన్ని, 'మనస్సు'లోని భ్రమని (మాయ) ప్రశ్నించి, పరిశీలించి, పరిశోధించే ఆలోచనే మనిషికి కలగడం లేదు  కలగనీయడంలేదు. తత్ఫలితంగా ప్రకృతిలో ఏ జీవిలో లేని మూఢత్వం, చాదస్తం, మూర్ఖత్వం మనిషిలో చేరుకున్నాయి. అన్నిటి కంటెమించి భ్రమ, ఆత్మవంచన మనిషికి సహజ లక్షణాలు అయినాయి. అందుచేత సత్యం వాస్తవాలకు భిన్నంగ జీవిస్తూ, ఆ జీవితాన్నే వాస్తవంగా భావించడం మనిషి జీవిలోని వింత.

జ్ఞానంతో వాస్తవాన్ని, సత్యాన్ని దర్శించాలనే తపన, తద్వారా ఎంతో కొంత సాధించి అందుకు తగినట్లు జీవితాన్ని సాగిస్తే, అలాంటివారు, లోకం దృష్టిలో పనికిమాలినవారుగ, అమాయకులుగ కనీసం బ్రతకడమే తెలియని అర్భకులుగ, భావిస్తుంది లోకం. అయితే లోకం స్వభావం తెలిసిన వారికి ఏ బాధ లేకపోయినా,ఎటూ కాని వారికి మనోవేదన తప్పదు.

# ఒపీనియన్: 111

ఫెడరల్ రాజ్యాంగంలో ప్రధానమంత్రికి సర్వాధికారాలు వుండాలా? రాజ్యాంగాధినేతగా, రాజ్యాధినేతగా పిలవబడే (రాజ్యాంగరీత్యా) రాష్ట్రపతి, ప్రధాన మంత్రి యిష్టానికి లోబడి ఒక కీలుబొమ్మగ వ్యవహరించాలా? పార్లమెంటు భవిష్యత్ ప్రధానమంత్రి చేతిలో వుండాలా? రాష్ట్ర ప్రభుత్వాల వునికి, వాటి భవిష్యత్ ప్రధానమంత్రి యిష్టం మీద ఆధారపడి వుండాలా? ప్రజాస్వామ్యంలో ప్రధానమంత్రి ఒక 'నియంతగ' వ్యవహరించే అవకాశం వుంటుందా? పార్లమెంటు 'సర్వాధికారం' న్యాయవ్యవస్థను దిగమ్రింగేదిగా వుండాలా? ప్రధానమంత్రికి యిష్టమైతే, రాచరికాన్ని ప్రవేశపెట్టే అవకాశం ప్రజాస్వామ్యం రాజ్యాంగంలో వుండవచ్చునా? పార్టీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వంగా చలామణి కావచ్చునా? రాజ్యాంగంలో అసలు స్థానమే లేని 'ప్లానింగ్ కమిషన్' (ప్రధానమంత్రి అధ్యక్షతన గలది) దేశాభివృద్ధిని నిర్ణయించే సర్వాధికారాన్ని కలిగి వుండాలా?

రాష్ట్రాల ఆదాయాన్ని ఖర్చు చేసే పద్ధతి, నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి వుండాలా? పరిశ్రమల పేరుతో పెట్టుబడిదారీ విధానాన్ని, పార్లమెంటు సర్వాధికారం పేరుతో ప్రధానమంత్రి నియంతృత్వాన్ని, రాష్ట్రపతి పాలన, ప్లానింగ్ కమీషన్ ద్వారా కేంద్రప్రభుత్వాన్ని 'యూనిటరీ'గా మార్చి, రాష్ట్రాలను ఏజెన్సీలుగా మార్చివేసే అధికారం ప్రజాస్వామ్య, పార్లమెంటరీ విధానంలో వుంటుందా? మన రాజ్యాంగాన్ని గురించి యివి కొన్ని ప్రశ్నలు మాత్రమే!

# ఒపీనియన్: 112

హిందువులతో మహమ్మదీయులు కలిసి జీవించే అవకాశాలు లేని కారణంగా, మహమ్మదీయుల కోసం హిందూదేశాన్ని విభజించి, పాకిస్థాన్ అనే పేరుతో ఒక ప్రత్యేక దేశం యేర్పడింది. నిజానికి మిగిలిన దేశాన్ని హిందూస్థాన్ అని పిలవవలసి వుంది. మౌలికంగా అయితే, మిగిలిన హిందూదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజ్యాంగం అమలుచేయడం ద్వారా, మత విధానంలో సెక్యులరిజాన్ని అంగీకరించడం ద్వారా హిందూస్థాన్‌కి బదులుగా 'భారత్' లేక ఇండియా అనే పేరు అమల్లో మిగిలింది. ఒక విధంగా యిది హిందూ దేశమే గదా!

హిందూ శబ్దం భౌగోళికంగా దేశానికి వుంది, మతానికి వుంది ఆ హిందూ మతం కోసం, దానిని అజమాయిషీ చేయడంకోసం ప్రభుత్వంలో 'దేవాదాయ ధర్మాదాయ శాఖ' అనేది ఒకటి ప్రత్యేకంగా వుంది. న్యాయ విధాయకంగా 'హిందూ కోడ్' అనేచట్టం స్వదేశీ పార్లమెంటు ద్వారా ఆమోదించబడి అమలు చేయబడుతోంది. దేశంలోని ప్రజలంతా భారతీయ హిందువులు (సాంఘికంగా) ఇండియన్స్‌గా పిలవబడుతున్నారు.

రాజకీయంగా జన సంఘంవారు, మత సాంస్కృతికంగా, ఆర్.ఎస్. ఎస్.వారుఈ దేశాన్ని "హిందూ రాష్ట్రం"గా స్థిరపరచడానికి కృషి చేస్తున్నారు. ఇది మతతత్వమా? మత మౌఢ్యమా?

# ఒపీనియన్: 113

నేరం చేసినవాడే 'శిక్ష' అనుభవించడం న్యాయసూత్రం లక్ష్యం. నేరం–శిక్ష ఒక దానితో ఒకటి కలిసే వుంటాయి. అయితే నేరంతో సంబంధంలేని శిక్ష అన్యాయం. ఇది కూడ ధర్మసూత్రమే! ఇది తెలిసి జరిగినా, తెలియక జరిగినా, మూలంలో 'పాపం', లేక అధర్మం క్రిందకే వస్తుంది.

మంచిగాని, చెడుగాని, పాపంగాని, పుణ్యంగాని, యీ మాదిరిగా 'కర్మ' (క్రియ) జరగాలన్నా శరీరం ముఖ్యమైన సాధనం. అయితే ఆ శరీరానికి భిన్నమైన స్వరూప స్వభావాలను కలిగివున్నదనుకునే 'ఆత్మ' శరీర కర్మకి ఎంతవరకు కారణం? అది కారణం అయినా కాకపోయినా, కర్మకి ప్రత్యక్ష నిదర్శనం శరీరమే! ఈ విషయాన్ని భౌతిక దృష్టితో ఏ కోణంలోనుండి పరిశీలించినా నిజమని ఋజువు అవుతుంది.

మరణం తరువాత 'ఆత్మ' సంగతి స్పష్టంగా అందరికీ తెలియదు. తెలుసును అనుకునేవారికైనా స్పష్టమైన దాఖలా ఏమీ లేదు. అందుకు సంబంధించి జరిగేదంతా వూహాగానమే! ఆత్మ సంగతి అలా వుంచితే, 'కర్మ'కి కారణమైన శరీరం, తత్ఫలితాన్ని అనుభవించాలి గదా! అలా జరగాలంటే 'మరణం' తరువాత అది సాధ్యం కాదు గదా!

స్వర్గ నరకాలు ప్రశ్నార్థకాలైనాయి???

# ఒపీనియన్: 114

అనుకూలత వుంటె (కృషిలో) అదృష్టం, ప్రతికూలతవుంటె దురదృష్టం. ఈ రెండింటితో నిమిత్తం లేకుండా సాగిపోయే జీవితం సాధారణం. అనుకూలత కృషితో నిమిత్తం లేకుండానే 'కలిసివస్తే' అదృష్టమని, కృషిద్వారా వచ్చే ఫలితం కలిసి రావడం అని కృషి పూర్తిగ విఫలమై, ప్రత్యేకించి వ్యతిరేక ఫలితాలు వస్తోంటే దురదృష్టమని మామూలుగ అనుకునే పద్ధతి. ఏమైనా, దృష్టం (కన్పించడం) కాని విధంగా, అనుకోని పద్ధతిలో ప్రయోజనం కలిగితే అదృష్టంగా భావించడం అనుకునేదానికి, చేసేదానికి పూర్తి వ్యతిరేక ఫలితం వచ్చేది దుర (చెడ్డ) అదృష్టము అనుకోవచ్చు.

అయితే కృషి క్రమం లోపరహితంగా వుంటె, ఫలితం తథ్యం అనేది ఒకటి వుంది. మార్గం సరైనదైతే గమ్యం చేరడం జరగాలి గదా! కాని ఒక్కొక్కసారిగమ్యాన్ని చేర్చే మార్గంలో ప్రయాణం చేసినా, గమ్యాన్ని చేరకపోవచ్చు. మార్గమధ్యలో అవాంతరాలు అందుకు కారణం కావచ్చు. కాశీ ప్రయాణంలో దారిలో మరణిస్తే, అదిఅసహజం కాదు. కృషిలోపం కాదు. మార్గం తప్పుకాదు. దీనికి మరో పేరు ఏదోవుండాలి.

అలాగే కృషి, దాని క్రమం సరిగా వున్నంత మాత్రాన తుది ఫలితం సంపూర్ణంగా వుంటుందని, వుండాలని అనుకోడానికి వీలుండదు.

# ఒపీనియన్: 115

అధికార కేంద్రీకరణ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక కేంద్రీకరణ సోషలిజానికి, కులం సెక్యులరిజానికి పారిశ్రామిక 'లాభం' తిరిగి పెట్టుబడిగా మారడం కార్మిక సంక్షేమానికి ముఖ్యమైన శత్రువులు. గ్రామ రాజ్యం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, ఆదాయ మార్గాలను అదుపు చేసి వారసత్వ హక్కును, పరిమితి విధించడం ద్వారా సోషలిజాన్ని,వృత్తి ప్రతిపాదన ద్వారా సెక్యులరిజాన్ని, పారిశ్రామిక లాభాన్ని సక్రమమైన పంపిణీద్వారా, ఆర్థిక దోపిడీని పెట్టుబడిదారీ విధానాన్ని అరికట్టడం ద్వారా ఆర్థికన్యాయాన్ని, శ్రేయోరాజ్యాన్ని స్థాపించవచ్చు. వృత్తి ప్రాతిపదికగా సంఘాన్ని విభజించి, శ్రమ విభజన ద్వారా జీతభత్యాలను సవరించి, 'ఆస్తి'కి సరియైన నిర్వచనం యిచ్చి దానిని అదుపు చేయడం ద్వారా (ఆదాయ దశలోనే) ప్రజలందరికీ జీవనధర్మాన్ని కలిగించి, ఆ ధర్మ రాజ్యాన్ని స్థాపించవచ్చు.

ఇలాటి 'రాడికల్' మార్పులు 'విప్లవం' ద్వారా మాత్రమే సాధ్యం అనుకోవడం పొరపాటు. నిజానికి సాయుధవిప్లవం, లేదా శాశ్వత నియంతృత్వం యిందుకుపూర్తి విరుద్ధం. వాటిద్వారా తత్కాలిక ప్రయోజనం 'అణచివేత' ద్వారా రక్తపాతం ద్వారా, క్రూర పాలన ద్వారా సాధించినప్పటికి అది శాశ్వతం కానేరదు. కొంతకాలం తరువాత ఆ నిర్బంధ విధానం వెర్రితలలువేసి, మొదటికి మోసం తెచ్చే ప్రమాదం వుంది.

# ఒపీనియన్: 116

పూతన రాక్షసి పాలు త్రాగి, దాని ప్రాణం తీసిన బాల కృష్ణుడు, జరాసంధుడితో పోరాడి పదిసార్లు, పారిపోయాడేమి? మాయ పనితో దొంగదారిగా వాడిని మరొకరి చేత మట్టుపెట్టించాడేమి? గోవర్ధనగిరిని గోటిపై నిలిపి గోరక్షణ చేసిన గోపాలుడు గాలివాన ఆపుచేయలేకపో యాడేమి? పరీక్షిత్తుని ప్రాణం పోసినవాడు, విశ్వరూపం చూపినవాడు, గోపిక స్త్రీ చీరలు కాజేసినవాడు, నిండు సభలో సిగ్గును పోగొట్టు కోబోతున్న ద్రౌపదికి చీరలు 'సప్లయి' చేసినవాడు, మాయ పాచికల గురించి మాట వరసకైనా చెప్పలేదే జూదగానికి (ధర్మరాజుకి) ఆడదానిని పందెంలో కాయవద్దని, చిన్న సలహా కూడ చెప్పలేదే! రామావతారంలో ఏకపత్నీవత్రుడై, కృష్ణావతారంలో బహు (అత్యధిక) పత్నీవ్రతుడకాక, ప్రైవేటు (పదహారువేలమంది) ఎస్టేటును మెయిం టెయిన్ చేశాడేమి ఆ విష్ణుమూర్తి. మానవులే ఏకపత్నీ వ్రతం కోసం చట్టాలు చేసుకుంటూ వుంటె, విష్ణుమూర్తి వ్యవహారం యిందుకు భిన్నంగా వుందేమో?అలాగే శివుడు విషయం పరిశీలించినా మనిషికి ఆదర్శ జీవితం మనం కొలిచేదేవుళ్ళనుండి వచ్చే అవకాశం లేదు. పురాణ వర్ణనల్ని దైవలీలలనుకుంటె, అది మనిషి మానసిక బలహీ నతలకు ప్రతిబింబం తప్ప మరొకటి వుండదు. సాంఘిక పరిణామానికి దేవుళ్ళ జీవితాలు మంచి ఉదాహరణలు చారిత్రక సాక్షాలు అనుకుంటె, అందులో కొంత అర్థం వుంటుంది. నా భావం యిది.

# ఒపీనియన్: 117

ఆస్తికత్వం, దాని స్వరూప స్వభావం ఏదైనా, అది దేవుడిని కీర్తి స్తుంది ధ్యానిస్తుంది. నాస్తికత్వం ఆస్తికత్వాన్ని వ్యతిరేకిస్తుంది. మితవాదం ఏదోవిధంగా 'మార్పు'ని నిరోధిస్తుంది. వామ (అతివాదం) వర్గతత్వాన్ని, పోరాటాన్ని ప్రేరేపిస్తుంది. అలాగే పెట్టుబడిదారి విధానం మతం– రాజకీయాన్ని స్వంతం చేసుకోవడంద్వారా సమాజాన్ని దోపిడీ చేస్తుంది.

అలాగే వ్యక్తిపరంగా ఆలోచించినప్పుడు సామాన్యుడు కానీయండి, నాయకుడు కానీయండి లేదా ప్రముఖుడు పండితులు కానీయండి వ్యక్తిత్వం ప్రధానంగా పని చేస్తుంది. అదే స్వభావాన్ని నిర్ణయించి, ప్రవర్తనను రూపుదిద్దుతుంది. అదే ఆవ్యక్తి నడవడికను, జీవితక్రమాన్ని నిర్దేశిస్తుంది. స్వార్థం సర్వస్వంగా భావించే 'తత్వం'గల వ్యక్తిత్వం దానికోసమే బ్రతుకును గడపడం జరుగుతుంది. సాత్వికతత్వం కానీ యండి, తమ నియంతృత్వం లేదా ఫాసిజం కానీయండి, కర్కశత్వం, కసాయితనం కానీయండి, త్యాగం–భోగం మరేదైనా కానీయండి ప్రధానమైన గుణం జీవితాంతం జీవితాన్ని నడుపుతుంది. అనుకూల వ్యతిరేక పరిస్థితులు అందుకు 'తత్కాలికంగా' ప్రభావాన్ని చూపినా, మూలం మారదు. అందుకే తనకోసం ఏదిఏమైనా ఫర్వాలేదు, సర్వనాశ నమైనా ఫర్వాలేదు, తన ధ్యేయం నెరవేరటమే ప్రధానమనుకోవడం అంతే!

# ఒపీనియన్: 118

విజ్ఞానశాస్త్రం విస్తరించినా, పారిశ్రామిక రంగం ప్రబలమైనా మనిషిలోని మితవాదం, మతవాదం ఏ మాత్రం తగ్గలేదు. పైపెచ్చు మానసిక దాస్యం, మూఢత్వం, చాదస్తం, మరింత ఎక్కువ మోతాదులో 'భక్తి' చాదస్తంతో మనిషి పనికిమాలిన జంతువుగా మారిపోవడం జరుగుతోంది. మాయా మాంత్రికులు, ఇంద్రజాలికులు, ప్రచారం గట్టిగా చేసుకోగలవారు 'దేవుడి అవతారాలు'గ చలామణి అవుతూ భక్తులు భజనలు, పూజలు అందుకుంటున్నారు. ప్రపంచజ్ఞానం లేని పరమ మూర్ఖులు సహితం, భక్త బృందాలను యేర్పాటు చేసుకుని, భజనలు చేయించుకుంటున్నారు రాజకీయ నాయకుల మాదిరిగా!

ఆధునిక నాగరికత ఎంతో ముందుకు పోతున్నట్లు, ప్రగతి మార్గంలో ప్రయాణి స్తున్నాను అనుకుంటూ, మనిషి పరమ మూర్ఖుడిగా బ్రతుకుతూ ఆత్మ వంచనచేసుకుంటున్నాడు. ప్రకృతి విశేషాలను, వింతలను, దైవలీలలుగ ప్రచారం చేయించు కుంటూ, భక్త గణాలను పెంచుకుంటున్నారు రాజకీయ ముఠాలను, రౌడీలనుపెంచినట్లు! 'కలియుగం'లో దేవుళ్ళ సంఖ్య, భక్త బృందాలు జాస్తి అయ్యాయి. నిజానికి మతం–రాజకీయం ఈ రెండు పరమ అసహ్యకరమైన స్థితికి చేరాయి ప్రస్తుత కాలానికి.

# ఒపీనియన్: 119

స్వదేశీతత్వం, కుటీర పరిశ్రమలు– గ్రామాభివృద్ధి– స్వయం సమృద్ధి– మహాత్మా గాంధీజీ దృష్టిలో దేశాభివృద్ధి. పారిశ్రామికాభి వృద్ధి–భారీ పరిశ్రమల స్థాపన (పెట్టుబడి ప్రోత్సాహం?) భారీ ప్రాజె క్టుల నిర్మాణం– విజ్ఞాన సాంకేతిక శాస్త్రాభివృద్ధి– ఇది శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ దృష్టిలో దేశాభివృద్ధి. వ్యవసాయం–దానికి అనుబంధమైన పరిశ్రమల అభివృద్ధి–శ్రీచరణ్‌సింగ్ దృష్టిలో దేశాభివృద్ధి. జాతీయ కరణ– కమ్యూనిస్టు సోషలిస్టుల దృష్టిలో దేశాభివృద్ధి. తన వంశ పాలన–శ్రీమతి ఇందిరాగాంధి దృష్టిలో దేశాభివృద్ధి–భారతదేశపు నాయకుల, పాలకుల దృష్టిలో దేశాభివృద్ధి. ప్రజాస్వామ్యం యిన్ని రకాలుగ వుంది. అన్ని బాపతుల దేశాభివృద్ధులను కలిపి ఆలోచన చేస్తే,"అదీ వుత్తదే! ఇదీ వుత్తదే!" అనేది స్పష్టమౌతుంది. పైపెచ్చు సామాన్య ప్రజలఅజ్ఞానాన్ని, అల్ప సంతోషాన్ని రాజభక్తిని దైవభక్తిని ఆధారంగా చేసుకుని, నోరుగలస్వార్ధపరులు నాయకులై, ఆకర్షణీ యమైన మోహినీ నినాదాలను ప్రచారం చేస్తూతమ తమ స్వార్ధాలను, ప్రయోజనాలను సాధించుకోవడం జరుగుతోంది యింతకాలం. ఆ మేరకు కోటానుకోట్ల ప్రజలు స్వదేశీ పాలకులు నాయకులు దగా, మోసం, దోపిడీ చేస్తున్నారు.

# ఒపీనియన్: 120

మరణించిన తరువాత మనిషి 'బ్రతుకు'ను గురించి బోధించేది మతం. ఇందులో ఏదైనా సాంఘిక ప్రయోజనం వుంటె, ఆ మేరకు ఆస్తిక మతాన్ని గురించి సంతోషించవచ్చు!

అయితే, మరణం తరువాత మిగిలేది ఏమిటి? 'ఆత్మ' అని ముక్తసరిగా చెప్పారు ఆస్తికులు. దాని 'బ్రతుకు' గురించే ఏదో చెప్పడం మతం చేసే పని. ఇంతకు, ఆ ఆత్మను గురించి, దాని బ్రతుకును గురించి ఆస్తికులంతా ఒకే తీరుగా చెప్పక పోవడం, పైపెచ్చు పరస్పర విరుద్ధంగా చెప్పి, ఒకరి దృష్టిలో మరొకరు 'నాస్తికులు'గా ఋజువు కావడం గమనార్హం.

దేవుళ్ళకి సంబంధించిన కథలు గాథలు పుట్టుపూర్వోత్తరాలు, పురాణాలు తద్వారా వర్ణించబడిన మహిమలు, లీలలు, దేవుళ్ళ 'జీవితాలు' జాగ్రత్తగ పరిశీలిస్తే, ఆయా దేవుళ్ళు జన్మించిన (తయారైన) సమయానికి లేదా కాలానికి సంబంధించిన సాంఘిక స్థితిగతులు, మనిషి మానసిక (అ) పరిపక్వత స్పష్టమౌతుంది. మనిషి అజ్ఞానం, అసంపూర్ణత నుండి స్వరూప స్వభావాలను పొందిన సాంఘిక పరిణామ దర్పణం 'దేవుడు'.

మనిషి విజ్ఞానశాస్త్రం ద్వారా అభివృద్ధి చెంది సృష్టి, ప్రకృతి, విశ్వం రహస్యాలు తెలుసుకోగల స్థితిలో కూడ దేవుడి గిరాకీ వుంది!!!

# ఒపీనియన్: 121

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని యేర్పాటు చేసి, ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచే పథకాలను అమలు చేయాలని ఆనాటి నాయకులు, ముఖ్యంగా స్వాతంత్ర్య పోరా టంలో చిత్తశుద్ధి త్యాగబుద్ధిగల నాయకులు అనుకునేవారు. అలాటి వారిలో బహుశా మహాత్మాగాంధి ఆఖరివారు కావచ్చు!

ఆయన రాజకీయ వారసుడు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ స్వదేశీ పాలన ప్రారంభించిన తరువాత, ఆయన సలహా సమ్మతి మేరకు తయారైన రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత, దాని నీడలో పెట్టుబడిదారీ విధానం పెరిగిపోవడం ప్రారంభించి, సంపద కేంద్రీ కరణ జరిగింది. ప్రజాస్వామ్యం పేరుతో ఎన్నికలు జరిపి, ప్రజలచేత ఓట్లు వేయించుకోవడం తప్ప, ప్రజలకు పరిపాలనకు సంబంధం లేకుండాపోయి, ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ చేతిలో పాలనా యంత్రాం గం యావత్తు కేంద్రీకరించ బడింది. ఆయన ప్రణాళికా విధానంలో భారీ పారిశ్రామికరంగం కారణంగా స్వదేశీ పెట్టుబడిదారులు కుబేరులై పోయి, దేశం గరీబులకు నిలయమై పోయింది. సంపద, దారిద్ర్యం దేనికదే విపరీతంగా పెరిగిపోయాయి.

# ఒపీనియన్: 122

సాధారణంగా 'మేధావులు కార్యశూరులు కారు' అనేది అనుభవం ద్వారాతేలే వాస్తవం. అయితే, కార్యశూరులంతా మేధావులుకారా? అనేది ఒక ముఖ్యమైనప్రశ్న. ఎక్కువమందిలో కార్యశూరత్వం మేధావి తనం మమేకం అయివుండదు. ఈ రెండూ మేళవింపుగ కలిగిన వ్యక్తులు చరిత్రలో చాలా అరుదు. అయినా ఆరెండు లక్షణాలలో ఏదో ఒకటి ఆధికత్యతను కలిగి వుంటుంది.

అయితే మేధావుల మేథస్సు, కార్యశూరుల సామర్థ్యం పూర్తిగ సద్వినియోగమౌతోందా అంటే, అది ఎన్నటికీ జరగదు. అజ్ఞాతంగా అనామకంగా జీవితాలు చాలించే మేధావులు ఎంతోమందివున్నా, ఆ మేరకు వారి మేథాసంపత్తు వృధా అవుతోంది. అలాగే సామర్థ్యంగల కార్యశూరులు, ఎందరో తగిన అవకాశాలులేక 'అదృష్టం' కలిసిరాక, అణగారిపోయి, చరిత్ర హీనులయే వారు ఎందరో వున్నారు. ఆ మేరకు వారి కార్యశూరత్వం, సామర్థ్యం, వ్యర్థం అవుతోంది.

అలాగే మేధావులుగ కార్యశూరులుగ ప్రచారం పొంది, గుర్తింపు కలిగి, కీర్తించబడేవారిలో అత్యధికులు అదృష్టవంతులైన అసమర్థులే! పనికిమాలినవారు నీతి మాలినవారు ఎందరో మహామేధావులుగ కార్యశూరులుగ చరిత్రలో స్థానం పొందుతున్నారు! మానవ చరిత్రలో యీ భాగమే ఎక్కువ.

# ఒపీనియన్: 123

భారతదేశంలో రాజకీయం బ్లాక్‌మార్కెట్ అయింది. నిత్యావసరం మార్కెట్ మాయాబజార్ అయింది. రాజకీయ నాయకులు దళారులుగ, దివాళాకోరులుగ, దగాకోరులుగ మారిపోయారు. పెట్టుబడిదార్లు, పెద్ద పెద్ద వ్యాపారులు, ప్రభుత్వాన్ని నడిపే 'నపుంసకుల' నరహంతకుల సలహా సహకారాలతో 'పిండారీలు'గ గండ భేరుండ పక్షులుగ తయారై పోయారు. పగటి వేషగాళ్ళుగ 'ప్రజాసేవకులుగ', నీతి మాలిన దేశ సేవకులు, సిగ్గు బిడియం వదిలేసిన 'సంఘసేవకులు' దేశం నిండా నీటిలో నాచుగ ప్రాకిపోయారు  పెరిగిపోయారు.

నూరు బంకులు బంకి ఒక పెళ్ళి చెయ్యమన్నారు. వెయ్యి అబద్ధాలు ఆడిఒక గుడి కట్టమన్నారు. ఇది ఏనాటినుండో ఆచారంగా, అలవాటుగా వస్తున్నదే! అయితే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత లక్షమాయలు, కోటి కక్కుర్తి పనులుచేసి పదవి పొందడం రాజకీయ మర్యాద, నాయకుడి ఘనతగా మన సంస్కృతి, నాగరికత అభివృద్ధి చెందింది.

మధ్యంతర ఎన్నికలు నాయకుల మాయ ముసుగులు  తొలగించి, ఒరిజినల్ వికార రూపాలతో బయటపడినా, వారి స్వరూపాలను స్వభావాలను గ్రహించేస్థితిలో ప్రజలు లేరు.

# ఒపీనియన్: 124

బానిసత్వం, బానిసతత్వం జీర్ణించుకుపోయి, దానినే సంస్కృతిగా భావించి,ఆచరించే ప్రజలకు 'ప్రజాస్వామ్యం' స్వతంత్ర పాలన పనిచేస్తుందా అనేది చాలాముఖ్య మైన ప్రశ్న. 'కృషి'కి కర్తలు కాగలిగిన ప్రజలకు సరిపోయే ప్రజాస్వామ్యం 'కర్మ' బంధాలు అయ్యే జనానికి ప్రయోజనకరంగా వుంటుందా? పాలకులు దైవాంశ సంభూతులు అనుకునే ప్రజలకి ప్రజాస్వామ్యం ఏ విధంగా పని చేస్తుంది? అలాటి ప్రజలు ప్రజాస్వామ్యంలో "వ్యక్తి ఆరాధనను" అలవాటు పడడంలో ఆశ్చర్యం ఏముంటుంది? 'కర్మ' బ్రతుకును నిర్ణ యిస్తుందనుకునే బుద్ధిహీనులకు, పాలకుల మోసాన్ని, స్వార్థాన్ని ఏ విధంగా గ్రహించగలరు?

అందుకే భారతదేశంలో 'ప్రజాస్వామ్యం' పనికిమాలిన వ్యవస్థను తయారు చేస్తోంది. దగాకోరులు, దోపిడీదారులు, సంఘద్రోహులు నాయకులు, పాలకులు కాగలుగుతున్నారు. ఇలాంటి వారిద్వారా నరకయాతన అనుభవించినా కూడ బుద్ధి రాని ప్రజలు, బానిసమూక, మళ్ళీ వారినే ఆరాధించి, అధికారాన్ని కట్టబెట్టడానికి సిద్ధమౌతున్నారంటె, అలాటివారి వ్యక్తిత్వం, చైతన్యం అభివృద్ధి ఊహకందని వింతగా వుంటుంది.

కర్మ బంధీలైన మానసిక బానిసత్వంలో బ్రతకడం మాత్రమే తెలిసిన ప్రజలకు ప్రజాస్వామ్యం పరిస్థితిని మరింత నీచస్థితికి తీసుకుపోతుంది. రాజును సేవించుకుని జీవించే ప్రజలకు రాచరికమే శరణ్యం. వారి క్రూరత్వమే తగిన పరిహారం. బానిసత్వమే భారతీయులకు తగిన బ్రతుకు విధానం???

# ఒపీనియన్: 125

"దేవుడు ఉన్నాడా అండీ?" ఒకని ప్రశ్న

"ఎక్కడండీ?" నా ప్రశ్న.

"ఎక్కడైనా, అసలు దేవుడనేవాడు వున్నాడా లేక మనిషి ఊహ మాత్రమేనా?"

"ఎక్కడైనా అని అనుకుంటే, ఉన్నాడు లేడు అని ఏదైనా చెప్పుకోవచ్చు. దేనికీ ప్రత్యేక వునికి ఆధారం వుండదు. అలాకాక 'ఫలానా' చోట అని అనుకుని ఆలోచన మొదలెడితే సమాధానం మరోవిధంగా వుంటుంది. పరిమితంగానైనా, సంక్షిప్తంగా నైనా లేదా పాక్షికంగానైనా అందుచేత మీ ప్రశ్న యూనివర్సల్‌గా వేస్తే సమాధానం కూడ స్పష్టమైన స్వరూప స్వభావాలు లేకుండా వుంటుంది" నా సమాధానం.

"ఫలానా చోట అని అనుకుంటె వచ్చే సమాధానం దేవుడికి ఎలా సంబంధం వుంటుందండీ?" ఆయన ప్రశ్న!

"దేనికి సంబంధం వుంటుందంటారు?"

"అది ఒక మనిషికి మాత్రమే సంబంధం వుంటుందని నా భావం." "మనిషికే కాదు. పదార్థానికి సంబంధం కలిగి వుంటుంది. ఉనికిని కలిగివున్న దానికి పరిమిత హద్దులు వుంటాయి. కాలం దూరం పరిమితిలో వున్నదంతాపదార్థమే! దేవు'డు' అనే భావం యీ పరిమితి లోనే ఆలోచన చేస్తే అది పదార్థానికి భిన్నం కాబోదు" నా సమాధానం విని వివరణ కోసం మరోసారి వస్తానని వెళ్ళిపోయాడు.

# ఒపీనియన్: 126

పారిశ్రామికాభివృద్ధి (పట్టణాభివృద్ధి) ద్వారా భారతదేశాన్ని అభివృద్ధి చేయవచ్చిన కొంతమంది నాయకులు, అందుకు సంబంధించిన పార్టీల విధానం ప్రచారం చేసుకుంటూ వుంటారు. అలాకాక వ్యవసాయాభివృద్ధి (గ్రామాభ్యుదయం) ద్వారా మాత్రమే దేశం బాగు పడుతుందని, రైతు అభివృద్ధే దేశాభివృద్ధి అని మరికొందరి నమ్మకం. వారు అందుకు తగిన ఆలోచనలను విధానాలను ప్రచారం చేస్తూ వుంటారు. అలాగే జాతీయకరణ ఆర్థిక విధానం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని మరికొందరి నమ్మకం. ప్రైవేటు పెట్టుబడిదారీ విధానం ద్వారా దేశం ఎంతో అభివృద్ధి లోకి వస్తుందని కొందరి నమ్మకంకాగా మిశ్రమ ఆర్థిక విధానమే భారతదేశానికి అనుకూలమైన పద్ధతిగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం భారత ఆర్థిక విధానం యీ పద్ధతిలోనే జరుగుతోంది.

ఈ విధంగా ఒక విధానం నచ్చిన వారి దృష్టిలో మరొక విధానం అభివృద్ధి నిరోధం. ఆ విధంగా అన్ని పద్ధతులను ఆలోచన చేస్తే మొత్తం అభివృద్ధి నిరోధకమే! పాక్షిక రహితంగా ఆలోచన చేస్తే, ఈనాడు భారతదేశంలో ప్రచారమయ్యే విధానాలు అధికారం పొంద డానికి ప్రజలను మోసం చేసి ఓట్లు కాజెయ్యడానికి వుపయోగించే వెరైటీ విధానాలేతప్ప దేశాభివృద్ధి, ప్రజాక్షేమం పూజ్యం!!!

# ఒపీనియన్: 127

క్రిమినల్ కేసులో కఠిన శిక్ష విధించబడినవారు, ప్రజాప్రాతినిధ్యం కోసం కేంద్ర శాసనసభకు (పార్లమెంటుకు) పోటీ చేయవచ్చునా? అలాటి వారు తమకు విధించిన శిక్షపైన పై కోర్టుకు అప్పీలు చేసుకుని వుంటె, అంతమాత్రాన క్రింది కోర్టులో ఋజువైనవారి 'నేరం' రద్దయి నట్లేనా? ఒకవేళ క్రింది కోర్టులో ముద్దాయికి మరణశిక్ష విధించినా వారు పైకోర్టుకు 'అప్పీలు' చేసుకుంటె, వారుకూడ ప్రజా ప్రాతినిధ్యం కోసం ఎన్నికలలో పోటీ చేయవచ్చునా? వారి మరణశిక్ష అమలు జరిగేవరకు వారు నేరస్థులు కానట్లేనా? న్యాయస్థానం తీర్పు 'అప్పీలు'కు లోబడిపోయి, అమలుజరగక పోగా, ఆ కోర్టు విచారణలో ఋజువైన 'నేరం' అర్జీలు అమలులో వున్నంతకాలం నేరం కాకుండా పోతుందా? కొన్ని సంవత్సరాలపాటుగాని, కొద్దికాలం పాటుగాని, ఒకానొక కేసు విచారణ జరిగి, ప్రాసిక్యూషన్‌వారు నేరం ఋజువుచేసి, ముద్దాయిలకు శిక్షపడిన తరువాత, ఆ మాదిరిగా కోర్టు తీర్పు ఖరారు అయిన తరువాత, నేరారోపణ చేసిన వ్యక్తి ముద్దాయిల ప్రభావానికి ప్రలోభానికిలోనై, కోర్టు విచారణలోఋజువైన తన నేరారోపణను ఉపసంహరించు కోబోతే, అట్టి ప్రయత్నం 'కోర్టు ధిక్కారం' క్రిందికి రాదా? దేశంలో అమలులోవున్న న్యాయంవ్యవస్థ స్థితి యిలా వుంది.

# ఒపీనియన్: 128

రాచరికాన్ని, సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించే ప్రయత్నంలో, వాటిని రూపుమాపే కృషిలో మతతత్వాని ప్రోత్సహించవచ్చునా? రాచరికానికి, మతతత్వానికి 'పోరాటం' సంభవించినప్పుడు, కమ్యూనిజాన్ని, సోషలి జాన్ని కావాలనుకునేవారి పాత్ర ఎలా వుండాలి? అదే పరిస్థితులలో పెట్టుబడిదార్ల ప్రవర్తన ఎలా వుంటుంది? రాచరికం, మతతత్వం, పెట్టుబడిదారితనం (బూర్జువా) ఈ మూడింటిలో పరస్పరం 'పోరాటం' ప్రారంభమైతే లేదా ఏ రెండింటిలోనైనా యిదే పరిస్థితి సంభవిస్తే 'సోషలిస్టు' దేశాల పాత్ర ఎలా వుండాలి? కమ్యూనిస్టు దేశాలు ఏ విధంగా వ్యవహరించాలి? ఈ మూడింటి మధ్య సఖ్యత, సహకారం వర్ధిల్లుతున్నప్పుడు సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఏ విధంగా ప్రవర్తించాలి. వారి విదేశాంగ విధానం స్వరూప స్వభావం ఎలా వుండాలి? అలాగే విదేశీ పెట్టుబడిదార్లకు, స్వదేశీ పెట్టుబడిదార్లకు, అంతర్జాతీయ బూర్జువాకి జాతీయ బూర్జువాకి 'పోరాటం' లేదా 'పోటీ' యేర్పడితే కమ్యూనిస్టుల సోషలిస్టుల పాత్ర ఏమిటి?

జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉదమ్య స్వరూప స్వభావాలకు, సిద్ధాంతాలకు, వాటి జయాపజయాలకు, పై ప్రశ్నలు పెద్ద సవాలుగ వున్నాయి.

# ఒపీనియన్: 129

మార్కెట్‌లో కొరతవుంటె, ఉత్పత్తికి గిరాకీ వుంటుంది. పెట్టుబడి దార్లకు లాభం పెరుగుతుంది. ఆ మేరకు కొనుగోలుదారుకి లేదా వినియోగదారునికి జీవించడం కష్టమైపోతుంది. అందుకే ఉత్పాదన శక్తిని, ఉత్పత్తిని తగిన అదుపులో వుంచుకోవడం పెట్టుబడిదార్ల ప్రథమ కర్తవ్యం. ఉత్పాదనశక్తి, ఉత్పత్తి, వినిమయం వీటికి ఒకదాని కొకటి సంబంధం లేకుండా చేయగలగడం పెట్టుబడిదారీ విధానంలో ఒక ముఖ్యమైన సామర్ధ్యం. సమ్మెలు ప్రోత్సహించడం, లాకౌట్ చేయడం తద్వారాపనిరోజులను వృధాచేసి ఉత్పాదన శక్తిని, ఉత్పత్తికి తగిన 'డిమాండ్' పద్ధతిలోతమ అదుపులో వుంచుకోవడం ఉత్పత్తిదార్ల నేర్పరత్వం. ఆ పరిస్థితి చేయిదాటిపోతే, తగిన అవకాశం పుష్కలంగా లభించకపోతే, తప్పనిసరి పరిస్థితులలో ఉత్పాదక శక్తినిపూర్తిగానో, మరికాస్త ఎక్కువగానో వినియోగించవలసి వస్తే, ఆ మేరకు ఉత్పత్తి డిమాండ్‌ను తగ్గించే పరిస్థితులు వస్తే, 'బ్లాక్ మార్కెట్'ను సృష్టించడం ద్వారా, మార్కెట్‌ను తమ అదుపులో వుంచుకుంటూ, ఉత్పత్తికి డిమాండ్‌ను అధికం చేయడం ద్వారా  అత్యధిక లాభాలు గడించడం, ఆ విధంగ వినిమయదార్లను దోపిడీ చేయడం పెట్టుబడిదార్లకు, బడా వ్యాపారులకు అలవాటు. ఈ విషయంలో టోకు వ్యాపారస్తుల గిరాకీ సామర్ధ్యం అత్యధికంగా వుంటుంది.

ఉత్పత్తి–పంపిణీ–కొనుగోలుశక్తి, వీటిని ప్రజాదృష్టితో, వినిమయ దృక్పథంతో పరిశీలించి అమలు చేయడం ప్రభుత్వ విధానమై వుండాలి.

# ఒపీనియన్: 130

దేశ సమస్యలు నిత్యనూతనంగ వుంటె, నాయకులకు, పాలకులకు 'గిరాకీ' వుంటుంది. 'ప్రజాసేవ' చేయడానికి స్వార్ధం మూర్తీభవించిన దోపిడీ నాయకులకు ఎంతో అనుకూలత వుంటుంది. అందుకే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, స్వదేశీ పాలన ప్రారంభమై ఇన్ని సంవత్స రాలైనా దేశ సమస్యలు దినదినాభివృద్ధి అవుతున్నాయి. నాయకులు, పాలకులు చేసే 'ప్రజాసేవ' 'నిత్య కళ్యాణం– పచ్చతోరణంగ' వుంది!

ప్రజాస్వామ్యం కోసం వ్యక్తిపూజను, సోషలిజం కోసం దారిద్ర్యాన్ని, సెక్యులరిజం కోసం కులమత వర్గ ద్వేషాలను మన నాయకులు పాలకులు పెట్టి పోషిస్తున్నారు. అందుకే బ్రిటీష్‌వారి పాలన జరిగిన కాలంలో కంటే, స్వదేశీ ప్రభువుల కాలంలో వ్యక్తి పూజ, దారిద్ర్యం, కులమత వైషమ్యాలు తారాస్థాయికి చేరుతున్నాయి. దేశంలోని రాజకీయపార్టీలు, ప్రభుత్వం సంరక్షణ ద్వారానే యివి బలిసి పోతున్నాయనేది స్పష్టం. నిజానికి భారతదేశంలో రాజకీయం, యీ సాంఘిక విధానం మీద మాత్రమే ఆధారపడి సాగుతోంది. రాజ్యాధి కారం కోసం, తన కుటుంబ స్వార్థం కోసం, తన వారి కోసం ప్రతి రాజకీయవాది (రాజకీయవేత్తకాదు) 'ప్రజా సేవ' చేయడం జరుగు తోంది. నీతి నియమం గాలికి కొట్టుకుపోయి, స్వార్థం, మోసం, దగా ప్రస్తుత రాజ్యాన్ని ఏలుతున్నాయి.

# ఒపీనియన్: 131

రాజకీయవాది-రాజకీయవేత్త, శాస్త్రజ్ఞుడు-శాస్త్రవేత్త, విద్యావంతుడు లేక విద్యాధికుడు - విద్యావేత్త, తాత్వికుడు - తత్త్వవేత్త పారిశ్రామికుడు - పారిశ్రామికవేత్త, ఈ జంట పదాలలో భావభేదం చాలావుంది. స్థూలంగా ఆలోచిస్తే, పెద్ద భేదం కన్పించక పోయినా, సూక్ష్మంగా పరిశీలన చేస్తే, ఈ పరస్పర విరుద్ధాలు. బ్రతకడం కోసం తినడం, తినడంకోసం బ్రతకడం అనే రెండు పదాలలో ఎంత భావభేదం వుందోపై జంట పదాలలో అంత తేడా వుంది. అయితే ఆర్థికపరంగా ఆలోచనచేస్తే పారిశ్రామికుడు, పారిశ్రామికవేత్త అనే జంట పదాలు భావభేదం మిగతా పదాలకు కొంత భిన్నంగా వుంటుంది.

తనని ప్రధానంగా భావించుకుని, సర్వస్వాన్ని తనకోసం వుప యోగించుకునే 'లౌకిక' బుద్ధి కలిగి వుండడం ఆ విధంగా 'శ్రమించడం' రాజకీయవాది లక్షణం, లక్ష్యం. స్వార్థం మూర్తీభవించడం యిందులో విశేషం. అలాకాక, విశాల దృక్పథంతో, శాశ్వత సత్ఫలితాలు సమాజానికి కలిగేవిధంగా, తనని తాను, అర్పితమై, కృషి చేయడం 'వేత్త' లక్షణం, లక్ష్యం. ఆ మేరకు అవసరమైన స్వార్థం మాత్రమేవుంటుంది.

'వాది', 'వేత్త' మధ్య యింత భేదం వుండగా గాడిద-గుర్రం ఒకటను కునే ధోరణిలో మనిషి నాగరికత సాగుతోంది.

# ఒపీనియన్: 132

చట్టాన్ని సొంతానికి వుపయోగించుకోవడం, అందుకు తగిన మార్పులు చట్టానికి చేయడం, ఒక్కొక్కసారి ఎట్టి మార్పు చేయకుండానే, స్వేచ్ఛగ తమకి యిష్టం వచ్చినట్లు, లాభం చేసే పద్ధతిలో అన్వయించుకుని, అమలు జరుపుకోవడం భారత దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అమలు జరుగుతోంది. ఇదే ప్రజాస్వామ్యమని ప్రచారం చేసుకుంటున్నారు. పలుకుబడిగలవారి పొగరును అదుపులో పెట్టలేని, పైపెచ్చు వారి దారి సులువు చేయడానికి న్యాయవ్యవస్థ వుపయోగపడుతుంది. హంగులేని వారిని 'నేరం' ఋజువు చేసి (అలాటి అవసరం కూడ లేకుండానే) శిక్షించడం స్వతంత్ర భారతదేశంలోని న్యాయవ్యవస్థ నిర్వాహకం. రౌడీలకు, పదవిలో వున్నవారికి, వారికి సంబంధించిన వారికి భయపడి సమాజం మీదికి స్వేచ్ఛగ వదిలేసే రాజకీయం, న్యాయవ్యవస్థ యీనాడు భారతదేశంలో అమలులో వుంది. అలాటి వారిని జై కొట్టి, పూజించుకునే స్థితిలో సాంఘిక వ్యవస్థ వుంది.

ఏమైనా 'నోరుగలవాడిదే రాజ్యం' అనే ఫ్యూడల్ విధానం ప్రజాస్వామ్యం పేరుతో అమలు జరుగుతోంది.

# ఒపీనియన్: 133

క్రీస్తు శకానికి, క్రైస్తవమతానికి మూల పురుషుడైన జీసస్ జన్మించిన తేదీ (డిసెంబర్ 25) అని క్రైస్తవుల నమ్మకం. ఆ నమ్మకంతోనే ప్రపంచ మంతా ఎంతోకాలం నుండి క్రీస్తు పుట్టిన రోజుగా క్రిస్టమస్ పండుగ జరుగుతోంది. బహుశా క్రైస్తవులకు యిది అతి ముఖ్యమైన పండుగ.

అయితే ప్రస్తుతం అమలులోవున్న క్రీస్తు శకానికి మూల పురుషుడైన క్రీస్తు జన్మదినం శకానికి కొలమానమైన సంవత్సరానికి చివర ఎందు కొచ్చింది? అనేది ఒక ప్రశ్న. శకపురుషుని జన్మదినంతోనే సంవత్సరం ప్రారంభమై, శకం లెక్కబెడుతూ వుండాలి. అలాకాక, జనవరి ఒకటవ తేదీ సంవత్సరం ఆరంభంగాను, శక పురుషుని జన్మతేదీ డిశంబరు ఇరవై ఐదవ తేదీ (దాదాపు సంవత్సరం చివరి రోజులలోని) కావడం క్రీస్తు శకాన్ని గురించి, దాని ప్రారంభం గురించి, అది స్థిరపడిన పద్ధతి గురించి అనుమానాలు, ఆలోచనలు కలుగుతున్నాయి.

ఇంతకూ క్రీస్తు జన్మించిన తేదీ గురించి తగిన ఆధారాలు కన్పించడంలేదు. అలాగే ఆయన మరణానికి సంబంధించిన స్పష్టమైన వివరాలు లభించడం లేదు (బైబిల్ గ్రంథంలోని విషయాలు, వివరాలు మత ప్రచార సంబంధమైనవి మాత్రమే గాని, దాఖలాలు కాదు. అవి కేవలం మతవిశ్వాసం మీద ఆధాపడినవి) చరిత్ర పరిశోధన, భవిష్యత్‌లోనైనా, క్రీస్తుకు సంబంధించిన అనేక నూతన విషయాలు వెల్లడి చేయవచ్చు. ఇంతవరకు నమ్మకంతో అనుసరించబడుతున్న అనేక విషయాలు 'తారుమారు' కావచ్చు. ఇది స్పష్టమే!!?